

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

సంపుటి11 | సంచిక 70

సోమవారం | 1 జనవరి 2018 | విజయవాడ | పేజీలు 12+12 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్య మాసం, శుక్ల పక్ష తిథి : చతుర్దశి ఉ.11.29, మృగశిర మ.3.20, వర్జ్యం రా.11.09 నుంచి 12.37 వరకు, రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు; దుర్ముహూర్తం: మ.12.24 నుంచి 1.12 వరకు తిరిగి మ.2.46 నుంచి 3.34 వరకు, సూర్యోదయం : ఉ. 6.50 గం; సూర్యాస్తమయం: సా. 5.49 గం.

పేదల సంక్షేమమే మా లక్ష్యం

నూతన సంవత్సర వేళ ప్రజలకు సీఎం చంద్రబాబు లేఖ

• పేదల సంక్షేమమే మా లక్ష్యం • ఏపీ ప్రజలకు 24 గంటలు సేవలు • ఈ 42 మాసాలూ ఒక మహాక్రతువు జరిపాం • ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీ అందించే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించాం • మన అమరావతి గురించి ప్రపంచం ఎదురుచూస్తోంది • సహేతుకత లేకుండా సాగిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యాం • ఏటా నవ నిర్మాణదీక్ష చేపడుతున్నాం • రైతు రుణభారాన్ని భుజానికెత్తుకుని ఉపశమనం చేశాం • అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం • కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల్లో వరి పండించాం • ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు • ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చాం • మౌలిక సదుపాయాల కల్పనలో చురుగ్గా పనిచేస్తున్నాం • చౌక ధరల దుకాణాలను చంద్రన్న మాల్స్‌గా తీర్చిదిద్దుతున్నాం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించిన ఒక లేఖ రాశారు. కాలగమనంలో కొత్త మజిలీకి చేరామని, ప్రభుత్వ పగ్గాలు చేపట్టి మూడున్నరేళ్లు గడిచి 2018కి స్వాగతం చెప్పే ఇంత మంచి తరుణంలో నా ఆలోచనలను మీతో పంచుకుందామని మీకు ఈ లేఖ రాస్తున్ననని పేర్కొన్నారు. ఈ 42 మాసాలూ ఒక మహాక్రతువు జరిపాం. మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని మిషన్‌మోడ్‌తో పనిచేయించాం. అనితర సాధ్యమైన ఫలితాలు సాధించాం. అనేక అంశాలలో ఈ రాష్ట్రాన్ని దేశానికే ఒక ఉత్తమ నమూనాగా నిలిపాం. మొన్ననే భారత రాష్ట్రపతి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూసి ఆశ్చర్యపోయి మనల్ని ప్రశంసించి వెళ్లారు. దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీ అందించే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును వారి సువర్ణ హస్తాలతో ప్రారంభించుకున్నాం. ఇవాళ ఆంధ్రప్రదేశ్ అంటే ఒక హ్యాపెనింగ్ స్టేట్. ఇప్పుడు మన రాష్ట్రం ప్రపంచంలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మనతో కలిసి పనిచేయడానికి అనేక దేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి భూమి నలుచెరగుల నుంచి పెట్టుబడిదారులు వెల్లువలా వస్తున్నారు అని సిఎం చంద్రబాబు నూతన సంవత్సర వేళ ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలతో.. ఒక లేఖలో తెలిపారు.





మేజర్‌న్యూస్, విజయవాడ: మన అమరావతి గురించి ప్రపంచం ఎదురు చూస్తోంది. కాలచక్ర భ్రమణంలో ఒకసారి వెనక్కి చూసుకుంటే 1996 నుంచి 2004 వరకు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధికి మనం బలమైన పునాదులు వేసుకున్నాం. దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగాం. ఆ తరువాత వచ్చిన పదేళ్ల కాలం దగా పడ్డ దశాబ్దం. అది చరిత్రకొక చెరగని మచ్చగా నిలిచిపోయింది. 2014లో సహేతుకత లేకుండా సాగిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యాం. 60 ఏళ్లుగా శ్రమించి నిర్మించుకున్న సంస్థలను, సంపాదించుకున్న సంపదను కోల్పోయి, రాజధాని ఎక్కడో తెలియని పరిస్థితులలో, కట్టుబట్టలతో, అప్పుల భారంతో దిక్కుతోచకుండా బయట కొచ్చాం. ఆనాడు అశాస్త్రీయంగా జరిపిన రాష్ట్ర విభజనతో తల్లడిల్లి పోయాం. పెనుసంక్షోభంలో పడ్డాం. ఐతే, ఆ సంక్షోభంలోనే అవకాశాలను వెతుక్కు న్నాం. ఒక ఉద్యమస్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకుం టున్నాం. మనకు దక్కిన అరుదైన అవకాశంగా భావించి ప్రపంచశ్రేణి రాజధానిని నిర్మించుకుంటున్నాం. రూ.16 వేల కోట్ల

మిగతా 2లో

అలక తీరిన నితిన్ పటేల్



• షా చొరవతో చల్లబడిన నితిన్ పటేల్ • తిరిగి విధుల నిర్వహణకు అంగీకారం • శాఖల కేటాయింపు విషయంలో నితిన్ అసంతృప్తి • హోదాకు తగినట్టు శాఖలను కేటాయించడంపై షా హామీ

11లో

సీఆర్‌పీఎఫ్ శిక్షణ కేంద్రంపై

ఉగ్ర దాడి



• జిల్లా పోలీస్ కాంప్లెక్స్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి • గ్రనేడ్లు విసిరి విచక్షణా రహితంగా కాల్పులు • నలుగురు జవాన్లు మృతి ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు • గాయపడిన జవాన్లు ఆసుపత్రికి తరలింపు


తలైవా అరంగేట్రం

రాజకీయాల్లోకి వస్తా: రజనీకాంత్

• వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా కొత్త పార్టీ స్థాపిస్తా • రాజకీయాల్లో కొత్త కానీ..రాజకీయాలకు కాదు • దేశ రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి • వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది • ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మూడేళ్లలోనే రాజీనామా చేస్తాను • రాజకీయ నాయకులు ప్రజలను దోచుకుంటున్నారు • నిర్ణయం నేను ఇప్పుడు తీసుకోకపోతే పెద్ద తప్పు చేసిన వాడినవుతాను • అభిమానులతో సమావేశంలో ప్రకటించిన తలైవా • రజనీకి కమల్ శుభాకాంక్షలు • రాజకీయాల్లోకి రజనీపై వర్మ స్పందన

చెన్నై: రాజకీయ రంగ ప్రవేశంపై కొనసాగుతున్న ఉత్కంఠకు తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తెరదిం చారు. తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. చెన్నైలో ఆరో రోజు అభిమానులతో సమావేశమైన రజనీ రాజకీయ రంగ ప్రవేశంపై స్పష్టత ఇచ్చారు. దేశ రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని, వాటిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లోగా కొత్త పార్టీ స్థాపిస్తానని, తమ పార్టీ 234 స్థానాల్లోనూ పోటీ చేస్తుందని తెలిపారు. డబ్బు, పదవి ఆశతో మాత్రం రాజకీయాల్లోకి రావడం లేదన్నారు. ప్రస్తుతం రాజ్యం ఏలుతున్న పార్టీలు ప్రజలకు దోచుకుం టున్నాయి. నేనురాజకీయాల్లోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మూడేళ్లలోనే రాజీనామా చేస్తాను. నేను ఏర్పాటు చేయబోయే పార్టీ నిజం, పని, అభివృద్ధి అనే మూడు మంత్రాలతో నడుస్తుంది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ చెడిపోయింది. తమిళనాడు రాష్ట్రం గురించి ఇతర రాష్ట్రాలు హేళన చేసి మాట్లాడుతున్నాయి. రాజకీయాల్లోకి రావాలన్న నిర్ణయం నేను ఇప్పుడు తీసుకోకపోతే పెద్ద తప్పు చేసినవాడినవుతాను. ప్రజాస్వామ్యం పేరిట కొందరు రాజకీయ నాయకులు ప్రజలను దోచుకుంటున్నారు

మిగతా 2లో





పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సూర్య నూతన సంవత్సర శుభాకాంక్షలు

– సూర్య యాజమాన్యం

డీజీపీ సాంబశివరావుకు వీడ్కోలు



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

అంతా ఇంతే!



ఈ ఒక్కరోజు కాదు ఏడాదంతా హేపీగా ఉంచుతానని ప్రమాణం చేస్తేనే తీసుకుంటా.



మహిళలకు హజ్ అనుమతి

• రాబోయే గణతంత్ర దినోత్సవాల్లో ఘనత నమోదు కానుంది • 10 ఆసియాన్ దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరు • భారతీయులందరికీ జనవరి 26 చారిత్రక పండుగ • భారతీయ ప్రజాస్వామ్యం కొత్త ఓటర్లను ఆహ్వానిస్తోంది • ఓటు హక్కును పొందబోతున్న యువతకు అభినందనలు • దేశం కులతత్వం, మతతత్వం, ఉగ్రవాదం నుంచి విముక్తి పొందాలి • అప్పుడే సరికొత్త భారతావని ఆవిష్కృతమవుతుంది • మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ముస్లిం మహిళలు హజ్ యాత్రకు వెళ్లాలంటే తప్పకుండా మగవారి తోడుతోనే వెళ్లాల్సి ఉందనే విషయం తన దృష్టికి వచ్చిందని ఒకవేళ వారి వెంట పురుషులు లేకపోతే హజ్ యాత్రకు వెళ్లనిచ్చేవారు కాదన్నారు. కానీ ప్రస్తుతం ఆ విధానం మారింది. ఈ ఏడాది హజ్ యాత్రకు పురుషుడి తోడు లేకుండా వెళ్లేందుకు దాదావు 1300 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాగా ప్రతి సంవత్సరం జరుపుకునే గణతంత్ర దినోత్సవాల కన్నా 2018లో నిర్వహించే గణతంత్ర దినోత్సవాల్లో గొప్ప ఘనత నమోదు కాబోతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. 2018 జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవాలకు 10 ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం)

మిగతా 6లో

సాగుకు నిరంతర విద్యుత్‌కు శ్రీకారం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను ఆదివారం అర్ధరాత్రి నుంచి శ్రీకారం చుట్టారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ మొట్ట మొదటిసారిగా రైతాంగానికి నిరంతరం ఉచితంగా విద్యుత్ సరఫరాను నూతన సంవత్సర కానుకగా అమలు చేస్తున్నది. 2018 కొత్త సంవత్సరం ప్రారంభమైన క్షణ ం నుంచి సరఫరాను ప్రారంభించారు. జనవరి 1వ తేదీలోకి అడుగుపెట్టిన మొదటి నిమిషం నుంచి నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుంది. కొత్త సంవత్సరం పూట రైతుల జీవితాల్లో ఆనందాల వెలుగులు విరజిమ్మాలన్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంకల్పం సాకారమైంది. 24 గంటల విద్యుత్ సరఫరాకు ఎలాంటి అవాంతరాలు రాకుండా ముందుగానే అన్ని రకాల ప్రయోగాలు నిర్వహించి, లోపాలను సరిదిద్దుకొని, రాష్ట్ర విద్యుత్ సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటల విద్యుత్‌ను ఉచితంగా విద్యుత్ పంపిణీని ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షిస్తున్నారు.

ఇందుకోసం సుమారు 7500 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా వేశారు. వచ్చే యాసంగిలో (మార్చి–ఏప్రిల్) డిమాండ్ పెరిగే ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే అటు సీఎం కేసీఆర్, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకం౯రావు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్షిస్తూ.. పరిస్థితులను అంచనా వేశారు. ట్రాన్స్‌కో నుంచి వచ్చే సూచనల ప్రకారం క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది, అధికారులు, ఇంజినీర్లు పర్యటి౯స్తూ.. పర్యవేక్షిస్తున్నారు. ఉచిత విద్యుత్ సరఫరా ప్రారంభమయ్యాక ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కనెక్షన్లను, సబ్ స్టేషన్లను సందర్శించి, విద్యుత్ శాఖల సిబ్బంది, అధికారులతోపాటు, అందుబాటును బట్టి రైతులతోనూ మాట్లాడుతారు.

అభివృద్ధే మా బాట



• పేదల సంక్షేమమే మా లక్ష్యం • ఏపీ ప్రజలకు 24 గంటలు సేవలు • ఈ 42 మాసాలూ ఒక మహాక్రతువు జరిపాం • ప్రతి ఇంటికీ నెట్ కనెక్టివిటీ అందించే ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించాం • మన అమరావతి గురించి ప్రపంచం ఎదురుచూస్తోంది • సహేతుకత లేకుండా సాగిన రాష్ట్ర విభజనతో కుదేలయ్యాం • ఏటా నవ నిర్మాణదీక్ష చేపడుతున్నాం • రైతు రుణభారాన్ని భుజానికెత్తుకుని ఉపశమనం చేశాం • అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం • కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల్లో వరి పండించాం • ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు • ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చాం • మౌలిక సదుపాయాల కల్పనలో చురుగ్గా పనిచేస్తున్నాం • చౌక ధరల దుకాణాలను చంద్రన్న మాల్స్‌గా తీర్చిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి) బడ్జెట్ లోటు, చిన్నాభిన్నమైన పాలనావ్యవస్థ, రాజధాని ఎక్కడో తెలియని అనిశ్చితి, అంతటా అయోమయం ఉన్న సంక్షోభ సమయంలో పగ్గాలు చేపట్టి రాష్ట్రాన్ని పట్టాలపైకి ఎక్కించడం అంత సులభమని అనుకోలేదు. ఎదురైన సంక్షోభాన్ని ఎవరైతే సదవకాశంగా మలుచుకుంటారో వారే అంతిమంగా విజేతలవుతారు. ఏనాడైతే కాంగ్రెస్ పాలకులు మన గుండెల్లో కరకు కత్తులు దింపారో ఆనాడు ఒకే ఒక లక్ష్యాన్ని మన ముందుంచుకున్నాం. కసితో కలిసికట్టుగా కృషిచేసి ఈ రాష్రాన్ని ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. దానికి అవసరపడే కార్య ప్రణాళికల్ని రూపొందించుకుని ముందుకు అడుగులు వేశాం. సుస్థిర ఆర్థిక వృద్ధి లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు మహా సంకల్పం చెప్పుకున్నాం. దాన్ని అడుగడుగునా గుర్తుచేసుకునేందుకు ఏటా నవ నిర్మాణదీక్ష చేపడుతున్నాం. మనకు ఎదురైన ప్రతి కష్టాన్ని మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నాం. ఆరోజు ఆర్థికంగా ఎంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా రైతు రుణభారాన్ని భుజానికెత్తుకుని ఉపశమనం చేశాం. సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పింఛన్లను ఐదురెట్లు చేశాం. అస్తవ్యస్థంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టడమే కాకుండా స్వల్పకాలంలోనే మిగులు విద్యుత్ సాధించి, నిరంతర వెలుగులు అందించే రాష్ట్రంగా నిలబడ్డాం. ప్రాథమిక రంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే కృషిని ముమ్మరంగా సాగిస్తున్నాం. మునుపెన్నడూ లేనంతగా ఈ రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. భూసార పరీక్షలు జరిపించి, సూక్ష్మ పోషకాలు అందిస్తున్నాం. పంటకుంటలు, రెయిన్‌గన్లు, మొబైల్ లిఫ్ట్ వంటి వినూత్న పద్ధతుల ద్వారా సాగురంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పెద్దఎత్తున వ్యవసాయ యాంత్రీకరణ చేపట్టాం. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం. సేద్యంలో సాంకేతికత అనివార్యం, అవశ్యం. ఈ దిశగా విశాఖలో అగ్రిటెక్ సదస్సు నిర్వహించాం. భూసార పరీక్షలు, విత్తనాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాం. సహజ వనరుల పరిరక్షణలో భాగంగా ఏరువాక, జలసిరికి హారతి కార్యక్రమాలతో పాటు ఇక ఏటా సూర్య ఆరాధన నిర్వహిస్తాం. వరుసగా వచ్చిన గోదావరి, కృష్ణా పుష్కరాలను వైభవంగా నిర్వహించి ఈ పుణ్యనదులతో మనకున్న అనుబంధాన్ని చాటుకున్నాం. నీటిపారుదల రంగంలో పట్టిసీమకు ముందు, పట్టిసీమ తరువాత అని చెప్పుకునేలా ఒక కొత్తశకాన్ని ఆరంభించాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ఫలాలను ఇంకాస్త ముందే అందుకోవాలన్న తపనతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం నేడు కృష్ణాడెల్టా రైతాంగానికి వరప్రదాయినిగా మారింది. మూడేళ్లుగా ఎగువ కృష్ణా ప్రాజెక్టులనుంచి నీరు రాకపోయినా కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాల్లో వరి పండించాం. పట్టిసీమతో కృష్ణా–గోదావరి నదుల అనుసంధానం సాధించి పవిత్ర సంగమం సృష్టించాం. రెట్టించిన ఉత్సాహంతో రేపు గోదావరి–కృష్ణా–పెన్నా సహా రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం జరిపి మహా సంగమం ఆవిష్కృతం చేయడానికి సన్నద్ధం అవుతున్నాం. దేశ సాగునీటిపారుదల చరిత్రలో ఒక అద్భుతంగా చెప్పతగ్గ పోలవరం ప్రాజెక్టును నిరంతర, నిశిత పర్యవేక్షణతో శరవేగంతో నిర్మిస్తున్నాం. ఇది రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, వ్యవసాయ స్థిరీకరణకు దోహదపడుతుంది. దేశంలోనే కాదు, ఈ భూప్రపంచంలోనే అత్యంత శోభాయమానమైన రాజధాని నిర్మాణానికి ఉపక్రమించాం. ప్రపంచ ప్రఖ్యాత రూపకర్తలు అందించిన పరిపాలన నగరపు ఆకృతులకు ఆమోదముద్ర వేశాం. కొత్త ఏడాది ఆరంభంలోనే నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. ప్రజారోగ్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి ఎన్టీఆర్ ఆరోగ్యసేవ, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వంటి వినూత్న పథకాలను తీసుకొచ్చాం. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు ప్రతి దశలోనూ అవసరమయ్యే వైద్య, ఆరోగ్య సంరక్షణ చర్యలన్నీ తీసుకుంటున్నాం. ఖరీదైన వైద్యాన్ని సామాన్య, మధ్య తరగతి వారికి అందుబాటులోకి తెచ్చాం. ఏపీని ఒక ఫార్మా హబ్‌గా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ప్రముఖ ఫార్మా కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించాయి. విద్యారంగంలో రాష్ట్రాన్ని



మేటిగా నిలపాలన్నదే ధ్యేయం. ప్రపంచశ్రేణి అత్యుత్తమ విద్యకు ఏపీని గమ్యస్థానంగా తీర్చిదిద్దే కృషిలో నిమగ్నమయ్యాం. ఐఐటీ, ఎన్ఐటీ, ఐసర్, నల్సర్, ఎయిమ్స్ వంటి జాతీయస్థాయి అత్యున్నత విద్యా సంస్థల ఏర్పాటుతో నవ్యాంధ్రప్రదేశ్ నాలెడ్జ్ హబ్‌గా మారుతోంది. ప్రసిద్ధ వైద్య కళాశాలలు అమరావతికి వస్తున్నాయి. ఎస్ఆర్ఎమ్, విఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలు ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. పెట్రోలియం, మెరైన్, లాజిస్టిక్ యూనివర్శిటీలు రాబోతున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్నాం. వ్యాపార అనుకూలతలో ప్రపంచబ్యాంక్ ర్యాంకింగ్‌లో తొలిస్థానం సంపాదించాం. పెట్టుబడులకు స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పి ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షిస్తున్నాం. ఆటోమొబైల్ రంగంలో ఇసుజు, కియా, హీరో, అశోక్ లేల్యాండ్, అమరరాజా, అపోలో తదితర దిగ్గజ సంస్థలు వచ్చాయి. వ్యవసాయాధారిత, ఆహారశుద్ధి పరిశ్రమలు వస్తున్నాయి. గుడ్లు, పండ్లు, ఉద్యాన ఉత్పత్తులలో అగ్రగామిగా ఉండటం మాకు కలిసివచ్చే అంశం. వస్త్ర పరిశ్రమ, మొబైల్ పరిశ్రమలు రాష్ట్రానికి పెద్దఎత్తున వచ్చాయి. ఫాక్స్‌కాన్, ఎంఐ, జియోనీ ఇప్పటికే కొలువుదీరాయి. గూగుల్ ఎక్స్, హెచ్‌సీఎల్ వంటి మేటి ఐటీ సంస్థలు వస్తున్నాయి. విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలలో ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల అభివృ౯ద్ధికి ప్రణాళికలు రూపొందించాం. అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశం వున్న టెక్స్‌టైల్స్, అపెరల్ రంగాలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. విశాఖలో రెండు పర్యాయాలు జరిపిన సీఐఐ భాగస్వామ్య సదస్సులలో పెట్టుబడులు పెద్దఎత్తున వచ్చాయి. ముచ్చటగా మూడోసారి ఫిబ్రవరి 24, 25, 26 తేదీలలో నిర్వహించబోయే భాగస్వామ్య సదస్సు అనూహ్య ఫలితాలను అందిస్తుందని ఆశిస్తున్నాం. మౌలిక సదుపాయాల కల్పనలో చురుగ్గా పనిచేస్తున్నాం. పోర్టులు, ఎయిర్‌పోర్టులలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోంది. ఇప్పటికే 6 పోర్టులలో పూర్తిస్థాయి కార్యకలాపాలు సాగుతున్నాయి. మరో 8 ఓడరేవులను అభివృ౯ద్ధి చేస్తున్నాం. సముద్ర ఆధారిత వాణిజ్యం పెంపొందించి మన ఆంధ్రప్రదేశ్‌ను తూర్పుతీరవు ముఖద్వారంగా మార్చాలన్నదే ఆశయం. ప్రస్తుతం వున్న 6 విమానాశ్రయాలకు అదనంగా మరో 6 విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, ఒక కోస్టల్ ఎకనామిక్ జోన్ రానున్నాయి. విశాఖ–చెన్నయ్, బెంగళూరు–చెన్నయ్, బెంగ ళూరు–కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటుతో ఈ రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారిపోనుంది. రాష్ట్రంలో నగరీకరణ ముమ్మరంగా జరుగుతోంది. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాలను 3 మెగా సిటీలుగా అభివృద్ధి చేస్తున్నాం. మరో 14 స్మార్ట్ నగరాలను రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఇంటికి 100 శాతం గ్యాస్, విద్యుత్ కనెక్షన్లను అందించాం. గ్రామాలలో 10,044 కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారులను నిర్మించాం. మరో 3 వేల కి.మీ. సీసీ రోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. మూడేళ్ల క్రితం 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో మొదలైన మన ప్రయాణం ఇప్పుడు ఆ రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చింది. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్, ఇంధన సామర్థ్యం అంశాలలో భారతదేశానికే ఆదర్శంగా నిలిచాం. విద్యుత్ రంగంలో ఎన్ని పురస్కారాలు వుంటే అన్ని పురస్కారాలను కైవసం చేసుకున్నాం. కర్నూలులో ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ పార్క్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. త్వరలో 4,600 మెగావాట్ల సౌర, పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. యూనిట్ రెండు రూపాయిలకే సౌర విద్యుత్ అందించి సూర్యోదయ రాష్ట్రమనే పేరుకు సార్థకత తీసుకొస్తాం. సౌర, ఇతర సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి రంగంలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఏపీతో కలిసి పనిచేస్తుండటం సంతోషదాయకం. మహిళా సాధికారత సాధిస్తున్నాం. ప్రతి కుటుంబానికి నెలకు కనీసం రూ. 10 వేల ఆదాయం దక్కేలా సంకల్పించాం.

రాష్ట్ర ప్రజలకు సామాజిక భద్రత, నీటి భద్రత, ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, గ్యాస్ భద్రత కల్పిస్తున్నాం. 45 లక్షల పింఛన్లను ఇస్తున్నాం. పేదవాళ్లు కూడా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమైన పర్వదినాల్లో చంద్రన్న కానుకలను అందిస్తున్నాం. 28 వేల చౌక ధరల దుకాణాలను చంద్రన్న మాల్స్‌గా తీర్చిదిద్దుతున్నాం.

ఇందులో 500కు పైగా వస్తువులను రాయితీపై అందిస్తాం. రాష్ట్ర ప్రజలకు ఇది నూతన సంవత్సర కానుక. చంద్రన్న బీమాతో కార్మిక కుటుంబాలకు గుండె ధైర్యాన్ని ఇచ్చాం. ప్రభుత్వ ఉద్యోగులకు అండదండగా ఉన్నాం. పెద్దఎత్తున చేపట్టిన పట్టణ, గ్రామీణ గృహ నిర్మాణాలతో కొత్త ఏడాది గృహప్రవేశాలు చేయించబోతున్నాం. రాష్ట్ర ప్రగతే మంత్రంగా నాతోపాటు అడుగులు వేస్తూ మీరంతా ఈ ప్రగతి ప్రస్థానాన్ని ఇలాగే కొనసాగిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. సంక్రాంతి ఊళ్లో జరుపుకునే పండగయితే, జన్మభూమి–మా ఊరు ఊరికే పండగ. ఈ పండక్కి తెలుగువారు ఎక్కడున్నా రావాలి. సొంతగడ్డ రుణం తీర్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

గ్రేటర్‌లో పార్టీ బలోపేతంపై టీ-పీసీసీ నజర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌ః రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ దూకుడు కొనసాగిస్తున్నా, దాని ప్రభావం గ్రేటర్ హైదరాబాద్‌లో కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లో పార్టీ వరుస కార్య క్రమాలతో పార్టీ క్యాడర్‌లో జోష్ నింపేందుకు టీ–పీసీసీ నాయకత్వం ప్రయత్నిస్తుండగా, గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవరాల్లో రాజకీయ స్తబ్ధత నెలకొంది. అయితే రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మినహాయిస్తే హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు లోక్‌సభ స్థానాలున్నాయి. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క డివిజన్‌లోనే విజయం సాధించింది. ఇది ఆ పార్టీ కార్యకర్తల, నేతల మనోస్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీకి చాలా మంది నేతలే ఉన్నా, ఏ ఇద్దరూ కలసి చర్చించుకునే పరిస్థితి లేకపోవడం టీపీసీసీకి సంకటంగా మారింది. గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి గతంలోనే రాజీనామా చేసినట్టుగా మాజీమంత్రి దానం నాగేందర్ ప్రకటించినా దాన్ని టీ–పీసీసీ నాయకత్వం ఆమోదించలేదు. అయితే ప్రస్తుతం నాగేందర్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారా? లేదా? అన్నదానిపై స్పష్టత కొరవడింది. గతంలో గ్రేటర్ పరిధిలో రంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని నియోజకవర్గాలుండగా, ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల పర్యవేక్షణ బాధ్యతల్ని జిల్లా డీసీసీలకు అప్పగించారు. దీంతో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్‌కు నాగేందర్ సారథ్య బాధ్యతలు స్వీకరించే అవకాశాలు లేకపోగా, నూతన అధ్యక్షున్ని నియమించడంలోను టీ–పీసీసీ తాత్సారం చేయడం వల్లే పార్టీ పరిస్థితి అయోమయంగా తయారయిందని ఆపార్టీ నేతలంటున్నారు. మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ వంటి వారు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నప్పటికీ, మిగతా నేతలు, యోజకవర్గాల ఇన్‌చార్జీల పనితీరు అంతంతా మాత్రంగానే ఉన్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లుగా ఇకపై హైదరాబాద్ జిల్లాలోను నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలని టీ–పీసీసీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను, నియోజకవర్గ ఇంచార్జుల భారం వేస్తే ప్రయోజనం లేదని భావిస్తోన్న టీ–పీసీసీ నాయకత్వం, ఇకపై క్షేత్రస్థాయి నేతలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అడ్డుకుంటే ఖబడ్దార్..?



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌ః జాతీయ బి.సి కమిషన్ కు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్ట బద్ధత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిల్లును వ్యతిరేకించే నేతల ఇళ్ల ముందు ధర్నాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీ ఎంపీలు పార్టీలకతీతంగా మద్దతు ఇచ్చి, తమ సామాజిక వర్గానికి న్యాయమైన హక్కును పొందేందుకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ప్రసంగి స్తూ రాజకీయ పార్టీలు బి.సి లను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పేరుకే మనది ప్రజాస్వామ్య దేశం కాని ఆచరణ లో ధనస్వామ్య దేశంగా మారిపోయిందని విమర్శించారు. డబ్బున్న పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు డబ్బులతో పార్టీ టికెట్లు కొని, డబ్బులతో ఓట్లు కొని ఆ తర్వాత ఎన్నికైన పదవిని డబ్బు సంపాదనకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ–పార్లమెంట్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు 50 శాతం టికెట్లు బి.సి లకు ఇవ్వాలని కృష్ణయ్య కోరారు. ఆయా పార్టీలలో ఉన్న బి.సి. నాయకులు పార్టీలలో గంగిరెద్దుల లాగా తలలూపుకుం టూ ఉండటం కాదు. ఎదురు తిరిగి టికెట్లు తెచ్చుకోవాలని కోరారు. పార్లమెంట్ లో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో బి.సి లకు 50 శాతం రిజర్వేషన్లు పెంచాలని కృష్ణయ్య ప్రధాని౯మంత్రికి ఈ వేదిక ద్వార విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య భారతంలో బి.సి లకు రాజకీయంగా కనిస ప్రాతిని ధ్యం లభించడం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సేకరించిన గణాంకాల ప్రకారం గత 70 సంవత్సరాల గణాంకాలు పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, కేంద్ర–రాష్ట్ర మంత్రులు వివరాలు సేకరిస్తే బి.సి ల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదు. గత 70 సంవత్సరాల ప్రజాస్వామ్యంలో 56 శాతం జనాభా గల బి.సి లకు 14 శాతం ప్రాతినిధ్యం దాటలేదంటే రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలిసిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. అంతేకాదు. 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాల నుండి ఒక పార్లమెంట్ సభ్యులు లేరు. ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ కనిపిస్తుందని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా? ధనస్వామ్యమా? అని ప్రశ్నించారు. తెలంగాణా లో 119 యం.యల్.ఏ. లు ఉంటే బి.సి లు కేవలం 19మంది మాత్రమె ఉన్నారు. ఆంధ్రలో 175 మందిలో బి.సి లు మంది మాత్రమె ఉన్నారు. ఇంత తక్కువ ప్రాతినిధ్యం చూస్తే ఇదెలా ప్రజాస్వామ్యమవుతుంది. 56 శాతం జనాభా గల బి.సి లకు ప్రాతినిధ్యం ఏదని ప్రశ్నించారు. బి.సి లు ఓట్లు వేయడానికేనా అని ప్రశ్నించారు. బి.సి లకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలసిన ఆవశ్యకతను కృష్ణయ్య సమర్పించారు. అసెంబ్లీ–పార్లమెంట్ ఆంగ్లో–ఇండియన్లకు శాసన సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా నామినేటెడ్ పద్ధతిన ఇస్తున్నారు. కాని ఈ దేశంలో పుట్టిన 2600 బి.సి కులాలలో 2550 బి.సి కులాల వారు పార్లమెంట్ లో అడుగు పెట్టలేదు. ఈ కులాలకు ఎన్నికలలో పోటీ చేసే ఆర్థిక స్తోమత లేదు. జనాభా తక్కువగా ఉన్న కులాలను పట్టించుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితులలో ఈ కులాలకు చట్ట సభలలో ప్రవేశం సాధ్యం కావడం లేదు. ఈ దేశంలో పుట్టి ఈ దేశ సంపద సృ౯ష్టించిన కుల వృ౯త్తుల వారికి కూడా ఆంగ్లో–ఇండియన్ లాగా నామినేటెడ్ పద్ధతిపై చట్ట సభలకు పంపాలని డిమాండ్ చే శారు. భూపేష్ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్ బి.సి. సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నేతలు నందగోపాల్, యస్.రామలింగం, కోట్ల శ్రీనివాస్, భరత్, సురేష్ సాగర్, పగిళ్ళ సతీష్, యం.మహేందర్ గౌడ్ తదితరులు ప్రసంగించారు.



2017 బాబు పాలన వైఫల్యనామ సంవత్సరం

ఎన్. రఘువీరారెడ్డి

విజయవాడ, మేజర్‌న్యూస్ః ఏపీ సీఎం చంద్రబాబు నాయుడి 2017లో వైఫల్యపాలననుకొనసాగించారని ఏపీ పీసీసీ ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాబు వస్తే జాబు అని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన కొడుకు చిన్నబాబుకు మాత్రమే మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. 2017లో బాబు పాలన వైఫల్యనామ సంవత్సరంగా ముగిసిందని రఘువీరా ఎద్దేవా చేశారు. అంతేకాక బాబు జాబితాలో అన్నీ అపజయాలే అని ఆయన అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో బాబు సర్కారు రైతులను మోసం చేసిందన్నారు. ఇంటికి ఒక్క ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ యువతకు ఇచ్చిన హామీని సైతం అటకెక్కిందన్నారు.

ఈ మూడున్నర సంవత్సరాల బాబు పాలనలో ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పుకో దగ్గ ఐటీ కంపెనీ ఏపీవైపు చూడలేదని ఆయన అన్నారు. తొలుత గూగుల్ వంటి కంపెనీలు వస్తాయని చేసిన ప్రచారం బోగస్‌గా తెలిపోయిందని రఘువీరా పేర్కొన్నారు. స్విస్ చాలెంజ్ విషయంలోనూ చంద్రబాబు సర్కారుకు చుక్కెదురు అయిందని గుర్తు చేశారు. అంతేకాక ప్రత్యేక ప్యాకేజీ, నోట్ల రద్దు విషయంలో చంద్రబాబు వేసిన పిల్లిమొగ్గలు సొంత పార్టీ నాయకులనే విస్మయానికి గురి చేశాయన్నారు. కాంగ్రెస్ హయంలో చిత్తూరు జిల్లాకు వచ్చిన మన్నవరం ప్రాజెక్టును కూడా చంద్రబాబు కాపాడుకోలేకపోవడం మరో అతిపెద్ద ఫెయిల్యూర్ అని రఘువీరా అన్నారు

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

- దర్యాప్తునకు సిబ్బందిలో సామర్థ్యాలు పెంచుతాం
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు
- క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి కార్యాచరణ
- ఏపీ నూతన డీజీపీగా ఎం.మాలకొండయ్య



అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు, శాంతి భద్రతలు, పోలీసుశాఖకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేసి గుర్తించిన అంశాల ఆధారంగా ఏం చేయాలనేదానిపై కార్యాచరణ సిద్ధం చేసుకుంటానని ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీ ఎం.మాలకొండయ్య తెలిపారు. కులఘర్షణలు సహా అన్ని రకాల నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, అలాంటివి ఎక్కడెక్కడ చోటుచేసుకునేందుకు అవకాశ ముందో గుర్తించి నియంత్రణ చర్యలు చేపడతామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఏటా వేల మంది మరణిస్తున్నారని, పోలీసు, రవాణా, ఇతర శాఖలతో సమన్వయంగా వ్యవహరించి వాటికి అడ్డుకట్ట వేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా రోడ్డు భద్రత కమిటీలకు కావాల్సిన సహకారం అందిస్తామని చెప్పారు. వృద్ధి చెందుతున్న సాంకేతికతతోపాటే సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, వీటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలి. సిబ్బందిలో సామర్థ్యాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దర్యాప్తులో నాణ్యత పెరగాలని, అప్పుడే వీటిని నియంత్రించవచ్చన్నారు. తనకు ఉన్న 6నెలల సమయంలో నిజాయతీగా పనిచేసి పోలీసు శాఖలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా 1985 బ్యాచ్ ఐపీఎస్ అధికారి డా.ఎం.మాలకొండయ్య నియమితులయ్యారు. ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పోలీసు సంస్కరణల (సవరణ) ఆర్డినెన్సు-2017ను అనుసరించి ఆయన ఎంపిక, నియామక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. పూర్తిస్థాయి డీజీపీ హోదాలో పోలీసు బలగాల అధిపతిగా మాలకొండయ్య వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీజీపీ సాంబశివరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. నాలుగు రోజుల కిందటే కొత్త డీజీపీగా మాలకొండయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆ నిర్ణయానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా నలదలపూరు గ్రామానికి చెందిన మాలకొండయ్య వరంగల్ జిల్లా ములుగు ఏఎస్పీగా పోలీసుశాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు ఏసీబీ డీజీపీగా, అప్పా డైరెక్టర్‌గా, పోలీసు నియామక మండలి ఛైర్మన్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ వంటి కీలక పోస్టుల్లో పనిచేశారు. ఆదిలాబాద్, మెదక్, గుంటూరు జిల్లాల్లో ఎస్పీగా, ఏలూరు, గుంటూరు రేంజిల్లో డీఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. మాలకొండయ్య భార్య పూనం మాలకొండయ్య ఐఏఎస్ అధికారిణి. ఆమె ప్రస్తుతం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని నూతన డీజీపీగా నియమితులైన ఎం. మాలకొండయ్య చెప్పారు. సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, సాంకేతికత పెరిగే కొద్దీ సైబర్ క్రైం కూడా పెరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు ఆర్టీసీ ఎండీగా ఉన్న మాలకొండయ్య సోమవారం ఆంధ్రప్రదేశ్ డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీపీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ మిగతా వారితో కలిసి కృషి చేస్తామని అన్నారు. పోలీసు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఫీడ్ బ్యాక్ తీసుకుంటానని చెప్పారు.

టెక్నాలజీ పెరిగే కొద్దీ నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని, హైవేలపై రోడ్డు ప్రమాదాలను అరికడతామని, నేర ప్రవృత్తి ఉన్నవారిని వదిలేదిలేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసు అధికారులు ప్రజల సమస్యలు వినాలని మాలకొండయ్య సూచించారు.

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే నంబర్ వన్: డీజీపీ



(హైదరాబాద్,క్రైం బ్యూరో): తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. ఆయన ఇవాళ సిద్దిపేట జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈసందర్భంగా సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఐజీ స్టీఫెన్ రవీంద్ర ఉన్నారు. అనంతరం స్థానిక ఇందూర్ ఇంజనీరింగ్ కాలేజీలో పోలీస్ అధికారులతో డీజీపీ సమీక్ష నిర్వహించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతలు పునాదిలాంటివి... పోలీస్ వ్యవస్థను గత మూడేండ్లుగా కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో బలోపేతం చేసింది... ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ రాష్ట్రంలో సత్ఫలితాలను ఇస్తున్నది. ప్రజలను ప్రభుత్వంలోని అన్ని శాఖలకు భాగస్వాములను చేసి పోలీస్ వ్యవస్థను రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేస్తాం.. ప్రజలకు సంపూర్ణ రక్షణ కల్పించడమే తెలంగాణ పోలీసుల లక్ష్యం... థర్డ్ పార్టీ ఎంక్వైరీ విధానం ద్వారా పోలీసుల పని తీరులో మరింత మార్పు వస్తుంది.. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసుల పనితీరు బాగున్నది. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ మహేందర్ రెడ్డి.. దేశంలోనే తెలంగాణ పోలీసు వ్యవస్థ మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు.

ప్రజలను, పౌరసమాజాన్ని, ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసి... పోలీసు వ్యవస్థను మరింత బలో పేతం చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో సత్ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు.

డ్రగ్స్ కేసులో కెల్విన్‌కు బెయిల్ మంజూరు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు కెల్విన్ జైలు నుంచి విడుదలయ్యారు. నాంపల్లి సీబీఐ కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆదివారం ఉదయం చర్లపల్లి జైలు నుంచి బయటికొచ్చారు. డ్రగ్స్ కేసుకు సంబంధించి తనపై వచ్చిన కథనాలన్నీ అవాస్తవాలని కెల్విన అన్నారు. ఇకపై సాధారణ జీవితాన్నే కొనసాగిస్తానని చెప్పుకొచ్చారు. ఆరు నెలల కిందట వెలుగు చూసిన డ్రగ్స్ కేసు టాలీవుడ్‌ను కుదిపేసిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును విచారించింది. ఈవెంట్ మేనేజర్‌గానూ పనిచేసిన కెల్విన్‌కు అంతర్జాతీయ, గోవా డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నాయని, టాలీవుడ్‌లోని పలువురు దర్శకులు, నటీనటులకు అతను మాదకద్రవ్యాలను సరఫరా చేశాడని నిర్ధారించాయి. ఈ క్రమంలో ఆయా దర్శకులు, నటీనటులు, టెక్నీషియన్లను సిట్ విచారించింది. కాగా, దర్యాప్తు దశలోనే ఈ కేసు నీరుగారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. చర్లపల్లి జైలు నుంచి కెల్విన్ విడుద లైన కెల్విన్ మీడియాతో మాట్లాడుతూ ప్రసారమాధ్యమాల్లో తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న కెల్విన్ ఇక నుంచి మంచి జీవితాన్ని గడుపుతానని వెల్లడించారు. ఈవెంట్ మేనేజరుగా పనిచేసిన కెల్విన్‌కు అంతర్జాతీయ, గోవా డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నాయని, టాలీవుడ్‌లోని పలువురు ప్రముఖులకు మాదక ద్రవ్యాలు సరఫరా చేశాడనే ఆరోపణలతో తెలంగాణ ఎక్సైజ్ అధికారులు ఆరు నెలల క్రితం అతన్ని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా నూతన సంవత్సర వేడుకలలో ఇద్దరు నైజీరియన్లు డ్రగ్స్ సరఫరాకు యత్నం చేసి పట్టుబడ్డారు. హైదరాబాద్ నగర శివారుల్లో మాదకద్రవ్యాలను సరఫరా చేసే ఇద్దరు నైజీరియన్‌లను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ లో మాదకద్రవ్యాలను సరఫరా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నైజీరియన్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఓ విద్యార్థినీ ఉంది. వారి నుంచి కొలో గంజాయితో పాటు కొకైన్, హెరాయిన్, అల్‌ప్రాజాలమ్ తదితర మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు.

వీరి పాస్‌పోర్టు, వీసాలు కూడా స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు వివరించారు. బెంజిమన్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ప్రాజెక్టుపై విమర్శించే నైతికత వైఎస్ జగన్‌కు లేదు

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



అమరావతి,సూర్యప్రతినిధి: వైసీపీ అధినేత, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం మీడియాతో మంత్రి మాట్లాడిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదం రోజే పోలవరం టెండర్ల కోసం జగన్ ప్రయత్నించారని సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పెద్దలతో బేరం కుదరకపోవడం వల్లే వైఎస్ జగన్ ప్రాజెక్టు పనులు దక్కించుకోలేక పోయారని మంత్రి ఆరోపించారు. చిట్‌చాట్ పేరుతో జగన్ ముఖం చాటేస్తున్నారన్నారు.

ప్రాజెక్టు దక్కలేదని జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి పోలవరం నిర్మాణానికి అడ్డుపడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులపై విమర్శించే నైతికత జగన్‌కు లేదని దేవినేని చెప్పుకొచ్చారు. పోలవరం ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు రూ. 12,800 కోట్లు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు.

త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీకి నిర్ణయం

- పదవుల భర్తీతో కేడర్‌లో పెరగనున్న జోష్
- ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయం మాత్రమే
- మూడున్నర ఏళ్లవుతున్నా భర్తీ చేయని వేలాది పదవులు
- సంక్రాంతి తరువాత పలువురు టీఆర్ఎస్ నేతలకు పదవీయోగం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయమున్న తరుణంలో పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచేందుకు త్వరలోనే నామినేటెడ్ పదవుల నియామకం చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కీలక నామినేటెడ్ పోస్టులన్నీ పార్టీలో మొదట్నుంచి పనిచేసిన వారికి అప్పగించిన కేసీఆర్, పార్టీ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుంచి చేరిన చాలా మంది నేతలకు ఈసారి పదవులు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవుల్ని ఆశిస్తున్న నేతలిప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా లాబీయింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం మంచిరోజులు లేకపోవడంతో సంక్రాంతి పండుగ అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీకి ముహూర్తం ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినా నామినేటెడ్ పోసులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఈ ఏడాది సీఎం కేసీఆర్ కొన్నింటిని భర్తీ చేసినా, అవి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ల ఛైర్మన్ పోస్టులకే పరిమితమయ్యాయి. ఛైర్మన్లను నియమించిన కార్పొరేషన్లలో డైరెక్టర్ పోస్టుల భర్తీని కూడా పెండింగ్‌లో పెట్టారు. వేల సంఖ్యలో ఉండే డైరెక్టర్ పదవులు, బోర్డు మెంబర్ల పోస్టుల కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని మేజర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోస్టులు భర్తీ అయ్యాయి. దాదావు 43 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించారు. రాష్ట్రంలో మొత్తం నాలుగు వేల దాకా నామినేటెడ్ పోస్టులు ఉంటాయని చెబుతున్నారు. భర్తీ చేసినవి పోను మిగిలిన కొన్ని పోస్టులపై పార్టీ అధినేత స్పష్టత ఇచ్చారని అంటున్నారు. వీటిపై ఇప్పటికే పార్టీ నాయకత్వం కసరత్తు మొదలు పెట్టిందని , జనవరి చివరికల్లా పోస్టులన్నీ భర్తీ చేసే అవకాశం ఉందని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. వేలల్లో ఉన్నా డైరెక్టర్లు, ఇతర పోస్టులను భర్తీ చేస్తే క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం పదవులు దక్కే అవకాశాలుంటాయని అంటున్నారు. దేవాలయ కమిటీలు, గ్రంధాలయ సంస్థల్లో పోస్టులు కూడా ఇప్పటి వరకు చాలచోట్ల భర్తీ చేయలేదు. వీటిని భర్తీ చేయడం ద్వారా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు పదవులు దక్కే అవకాశాలున్నాయని చెబుతున్నారు. సంక్రాంతి పండుగ తరువాత రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ద్వారా వేలాది మంది టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు పదవీయోగం పట్టనుంది.

గల్ఫ్‌లో తెలంగాణ వాసి ఆత్మహత్య



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం గన్నారానికి చెందిన బొద్దుల సాగర్(27) శుక్రవారం రాత్ర మస్కట్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సాగర్‌కు రెండేళ్ల కింద వివాహం అయింది. భార్య భార్గవితో పాటు ఏడాది వయసున్న పాప ఉంది. కుటుంబ పోషణ నిమిత్తం 45 రోజుల కింద రూ. లక్ష అప్పు చేసి మస్కట్‌కు వెళ్లిన సాగర్ జీతం తక్కువ ఉందని తరచూ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పేవాడు. క్రమంలో తమకున్న రూ. 5 లక్షల అప్పు గురించి ప్రస్తావించేవాడని, చాలీచాలని జీతంతో అప్పులు ఎలా తీర్చాలో మానసిక ఆందోళతో సాగర్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృఎతదేహం ఇంటికి వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకొవాలని తల్లిదండ్రులు కోరారు. కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చిత్తూరు జిల్లాలో వైసీపీకి షాక్

చిత్తూరు,సూర్యప్రతినిధి: చిత్తూరు జిల్లాలో ప్రతిపక్ష వైసీపీకి షాక్ తగిలింది. చిత్తూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబునాయుడుపై సుబ్రమణ్యంరెడ్డి మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయారు. కాగా ఆదివారం అమరావతికి వచ్చిన సుబ్రమణ్యండ్డి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు.

అయితే సీఎం చంద్రబాబు త్వరలో చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు టీడీపీలో చేరేందుకు నిర్ణయించారు. ఇదిలా ఉండగాఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా అధికార తెలుగుదేశం పార్టీ ప్రతిపక్ష వైసీపీ నేతలను టీడీపీలో చేరేందుకు ప్రోత్సహిస్తోంది. ఇప్పటి వరకు 22 మంది ఎమ్మెల్యేలను పార్టీలోకి లాగిన టీడీపీ ఇక కిందిస్థాయి కేడర్ పై కన్నేసింది. దీంతో మొన్న గుడివాడ, నిన్న పులివెందుల, నేడు కుప్పం నియోజకవర్గాలకు చెందిన నేతలను టీడీపీలోకి వచ్చేలా చేసింది.

గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల

హైదరాబాద్, మేజర్‌న్యూస్: గురుకుల పీజీటీ(పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్) ఫలితాలు విడుదల అయ్యాయి. బయో సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథమేటిక్స్, సోషల్ సైన్స్ సబ్జెక్టుల్లో అర్హత సాధించిన వారి వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మ్యాథమేటిక్స్‌లో 126 పోస్టులకు గానూ 114 మంది అర్హత సాధించారు. ఫిజికల్ సైన్స్‌లో 188 పోస్టులకు గానూ 174 మంది అర్హత సాధించినట్లు టీఎస్‌పీఎస్సీ అధికారులు వెల్లడించారు. సోషల్ సైన్స్‌లో 177 పోస్టులకు గానూ 166 మంది అర్హత సాధించారు. బయో సైన్స్‌లో 22 పోస్టులకు గానూ 21 మంది అర్హత సాధించారు. మిగతా ఖాళీలు వికలాంగుల కోటాకు చెందినవి. వీరి మెడికల్ రిపోర్టు వచ్చిన అనంతరమే వికలాంగుల జాబితాను విడుదల చేయనున్నారు. ఫలితాల కోసం .. వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు. అలాగే గురుకుల పీజీటీ ఫలితాల విడుదలతో పాటు ములుగు అటవీ కళాశాల ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఫలితాలు కూడా విడుదల చేసినట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. వీరి జాబితాను కూడా టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

S & D

ఆంధ్ర వాల్మీకి వాసుదాసు సుందరకాండ ఎందుకు చదవాలి?

రావణుడికి కర్తవ్యబోధ చేసిన సీతాదేవి



– వనం జ్వాలానరసింహారావు, హైదరాబాద్

సీత రావణుడికి ఇంకా ఇలా కర్తవ్యబోధ చేస్తుంది:

రావణా! నీవు మూఢుడివిరా! రామచంద్రమూర్తి నుండి నన్ను వేరుచేయడం నీకు చేతనవుతుందా? సూర్యుడికి ఎండలా, నేను శ్రీరామచంద్రుడికి అనన్యను. నన్నాయన నుండి వేరుచేయలేవు. భోగభాగ్యాలను ఎరబెట్టి నన్ను మోసగించాలని చూస్తున్నావు. నీవు అవివేకివి. ఎండ సూర్యుడిపైన ఆధారపడ్డప్పటికీ, ఆ ఎండ మూలాన్నే, ఆయన ఉనికి తెలిసి, ఆయన్ను పూజిస్తున్నారు. అట్లే నేనూ రాముడి దానినైనా, ఆయన మీద ఆధారపడ్డ పరతంత్రనైనా, నేనే ఆయన్ను లోకానికెక్కువగా వుపయోగపడేటట్లు చేస్తున్నాను. ఆయన మహిమ లోకమంతా తెలవడం నావల్లనే. నేనులేకపోతే, ఆయన ఉనికేలేదని చెప్పాలి.

(మారీచుడు రావణుడితో జనకాత్మజ సంబంధంబున రాముండప్రమేయ వురుతేజుండయ్యెనని చెప్పాడు. అవివేకైన రావణుడికి అది అర్థం కాలేదని సీత గుర్తుచేస్తుందిక్కడ. యాచకులు లేని దాతలు, రోగులు లేని వైద్యులు లేనట్లే, ప్రపంచం లేకపోతే భగవంతుడు లేనేలేడు. ప్రకృతిమూలాన్న తప్ప, భగవంతుడిని తెల్సుకునే మార్గమే లేదు. ఆ భగవంతుడి శక్తే లక్ష్మి. ఆమే మాయ. ఆమే ప్రకృతి. ఆమె చిద్విలాసమే ప్రపంచం. ప్రపంచం, భగవంతుడు వేరు- వేరు కాదు. లక్ష్మి అనుగ్రహిస్తేనే ప్రపంచాన్ని దాటుతాం. భగవదనుగ్రహానికి నోచుకుంటాం. ఆమెను వశపర్చుకోవడానికి, నమస్కారమే సాధనం కాని, బలాత్కారం, ధన, విద్యాబలం మాత్రంకానేకాదు. ఎప్పుడెప్పుడు విష్ణువు అవతారమెత్తుతాడో, అప్పుడన్ని సమయాల్లో శ్రీదేవి ఆయనకు సహాయంగా రావాల్సిందే. ఆయన దేవతలందు అవతారమెత్తితే, ఈమె దేవత్వాన్ని ధరిస్తుంది. మనుష్యల్లో అవతారం ఎత్తితే మనుష్య స్త్రీగా అవతరిస్తుంది. విష్ణు దేహానికి అనురూపమైన దేహాన్ని ధరిస్తుంది. ఆమె అనన్య. అంటే, చీకటి–వెలుతురు లాగా అన్యం కాకున్నా వుంటుంది. సూర్యుడు, ఎండ, చంద్రుడు, వెన్నెల, సముద్రం అలల్లా. ఇంతే జీవాత్మ–పరమాత్మల అనన్యత్వం. జీవుడు పరమాత్మ అంశ. ముముక్షువగు బద్ధ జీవుడు సీతాదేవి శ్రీరాముడి పట్ల ఎటువంటి అభిప్రాయం కల్గి, ప్రవర్తించి, లంకనుండి విముక్తురాలైందో, అలాగే పరమాత్మ విషయంలో విశ్వాసంవుంచి, ప్రవర్తించి విముక్తుడు కావాలి. కాకపోతే ఎక్కడాకూడా, సీతాదేవి, తానే రాముడనలేదు–రాముడూ సీత తానే అనలేదు.)

సర్వలోక ప్రసిద్ధుడు, జగన్నాధుడూ అయిన నాభర్త భుజాన్నే తలదిండుగా చేసుకుని పడుకున్న నేను, పేరూ–ప్రతిష్టాలేని, ఓ అనామకుడిని చేత్తోకూడా తాకను. ఆరంగాలతో వేదం చదివి, సత్యం,సదాచారం కలిగి, సాధుసాంగత్యం చేసి, జీవాత్మ, పరమాత్మ సంబంధం తెల్సిన, బ్రాహ్మణోత్తముడికి, సకలగుణాభిరాముడికి, భూపతికి, తగిన భార్యను నేను. దీంట్లో ఒక్క గుణంకూడా లేనినిన్ను చేత్తో కాదు, కాలితోకూడా తాకను. ఎందుకు భ్రాంతితో నన్ను ఆశిస్తావు? కనీసం నీయోగ్యతెంతో తెలుసుకునే శక్తికూడా నీకులేదే!

(ఆరంగాల వేదం చదవగానే లాభంలేదనే అర్థం వచ్చేటట్లు చెవుతుంది సీత రావణుడికి. సత్యం, శీలం, కలవాడై వుండాలి. రావణుడు వేదాలు చదివినా, సత్య–శీలాలు లేవు. ఆయన శుద్ధబ్రాహ్మణుడు కాడు, శుద్ధ క్షత్రియుడూ కాడు. హనుమంతుడు లంకనుండి తిరిగొచ్చిన తర్వాత, క్ష్మా విభుదేశుడు–భూదేవికి, దేవతలకు ఈశుడు–రావణుడు, ఆయన్ను రాక్షస బలా–బలాలను గురించి అడగాడట. జవాబు విన్న రాముడు: అగ్నిహోత్రాలు–వేదాలూ వున్న వారిని జయించడమెట్లాగా అని అడుగుతాడు. దయ, సత్యం, శౌచంవారికి లేవని చెప్పాడు బదులుగా అంజనేయుడు. సాధుసాంగత్యం కూడా లేదన్నాడు. ఇదిలేకపోతే, మిగిలనివన్నీ వృధానే! దుర్జనసాంగత్యం కూడా మానాలి. అప్పుడు ఇదివిన్న రాముడికి ధైర్యం కలిగిందట)



నీ కర్తవ్యం ఏంటో చెప్తావిను. అడవిలో ఒంటరిగా చిక్కి ఏడుస్తున్న, ఆడ ఏనుగు దగ్గర మగ ఏనుగును విడిచినట్లే, నాభర్తను ఎడబాసి వగస్తున్న నాదగ్గరకు, నామగడిని తెచ్చి విడువు. (తనను తీసుకొనిపోయి రాముడిదగ్గర దింపమని అడగలేదు). అలాచేస్తే నిన్ను నయమతి అంటారు, దుర్నీతిపరుడన్న చెడ్డపేరు కూడా పోతుంది. ఇదివరకులా ముందు, ముందు కూడా సుఖంగా రాజ్యం చేయదల్చు కుంటే, క్షణమైనా ఆలస్యం చేయకుండా, శరణాగత వత్సలుడైన శ్రీరాముడికి నన్ను అర్పించు. జీవించి ఈలోకంలో సుఖపడాలన్నా, మరణించి యమకింకరుల చేతిలో నరక బాధలు అనుభవించ వద్దనుకున్నా, నేనుచెప్పినట్లు చేయి. చేయకపోతే రాముడు నిన్ను చంపడం ఖాయం. ఇహ–పర సుఖాలు కావాలనుకుంటే రాముడికి అనుకూలంగావుండాల్సిందే. నీకు మంచిమాటలు చెప్పేవారెవరూ లంకలోలేరు. నీమేలుకోరి, నీపైనజాలికలిగి, నీవుచెడిపోవడం ఇష్టంలేకనేనేచెప్తున్నాను, విను. రాముడికి అనుకూలుడనై ప్రవర్తిస్తానని మనసులో అనుకున్నా చాలు...వెంటనే నిన్నాయన రక్షిస్తాడు. నీవెంత ఘోరపాపం చేసినా క్షమిస్తాడు. ఆయనకు శత్రువులందూ వాత్సల్యమే.వురుషోత్తముడు. నీతో ఆయన్ను పోల్చుకోకు. ధర్మమే, ధర్మగుణమే భూషణం కలవాడాయన. ధర్మాత్ముడు. నీముఖం చూడగానే నువ్వు క్రూరుడవని ఎట్లా గురుపట్టవచ్చో, ఆయన్ను చూస్తే ధర్మాత్ముడని గుర్తించవచ్చు.

నిష్ప్రయోజనమైన నీ చెడుబుద్ధి వదులుకో. రాముడు దయాస్వరూవుడు. మానమే ఆయన ధనం. ఆలస్యం చేయకుండా నన్నాయనకు సమర్పించుకో. నీవూ సేవించు. నీకుమేలుకలుగుతుంది. యముడి ప్రేరణతో నీవు నామాట వినకపోతే, యుద్ధంలో నీచావు ఆయన చేతుల్లో తప్పదు. బ్రహ్మ, శివుడి వరాలు పొందిన నీమీద ఇంద్రుడి వజ్రాయుదం పనిచేయకపోవచ్చు. యమధర్మరాజు కళ్లుకప్పొచ్చు. ఉదాసీనత మాని నామాటలను జాగ్రత్తగా విను. రామచంద్రమూర్తికే కోపం వస్తే, నిన్ను, బ్రహ్మ, రుదద్రుల వరాలు కాపాడలేవు. ఆయన బాణాలు నిన్ను, నీవంటి వారినందరినీ, క్షణకాలంలో ముక్కలు–ముక్కలు చేసి చీలుస్తాయి. ఆయనకు కోపం రానంతవరకూ, బాణమ్ తీయనంతవరకే నీబ్రతుకు.

నామాటవినకపోతే, ఇంద్రుడు విడిచిన పిడుగుల్లా, భయంకర ధ్వనితో రామబాణాలు నిన్ను తాకుతాయి. అవివినకముందే తెలివితెచ్చుకో. ఓసారి ఆ శబ్దం విని శరణుకోరవచ్చులే అనుకోవద్దు. ఆ శబ్దం నీచెవినపడక ముందే, బాణం నీరొమ్ములోకి పోతుంది. నేలకూలతావు. ఆయన బాణాలెట్లా వస్తాయో తెలియదుకనుక నిన్ను నీవు గొప్పవాడివిగా చెప్పుకుంటున్నావు. మారీచుడికీ, శూర్పణకూ తెలుసువాటిసంగతి. వాళ్లుచెప్పేవుంటారు. నీ శరప్రయోగాలు నీటబిందువులలాంటివి. రాముడివి పిడుగుల్లాంటివి. ఈ తారతమ్యాన్ని అనుభవపూర్వకంగాముమ్ముందు తెలుసుకుంటావు. పిడుగులు, ఒకటో రెండో పడి ఆగిపోయినట్లు, రాముడు వూరిబయటనుండి ఒకటో రెండో బాణాలను విడిచి పోతాడనుకోకు. వేగంలో, శక్తిలో పిడుగుల్లాంటివేకాని సంఖ్యలో కాదు. క్రూర సర్పాలు విశాగ్నినికక్కుతూ, కోరలూడిస్తూ, గుంపులుగా దూరినట్లే, రామలక్ష్మణుల పేర్లు చెక్కబడిన భయంకర బాణాలు లంకలో చొచ్చి రాక్షసులపైన పడితే, చచ్చినవారితో, భయపడి పరిగెత్తేవారితో, లంకంతా అల్లకల్లోలమై పోతుందన్న సంగతి ఆలోచించుకో.

రామలక్ష్మణులు విడిచే గ్రద్ద ఈకల బాణాలు, ఈ పట్టణమంతా వ్యాపించి, పీనుగులపెంటలు పెరిగిపోతే, రాక్షసుల ఇళ్లల్లోని స్త్రీల ఏడ్పులు ఆకాశన్నంటుతాయి. కోట్లాది రాక్షస మూకలు గరుత్మంతుడి నోట చిక్కిన పాముల సమూహాల్లా మారుతారు. రాముడనే గరుత్మంతుడు, బాణాలనే ముక్కుతో, రాక్షసులనే సర్పాలను చీల్చి చెండాడుతాడు. పాములెన్ని వున్నా గరుత్మంతుడి ముందు గెలవలేవుకదా!.

ఇంద్రవిరోధైన బలిచక్రవర్తినుండి విష్ణుమూర్తి ఇంద్రస్థానాన్ని వశపర్చుకున్నట్లే, శ్రీరాముడు నీస్వాధీనంలో వున్న నన్ను తీసుకునిపోతాడు. రాముడు ఒంటరివాడుకదా, ఏంచేస్తాడని అనుకోవద్దు. వామనుడూ ఒంటరివాడే. బల పరాక్రమాలు ముఖ్యం కాని, ఒంటరితనం కాదు. యుద్ధంలో రాముడు నీకు సాటి కాదంటివికదా! అట్టహాసంతో వచ్చిన రాక్షసులందరినీ రాముడు చంపిన తర్వాత, ఆయనను ఎదిరించే ధైర్యం లేక, ఒంటరిగా వున్న నన్ను, వంచనతో రామలక్ష్మణులిద్దరూ లేనిసమయంలో ఎత్తుకొచ్చావు. ఇది దొంగ చేసే పని, శూరుడుచేసేది కాదు. ఇట్లాచేసి కూడా ఇంకా శూరుడవని చెప్పుకోవడానికి సిగ్గులేదా? వులులవాసన తగిలి కుక్కలు పరిగెత్తినట్లుగానే, నువ్వా యుద్ధభూమిలో నిలువలేక పారిపోతావు.

నీశక్తి, రామలక్ష్మణుల శక్తి బేరీజు వేసుకోకుండా, విరోధం కొనితెచ్చుకున్నావు. నీవు బలహీనుడవు. యుద్ధంలో వాళ్లను ఎదిరించలేవు. ఎదిరిస్తే వాళ్ల బాణాల తాకిడికి చస్తావు. నా భర్త త్వరలోనే తనతమ్ముడితో ఇక్కడకు రావడం తథ్యం. నీమీద కోప్పడటమూ తథ్యమే. ఎండాకాలంలోని సూర్యుడు చిన్న గుంటలోని నీళ్లను కిరణాలతో పీల్చివేసినట్లే, నిన్ను ఊర్ధ్వలోకమైన కైలాసంలో దాక్కున్నా, అధోలోకమైన వరుణుడి నగరంలో దాక్కున్నా, పిడుగు చెట్టును పడగొట్టిన రీతిలో పడేయడం కూడా తథ్యం.

మళ్లీ వచ్చింది జనవరి



మళ్లీ వచ్చింది జనవరి
మన జీవన గమనంలో
మరో మైలురాయి అది

మొన్నటి బాల్యం
నిన్నటి యవ్వనం
నేటి వార్ధక్యం
చక చక ప్రతి ఒక్కరినీ
ఈ మార్పు లో పడేసే
కాలగమనానికి ఓ మెట్టు
ఈ జనవరి

రాబోయే కాలం శుభాలతో
అలరాలని
హాపీ న్యూ ఇయర్ అంటూ
పలకరింపులతో
దూరాన ఉన్న ఆత్మీయులతో
సెల్ ఫోన్ లో ఎంచక్కా
చకా చకా చక్కటి మెసేజ్ లు
స్మార్ట్ ఫోన్ లో ఏకంగా ఫేస్ టుఫేస్
పలకరింపులు

ఉద్యోగులైతే
బాస్ లను కేక్ లతో బొకేలతో
అభినందనలు చెప్పేందుకు
పడే ఆరాటం తో
సాగే రోజు ఈ జనవరి ఒకటి

దీన్ని స్వాగతించే నెపంతో
'మందు' పిలుస్తూందో ఏమొ
అందుకే
పబ్బుల్లో చేరేవారు కొందరైతే
మరికొందరు పెద్దలు
ప్రైవేటు గా పార్టీలు

అటూ ఇటూ కాని వారు
వీధుల్లో చీకటి సందుల్లో వేసె
చిందులు
వెరసి వీధుల్లో గోల

కొందరైతే
మితిమీరిన వేగంతో బైకు ల్లో
అందమైన జీవితం యాక్సిడెంట్ల తో
తెస్తారు ఇంటిల్లిపాదీ కి కన్నీళ్ళు
ఇదే ఇదేనా మన జనవరి
ఆది కాదు మన జనవరి
మారాలి మనం
నూతన సంవత్సరాన
మనలోని అంతరాత్మతో
మాట్లాడుదాం
చేసిన తప్పొప్పుల్నీ
బేరీజు వేసుకుని
మానవజాతి మనుగడకు
చేద్దాం మనమూ
మన వంతు కృషి

సమాజంలో ఏం జరుగుతుందో
చూద్దాం
మంచిని అభినందిద్దాం
చెడును ఖండిద్దాం
ప్రజాస్వామ్యం లో పాలకులకు
వారి లోటు పాట్ల ను
నిర్భయంగా ఎలుగెత్తి
ఫోర్త్ ఎస్టేట్ అనబడే
మన మీడియా ను ఉపయోగించి
నడుం బిగిద్దాం

దృతరాష్ట్రుని తీరు వీడుదాం
సమాజానికి జరిగే అన్యాయాన్ని
నిశ్చేష్టులుగా ఉండక
ఎండగడదాం
నూతన సంవత్సర శుభాకాంక్షలతో



డా. వి డి రాజగోపాల్
9505690690

కడలి కడుపున



కడలి కడుపున మహా రణమై
కెమోథెరఫీకే కరగని
క్యాన్సర్ వ్రణమై భూజలాల్లో
యమ మహిశంలా ప్లాస్టిక్
మహాగండం.
నదీ ప్రవాహ సౌభాగ్యాన్నేమో
గరళ రసాయనం జలం
శోధనకందని శ్లోకమై
మాయిక ప్రాణుల ప్రాణాల్లా
హరిస్తుంది.
కాలుష్య కభళం..
వికృత ప్యాషన్ జడలు
విరబోసుకుంటుంది.
పంచభూతాల్తో ఎదిగినా
తనకు తానుగానే
మృత్యుపరిష్వంగాన్ని
మూర్ఖంగా చేరుతున్నాడు.
పాపం..
కాలుష్య శోషక అమాయక నీరం
నరుల నల్లత్రాచులకు
స్వరాల సినుకులను వరంగా
ఇస్తుంది.

నువ్వూ..నేనేకాదు
ఏకోన్ముఖంగా ఉసురుతీసే హంతక
వ్యర్థాలపై యుద్ధభేరి మోగిద్దాం.
ప్రక్షాళనా వ్యూహాలకు
అనుభవాల పదునును పెడదాం.

– అశోక్ అవారి,
9000576581.

బతుకు నేర్పే పాఠం

కుండపోతగా కురిసిన వర్షానికి
రాత్ర తడిసి ముద్దయింది

చీకటి ఎరులా కదిలి కదిలి
నాలోకి ప్రవహించింది

నేనేమో దిగాలుగా
చూస్తూ కూర్చుండి పోయా

దిగిలు దుఖమయి
దేహమంతా వ్యాపించింది
అ న్ని భావాల్ని ఆవిష్కరించే
ముఖం వెల్లే వేసినట్టు తెల్ల
బోయింది

మాటలు పలకని వేళ
సెలవంటూ వెళ్తురు లోకానికి
వీడ్కోలు చెబుతుంటే

నీలి రంగు తివాచీ పై మెరిసే
చొక్కాల్తో జత కడతాను


తొలి ఉదయపు కిరాణం రాక కై
కళ్ళు మూసుకుని ధ్యానం తో
ఎదురుచూస్తాను

వెలుగు కోసం వివేకం కోసం
ఆకాశం కేసి చూస్తూ వుంటాను
చిక్కటి అంతరంగం కోసం
చూవును నెల పైకి మరలుస్తాను
నా నీడను వెతుక్కుంతాను

నిరంతరం బతుకు నేర్పే పాఠాల్ని
విప్పుకుంటూ సాగుతాను

–వారాల ఆనంద్
9440501281

పన్యాల రంగనాథరావు కథానిక 'నరకుని కోరిక'




మరో వంద తప్పక చదవాల్సిన కథానికలు -66

–డా॥ వేదగిరి రాంబాబు, 9391343916

అలనాటి పౌరాణిక గాథల్ని కొత్తకోణంలో చూపిస్తూ కొందరు కథానికలు రాశారు. అలాంటి కథానికలో పన్యాల రంగనాథరావుగారి 'నరకుని కోరిక' ఒకటి. నరకుడు, సత్యభామ చేతిలో చనిపోవాలని కోరుకుంటాడు. సత్యభామ తనని యుద్ధంలో పాల్గొనేటట్టు కృష్ణుణ్ణి కోరుతుంది. తెలిసిన కథానికనే రచయిత చాలా చమత్కారంగా నడిపిస్తాడు. నరకుడు సత్యభామను ప్రేమిస్తాడు. ఆమె దృష్టిలో ఉండాలనుకుంటాడు. కాని ఆమె అతని మనస్సుని గ్రహించినా, గమనించనట్లు ఉంటుంది. "నీ అందానికి ముగ్ధున్నై నన్ను పెళ్లాడమని నిన్ను కోరడాని" కొచ్చాను అంటాడు నరకుడు. "నామీద నీకు ప్రేమ ఉంటే తక్షణం నువ్వు వెళ్లిపో" అంటుంది సత్య. "నేను దొంగచాటు మనిషిని కాను, దొంగల్లే వచ్చి ఆడపిల్లను, ఒంటరిగా ఉన్న వాళ్లని ఎత్తుకుపోవడం నా యింటావంటా లేదు. అటువంటి పనులు బహుశ కృష్ణునకే చాతనవును" అంటాడు నరకుడు. "తన ప్రియుడు దొంగచాటుగా ఎత్తుకుపోవడాన్ని, రసికత్వమంటే తెలిసే ఏ ఆడపిల్లయినా కోరుకుంటుంది" అంటుంది సత్య నవ్వుతూ. "దొంగముద్దున్నంత తీయగా మరొకటుండదు" అన్న సత్య మాటలకు జవాబుగా చిన్న కోరిక కోరతాడు నరకుడు. "సత్యా! నాకు నిజంగా చావు రాసిపెట్టుంటే తప్పదు. అది నీ చేతులమీదే జరగనివ్వు" అంటాడు నరకుడు. సత్య కళ్లవెంట రెండు కన్నీటి చుక్కలు అప్రయత్నంగా రాల్తాయి. "నా కోరిక విని నా కోసం నువ్విప్పుడు రాల్చిన ఆ రెండు కన్నీటి చుక్కలే చాలు" అంటాడు నరకుడు. చాలానాటినుంచి తనకి శాంతి లేకుండా చేసిన కృష్ణుణ్ణి పరిమార్చాలంటే, కృష్ణుణ్ణి రెచ్చగొట్టే మార్గమొక్కటే–అనుకుంటాడు నరకుడు లోలోన. గతమంతా నరకుడి కళ్ల ముందు మెదుల్తుంది. ప్రస్తుతం యుద్ధభూమిలో అల్లంతదూరాన కృష్ణుని రథం కనిపిస్తుంది. బాణాలొచ్చి పడుతున్నాయి. కాని సత్యనే రెప్పవేయకుండా చూస్తున్న నరకునికి అవి తగలడం లేదు. ఇంతలో కృష్ణుడు చతికిలబడి సత్యభామ లేచినట్లయింది. సత్యవేసిన బాణం వచ్చి నరకుని గుండెల్లో దిగబడింది. నరకుడు చెక్కుచెదరలేదు. నవ్వుతూ రథం దిగాడు. సరాసరి సత్యభామ దగ్గరికి ఠీవిగా వెళ్లాడు. రక్తం స్రవిస్తూనే ఉంది, సత్య పాదాల దగ్గర కూలిపోయాడు. కృష్ణునికి కనిపించకుండ సత్యభామ రాల్చిన రెండు కన్నీటి చుక్కలు తన గుండెల మీద పడటం, నరకుడు తుది ఘడియల్లో తృప్తిగా చూశాడు. "దన్యుణ్ణి సత్యా ధన్యుణ్ణి' అన్న నరకుని కారణాలెన్నో! ఏ కోణానికి! ఆ కోణం అదే సరైనదనిపించడంతో, ఆ కోణం నుంచి చూస్తున్నవాళ్లు తమ ప్రవర్తననే సరైనదనుకుంటారు. ఈ విషయాన్నెంతో చక్కగా, నేర్పుగా చెప్పారు పన్యాల రంగనాథరావుగారు, తమ 'నరకుని కోరిక' కథానికలో.



ఉషః సంధ్యలు



భ్రమ విశ్వాసవు ప్రవాహంలో
గట్టిగా నిలదొక్కుకుని
నిన్ను నా తలవుల నుంచి
విదిలించాలనుకున్నా
ఏటి ఒడ్డున పిచ్చుక గూళ్ళల్లో
కాల్చుకు తిన్న కందికాయల
తొక్కలో
అమ్మ యిచ్చిన తాయిలంలో
నాన్న తెచ్చిన చందమామ కథల్లో
గుట్టలగుట్టల జ్ఞాపకాల ఊసుళ్ళని
అసంకల్పితంగానో
అసంగతంగానో
మరువు శబ్దాలతో
శృతిచేద్దామనుకున్నా
నిశ్శబ్దం నిలదీస్తుంటే
ప్రశాంతత పొడిపొడిగా
రాలిపోతోంది

జ్ఞాపకాలు
పచ్చిపచ్చిగా పచ్చపచ్చగా
మరిచిపోదామంటే మరింత
బలిమిని పెంచుకుంటూ
ఆలోచనల ఆవిరి కదలలేని
మబ్బుల్లా
కలయతిరుగుతున్నాయి వృథగా
కదలనీయక కలత వీడక
భాషలోనూ
భావంలోనూ
తనువులోనూ
మనసులోనూ
జ్ఞాపకాల గంటలు మోగిస్తూనే
వుంటావు
నిరీక్షణల లెక్కలు తేల్చమంటూ
ఆకర్షణల రెక్కలు విదల్చమంటూ
వాలిపోతున్న రెప్పల్లో
ఆగిపోతున్న ఊహల్లో
నిన్ను పత్యక్షం చేస్తూ
నా యత్నాన్ని భగ్నం చేస్తూ
నీ తత్వాన్ని స్నిగ్ధం చేస్తూ

నిజమే మరి
నువ్వో ప్రత్యూషానివి
నేనో సాయంసంధ్యని

– లాస్య ప్రియ కుప్పా
9640551664

అతడు



గుప్పెడు అక్షరాల్ని మోసుకుంటూ
అతడు విరామెరుగక తిరుగుతుంటాడు
ఎక్కడ చీకటిమొక్క మొలుస్తుందో
అక్కడకు
చేరి పదాలపలుగుల్తో పొడిచి వస్తుంటాడు!
శాలువాలకోసం సత్యాన్ని బలిపెట్టనివాడు
న్యాయం పక్కన పోరాడనప్పుడు
బత్కెందుకంటాడు
కొంచెం స్వార్థాన్ని నేర్చుకొమ్మని ఎవరైనా
అంటే
కాసింత మట్టిని చూపిస్తాడే తప్ప మౌనాన్ని
దాటడు
మాటమాటనీ ఆచితూచి వదుల్తాడు
ప్రతీపలుకు తేనెచుక్కకు పోటీనిస్తుంది
ఎంత పరీక్షించినా ద్వేషాన్ని బయటపెట్టడు
ప్రేమరసమే మొత్తం నింపుకున్నోడికి
ద్వేషముండదుగా!
అగాథాల్ని తవ్వాలని ఏ కోశానా
ఆలోచించడు
వంతెనల్ని కట్టడానికే సమయం సరిపోనివాడు
బాటలమధ్య లోయల్నెలా సృష్టించగలడంటారూ!?
వసుధైకకుటుంబాన్ని కలగంటున్న వాడసలు
మాటలమధ్యన అంతరాలకు వూనుకోడు గదా!?
మనిషికి మనిషి దగ్గరైతేనే బతుకో ఉత్సవమంటూ
తను రాసిన ప్రతీపదం పాదానికి వూసుకుంటాడు
వేలమైళ్లు నడిచినా బంధాల్ని అపహాస్యం చేయడు
ఏ తీగ ఏ మర్మం నేర్పిందో గానీ అతనికి
మనసుల్ని మమతసూత్రంతో అల్లేసుకుంటుంటాడు!
అతడొస్తుంటే పావురాలు భుజంపై వాల్తాయి
ఎన్ని గింజల కృతజ్ఞతనో కదా ఆ చనువు!
దార్లోని చెట్టు కొమ్మనివంచి పూలాభిషేకం చేస్తది
ఎంత నీరుని పోస్తే వచ్చిన ఆరాధనమో అది!
అలాంటి అతడు మరణించాడు
కానీ....
ఏ ఇద్దరిమాటలమధ్యలోనైనా బతికేవున్నాడు!

మెట్టానాగేశ్వరరావు

దాడి

నట్టడవి
నడివీధిలోకొచ్చినట్టుంది !
ఆమెమీద దాడి జరిగిన
ఆనవాళ్లయితే ఉన్నాయిగానీ....
మృగాలు మాత్రం కనిపించలేదు !
రాబందుల గుంపులా
శవం ముందు వాలిన జనం !
నలిపినలిపి వీధిలోకి విసిరేసిన
కాగితవుముద్దలాంటి ఆమెను
ఫోటోలు తీస్తున్నారు కొందరు !
చిరిగిన దేహపు నగ్నత్వాన్ని
కళ్లతో తోడుకుంటున్నారింకొందరు !
మూతపడని ఆమె కళ్లు
మంటలెగిసిన ఆకాశమల్లే శపిస్తూ....
యీ దేశాన్ని దహిస్తున్నట్టున్నాయి !
చెక్కిళ్లమీంచి జారే చివరి కన్నీటి చుక్క
సాక్ష్యాన్ని ఎవరూ విన్నట్టులేదు !
అరచీ అరచీ అలా దుఃఖపు చారికై
యింకిపోయినట్టుంది !
తెగిపడ్డ చుక్కని చూస్తూ....
ఆ రాతంత్రా ఏడ్చిందేమో ఆకాశం !
పొద్దున్నే రోడ్డుమీద చిట్లిన
నీటిఅద్దల్లా ప్రతిఫలిస్తోన్న ఆమె
కళ్లల్లో....
వేనవేల ముఖాలతో
మృగాలు కనిపిస్తున్నాయి !!
సిరికి స్వామినాయుడు , పార్వతీపురం
.సెల్ : 94940 10330






సాఫ్ట్‌వేర్ సాయంతో రైల్వే తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ హైజాక్

- సిబిఐ దర్యాప్తు
- ఆన్‌లైన్‌లో అందుబాటులో ఎన్నో సాఫ్ట్‌వేర్లు
- ఏక కాలంలో ఎన్నో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు
- ట్రావెల్ ఏజెంట్ల అక్రమాలు

న్యూఢిల్లీ : రైల్వే తత్కాల్ టిక్కెట్లను సాఫ్ట్‌వేర్‌ల సాయంతో కొందరు ట్రావెల్ ఏజెంట్లు చాలా వేగంగా బుక్ చేసుకునిపోతున్నారు. కేంద్ర నేర పరిశోధన సంస్థ (సిబిఐ) ఇప్పుడు ఈ అంశంపైనే దృష్టి సారించింది. ఆన్‌లైన్‌లో ఈ తరహా సాఫ్ట్‌వేర్‌లు చాలానే విక్రయానికి ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం తాము వీటిని పరిశీలిస్తున్నట్లు, చట్టవిరుద్ధమని తేలితే త్వరలోనే వాటిపై చర్యలు తీసుకోనున్నట్లు సిబిఐ అధికారులు తెలిపారు. ఈ నకిలీ సాఫ్ట్‌వేర్ ఉంటే ప్రయాణికుల వివరాలను పని గట్టుకుని కీ బోర్డులో టైప్ చేయనక్కరలేదు. సాఫ్ట్‌వేర్ వేగంగా ఆయా కాలమ్స్‌లో క్షణంలో వివరాలను నింపేస్తుంది. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ ప్రారంభానికి ముందే ఈ వివరాలను సాఫ్ట్‌వేర్‌ల సాయంతో సిద్ధంగా ఉంచుతారు. బుకింగ్ మొదలైన వెంటనే ఒకటికి మించిన ఐడిలతో లాగిన్ కావడం దగ్గర నుంచి, ప్రయాణికుల వివరాల నమోదు, బుకింగ్ వరకు సాఫ్ట్‌వేర్ వేగంగా పని చేసేస్తుంది. ఒకే క్లిక్‌తో చాలా వరకు టిక్కెట్లను ఏక కాలంలో బుక్ చేసుకోవచ్చని దర్యాప్తు అధికారులు తెలిపారు.




ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లు పెంచిన పిఎన్‌బి



న్యూఢిల్లీ : తమ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన కస్టమర్లకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) గుడ్ న్యూస్ చెప్పింది. బ్యాంకు ఈ డిపాజిట్లపై వడ్డీని 1.25 శాతం మేర పెంచింది. 2018 జనవరి 1 నుంచి ఈ కొత్త వడ్డీ రేట్లు అమలులోకి వస్తాయి. రూ. 10 కోట్ల వరకు ఉన్న డొమెస్టిక్ డిపాజిట్లకు ఈ పెంపు వర్తిస్తుంది. ప్రస్తుతం 4 శాతం ఉన్న వడ్డీ రేటు ఇక 5.25 శాతం కానున్నది. 7 నుంచి 29 రోజుల మధ్య మెచ్యూరిటీ డిపాజిట్లకు ఇది వర్తిస్తుంది. ఇక 30 నుంచి 45 రోజుల మధ్య మెచ్యూరిటీ ఉండే డిపాజిట్లపై ప్రస్తుతం ఉన్న 4.5 శాతం వడ్డీ కూడా 5.25 శాతానికి చేరింది. 46 నుంచి 90 రోజుల డిపాజిట్లకు ప్రస్తుతం 5.5 శాతం ఉన్న వడ్డీ రేటు 6.25 శాతానికి, 91 నుంచి 179 రోజుల మధ్య ఉండే డిపాజిట్ల వడ్డీ రేటును 4 నుంచి 4.9 శాతానికి, 180 రోజుల నుంచి ఏడాది వరకు ఉండే వాటిపై వడ్డీ రేటును 4.25 శాతం నుంచి 5 శాతానికి బ్యాంకు పెంచింది.

భారత్‌లో 10 వేల సీప్లేన్లు : గడ్కరీ



న్యూఢిల్లీ : రవాణా వ్యవస్థలో సీప్లేన్లు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పది వేల సీప్లేన్లను ప్రారంభించే సామర్థ్యం భారత్‌కు ఉందని గడ్కరీ తెలియజేశారు. మన దేశంలో లక్షల సంఖ్యలో చెరువులు, డ్యామ్‌లు, రెండు వేల నది ఓడరేవులు, 200 చిన్న ఓడరేవులు, 12 ప్రధాన ఓడరేవులు ఉన్నాయని, తక్కువ ఖర్చుతోనే సీప్లేన్లను నిర్వహించవచ్చని ఆయన వివరించారు. ఒక్క అడుగు లోతు ఉన్న నీటిలో కూడా సీప్లేన్లు దిగుతాయి. వీటికి 300 మీటర్ల పొడవైన రన్‌వే సరిపోతుంది.

400 కిమీ వేగంతో దూసుకు పోతాయి. 'పౌర విమానయాన శాఖతో కలిసి ఒకే ఇంజన్ కలిగిన సీప్లేన్లను త్వరలో తీసుకువస్తాం. వీటి కోసం నిబంధనలను రూపొందిస్తాం. అమెరికా, కెనడా, జపాన్ దేశాల్లో పలు నిబంధనలు ఉన్నాయి. వాటిని మూడు నెలల్లో అధ్యయనం చేస్తాం' అని గడ్కరీ తెలియజేశారు. రూ. 16 లక్షల కోట్లతో చేపడు తున్న సాగర్‌మాల, రూ. 7 లక్షల కోట్లతో చేపడుతున్న భారత్‌మాల ప్రాజెక్టులు మౌలిక సదుపాయాల్లో మన దేశ ముఖచిత్రాన్నే మార్చివేస్తాయని గడ్కరీ అన్నారు.

భారీగా 2 వేల రూపాయల నకిలీ నోట్లు పట్టివేత



మాల్దా : పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా గులాప్‌గంజ్ వద్ద భారీగా రెండు వేల రూపాయల నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి నకిలీ నోట్లను తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 298 నకిలీ రూ. 2 వేల నోట్లను సరిహద్దు భద్రతా దళం, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 5.96 లక్షలు ఉంటుందని తెలిపారు. నకిలీ నోట్ల ముఠా వివరాలు సేకరించేందుకు అదుపులోకి తీసుకున్న నిందితులను పోలీసులు విచారిస్తున్నారు.

రెండు బడ్జెట్ స్మార్ట్ ఫోన్ల ధరలు తగ్గాయ్!




న్యూఢిల్లీ : చైనాకు చెందిన స్మార్ట్ ఫోన్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన వివో వి7 స్మార్ట్ ఫోన్ ధరను తగ్గించింది. 24 మెగా పిక్సల్స్ సెల్ఫీ కెమెరాతో ఈ నెల ఆరంభంలో ఇది దేశీయ మార్కెట్‌లోకి విడుదలైంది. నెలలోనే దీని ధరను కంపెనీ తగ్గించడం విశేషం. ఆరంభంలో రూ. 18,990 ధరకు విడుదల చేయగా, తాజాగా దీని ధరను రూ. 2,000 మేర కంపెనీ తగ్గించింది.

దీనితో రూ. 16,990కి దిగివచ్చింది. మరొక ప్రముఖ కంపెనీ మోటరోలా సైతం మోటో జి5 ఎస్ ప్లస్ ధరను తగ్గించింది. ఈ ఏడాది ఆగస్ట్‌లో స్పెషల్ ఎడిషన్ స్మార్ట్ ఫోన్‌గా దీనిని రూ. 15,999 ధరకు మోటరోలా దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. తాజాగా రూ. 1,000 మేర తగ్గిస్తూ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ ఫోన్ అమేజాన్, మోటొరోలా స్టోర్లలోనే అందుబాటులో ఉంటుంది. మోటరోలా కంపెనీ లెనోవా సొంతమని తెలిసిందే.

శామ్ సంగ్ గెలాక్సీ నోట్ 8 ఫోన్‌లో సాంకేతిక సమస్యలు

చార్జింగ్ పరంగా సమస్యలు



న్యూఢిల్లీ : శామ్‌సంగ్ గెలాక్సీ నోట్ 8 సీరీస్ స్మార్ట్ ఫోన్‌లలో మరొక సారి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. గెలాక్సీ నోట్ 8లో చార్జింగ్ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు కొందరు యూజర్లు కంపెనీ సపోర్ట్ ఫోరమ్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీ పవర్ పూర్తిగా అయిపోయిన తరువాత చార్జింగ్, తిరిగి ఆన్ అవడంలో సమస్య ఎదురవుతు న్నట్లు సమాచారం. దీనితో కొందరు యూజర్లు ఫిర్యాదు చేసి తమ హ్యాండ్ సెట్లను మార్చుకున్నారు.

అయితే, ఇలా మార్చుకున్న వారిలో కొందరు ఈ సమస్య మళ్లీ తలెత్తినట్లు కంపెనీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై శ్యామ్‌సంగ్ ఇండియా అధికార ప్రతినిధి స్పందిస్తూ, కంపెనీ ఈ అంశాన్ని అధ్యయనం చేస్తోందని తెలియజేశారు. ఎవరైనా కస్టమర్ ఈ సమస్యను ఎదుర్కొంటుంటే సమీపంలోని శ్యామ్‌సంగ్ కస్టమర్ కేర్ సెంటర్‌కు వెళ్లాలని ఆయన సూచించారు.

ఫ్లిప్‌కార్ట్ మొబైల్స్ బొనాంజా సేల్

3 నుంచి ఆరంభం

న్యూఢిల్లీ : 2018లో నూతన మొబైల్స్‌ను సొంతం చేసుకోవాలనే ఔత్సాహికులను దృష్టిలో ఉంచుకుని ప్రముఖ ఇ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ డిస్కౌంట్ సేల్ ప్రకటించింది. జనవరి 3 నుంచి 5 వరకు ఇది కొనసాగుతుంది. ఈ సేల్‌లో భాగంగా షియోమి ఎంఐ ఎ1, గూగుల్ పిక్సెల్ 2, పిక్సెల్ 2ఎక్స్‌ఎల్, మోటో జి5 ప్లస్, రెడ్ మీ నోట్ 4, లెనోవో కె5 నోట్, శ్యామ్‌సంగ్ గెలాక్సీ ఎస్ 7 స్మార్ట్ ఫోన్లపై ఆఫర్లు ఉన్నాయి. నో కాస్ట్ ఇఎంఐ (వడ్డీ రహిత కొనుగోలు రుణం), తిరిగి కచ్చితంగా కొనుగోలు చేసే బైబ్యాక్ ఆఫర్లను కూడా అందిస్తోంది. షియోమి ఎంఐ ఎ1 ధర రూ. 13,999 కాగా, డిస్కౌంట్ సేల్‌లో దీనిని రూ. 12,999కే అందిస్తోంది. గూగుల్ పిక్సెల్ మోడళ్లపై రూ. 8,000 డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డు ఇఎంఐపై ఇది లభిస్తుంది. ఇంకా చాలా ఆఫర్లు కూడా ఉన్నాయి.

పెరిగిన 1.85 లక్షల ఉద్యోగాలు


న్యూఢిల్లీ : పెద్ద నోట్ల చలామణీ రద్దు తరువాత దినసరి వేతన జీవులే (క్యాజువల్ వర్కర్స్) అత్యంత ప్రభావితం అయ్యారు! 2017లో తొలి మూడు నెలల్లో ఎంపిక చేసిన 8 రంగాల్లో దాదాపు 53 వేల మంది దినసరి వేతన జీవులు ఉపాధి కోల్పోయారని లేబర్ బ్యూరో తాజా అధ్యయనం పేర్కొంది. అయితే, అదే మూడు నెలల వ్యవధిలో ఐటి, తయారీ వంటి రంగాల్లో ఉద్యోగ పరిస్థితులు మెరుగయ్యాయి.

మొత్తం 1.85 లక్షల ఉద్యోగాల పెరుగుదల కనిపించింది. 1.97 లక్షల క్రమబద్ధీకరించిన, 26 వేల ఒప్పంద ఉద్యోగాల్లో సానుకూల మార్పు కనిపించింది. దినసరి వేతన జీవులు 53 వేల మంది తగ్గారు అని కార్మిక మంత్రిత్వశాఖలోని లేబర్ బ్యూరో విభాగం తాజా త్రైమాసిక సర్వే తెలిపింది. స్వయం ఉపాధి పొందిన వారు 15 వేల మంది పెరిగారు. తయారీ, నిర్మాణం, వాణిజ్యం, రవాణా, విద్య, వైద్యం, ఆతిథ్యం, ఐటి/ బిపిఒ రంగాల్లో లేబర్ బ్యూరో అధ్యయనం చేపట్టింది. మొత్తం 1.85 లక్షల ఉద్యోగాల్లో పురుషులు 1.26 లక్షలు, మహిళలు 59 వేలు దక్కించుకున్నారు.

రంగాల వారీ వివరాలు

తయారీ రంగం: ఉద్యోగాలు 92 వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 66

తగ్గిన 53 వేల దినసరి వేతన జీవులు



వేల మంది, ఒప్పంద ఉద్యోగులు 48 వేల మంది పెరగగా దినసరి వేతన జీవులు 22 వేల మంది తగ్గారు.

వైద్య రంగం: ఉద్యోగాలు 28 వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 19 వేల మంది, ఒప్పంద ఉద్యోగులు 16 వేల మంది పెరగగా దినసరి వేతన జీవులు ఏడు వేల మంది తగ్గారు.

నిర్మాణ రంగం: ఉద్యోగాలు రెండు వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 19 వేల మంది, ఒప్పంద ఉద్యోగులు ఎనిమిది వేల మంది పెరగగా దినసరి వేతన జీవులు తొమ్మిది వేల మంది తగ్గారు.


వాణిజ్య రంగం: ఉద్యోగాలు 28 వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 21 వేల మంది, ఒప్పంద ఉద్యోగులు పది వేల మంది పెరగగా దినసరి వేతన జీవులు మూడు వేల మంది తగ్గారు.

రవాణా రంగం: ఉద్యోగాలు మూడు వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు తొమ్మిది వేల మంది, ఒప్పంద ఉద్యోగులు వెయ్యి మంది పెరగగా దినసరి వేతన జీవులు ఐదు వేల మంది తగ్గారు.

ఐటి/ బిపిఒ రంగం: ఉద్యోగాలు 13 వేలు పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 12 వేల మంది, ఒప్పంద ఉద్యోగులు వెయ్యి మంది పెరగగా దినసరి వేతన జీవుల్లో మార్పు లేదు.

విద్యా రంగం: ఉద్యోగాలు వెయ్యి పెరిగాయి. క్రమబద్ధ ఉద్యోగులు 46 వేల మంది పెరగగా, ఒప్పంద ఉద్యోగులు 37 వేల మంది, దినసరి వేతన జీవులు ఎనిమిది వేల మంది తగ్గారు.

2017లో చరిత్రలో కలిసిపోయిన టెక్నాలజీలు



న్యూఢిల్లీ : కాలచక్రంలో ఎన్నో ఏళ్లు వస్తుంటాయి, పోతుంటాయి. ఆ విధంగా 2017 సంవత్సరంలో కనుమరుగైన టెక్నాలజీలు, గ్యాడ్జెట్లు కొన్ని ఉన్నాయి. ఒకప్పుడు అవి ఒక వెలుగు వెలిగినవే.

- విండోస్ ఫోన్ నుంచి యాపిల్ ఐపాడ్ నానో వరకు
- ఒకప్పుడు ఇవి వెలుగు వెలిగినవే
- పలు కారణాలతో ముగింపు

విండోస్ ఫోన్: విండోస్ ఫోన్ గురించి తెలుసు కదా. మైక్రోసాఫ్ట్ దీని యజమాని. ఎట్టకేలకు ఈ ఫోన్ కథ ముగిసిపోయిందని మైక్రోసాఫ్ట్ అధికారికంగా ప్రకటించింది ఈ ఏడాదే. విండోస్ మొబైల్‌కు ఇకపై ఎటువంటి ఫీచర్స్, హార్డ్‌వేర్‌ను మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేయదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ జోయ్ బెల్‌ఫోర్ ప్రకటించారు.

అయితే, ఇప్పటికే ఫోన్లను కొనుగోలు చేసిన వారికి సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తామని, బగ్‌లు ఉంటే సరి చేస్తామని బెల్‌ఫోర్ తెలిపారు.

3డి టివి: టెలివిజన్లలో 3డి టివి టెక్నాలజీ ఒక సంచలనం. కొన్ని సంవత్సరాల క్రితం దీనిపై పెద్ద ఆసక్తి. కానీ, 2017లో దీని కథ దాదాపు ముగిసిపోయింది. ఎల్జీ, సోనీ సంస్థలు 3డీ టెక్నాలజీ టివిలకు సపోర్ట్ నిలిపివేశాయి. మరొక పెద్ద బ్రాండ్ శ్యామ్‌సంగ్ సైతం 3డి టివిలకు సేవలను 2016లోనే నిలిపివేసింది.

యాపిల్ ఐపాడ్ షఫిల్, ఐపాడ్ నానో: చాలా బాగా ఆదరణ పొందిన యాపిల్ ఉత్పత్తులు ఐపాడ్ నానో, ఐపాడ్ షఫిల్ 2017లోనే ఆగిపోయాయి. ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడంతో రెండు సంవత్సరాలుగా వీటికి సంబంధించి అప్‌డేట్స్ ఏవీ లేవు.

20 ఏళ్ల ప్రయాణం ఎఒఎల్: ఎఒఎల్ ఇన్‌స్టంట్ మెస్సెంజర్ సర్వీస్ 20 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తరువాత డిసెంబర్ 15 నుంచి నిలిచిపోయింది. ఇకపై ఇది పని చేయదని కంపెనీ ప్రకటించింది.

గూగుల్ క్రోమ్ యాప్స్: గూగుల్ 2017 డిసెంబర్‌లో విండోస్, మ్యాక్, లైనక్స్ వెర్షన్లకు సంబంధించిన క్రోమ్ యాప్స్ సెక్షన్ మూసేసింది. క్రోమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌కు మాత్రం పని చేస్తుంది.

జీటాక్ : జీటాక్ మెస్సెంజర్ ప్లాట్ ఫామ్ 2005లో ప్రారంభం కాగా, 2017లో దీని కథ ముగిసిపోయింది. జీటాక్ స్థానంలో గూగుల్ హ్యాంగవుట్స్ సర్వీస్ 2013లోనే ప్రారంభమైంది.

బ్యాంకులు ఆస్తుల అమ్మకాలపై దృష్టి పెట్టాలి

ప్రభుత్వం సూచన

న్యూఢిల్లీ : ఆస్తి- అప్పుల పట్టిక (బ్యాలన్స్ షీట్)ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు తమ వద్ద రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులను విక్రయించే లేదంటే బదలీ చేసుకునే మార్గాలను అన్వేషించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)లకు సూచించింది. ఇప్పటికే నిరర్థక ఆస్తులు, భారీ ఎగవేతదారులు పెరిగిన నేపథ్యంలో ఈ విధంగా స్పందించింది. పటిష్ఠంగా ఉన్న బ్యాంకులు ఇతర సంస్థల రుణాలను కొనుగోలు చేయాలని గత నెలలో జరిగిన పిఎస్‌బి మంథన్‌లో చర్చ నడిచిందని సమాచారం. నిరర్థక ఆస్తులు, పారు బాకీలతో ఇబ్బందులు పడుతున్న బ్యాంకులను పటిష్ఠం చేసేందుకు రూ. 2.11 లక్షల కోట్ల మూలధనం సాయంగా అందజేస్తామని 2017 అక్టోబర్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ హామీ ఇచ్చిన సంగతి విదితమే. రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులు విక్రయించడం ద్వారా బ్యాంకుల తమపై ఉన్న భారాన్ని తొలగించుకొని ముఖ్యమైన విధులు నిర్వర్తించుకునే అవకాశాలు ఉంటాయి. ఉదాహరణకు ఎ అనే బ్యాంకు చిన్న, మధ్య తరహా సంస్థలకు అప్పులు (లోన్‌లు) ఇచ్చిందనుకుందాం. ఆ పోర్ట్‌ఫోలియోను అదే రంగంలో పటిష్ఠంగా ఉన్న మరొక బి బ్యాంకుకు బదలీ చేసుకోవడం లేదా అమ్ముకోవడం అన్న మాట.



అదే విధంగా చిన్న, మధ్య తరహా సంస్థల వ్యాపారాలకు అధికంగా రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల ప్రత్యేక శాఖలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం దేశంలో తయారీ రంగంలో 40 శాతం ఉద్యోగాలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలే కల్పిస్తున్నాయి. అందుకే క్లస్టర్ ఆధారంగా సంస్థలకు రుణాలు అందజేయాలని ఆర్థిక మంత్రిత్వశాఖ సూచించింది. ఇందు కోసం ఇప్పటికే 50 క్లస్టర్లను ప్రభుత్వం గుర్తించింది.


మొబైల్ వినియోగదారులకు శుభ వార్త



న్యూఢిల్లీ : చైనా మొబైల్ మేకర్ వివో తన స్మార్ట్ ఫోన్ వివో వి7 సెల్ఫీ-సెంట్రిక్ స్మార్ట్ ఫోన్ ధరను భారీగా తగ్గించింది. నెల రోజుల క్రితమే మార్కెట్‌లోకి విడుదల చేయగా అంతలోనే దీని ధరను తగ్గించడం విశేషం. దీని అసలు ధర రూ. 18,990 కాగా, తాజాగా రెండు వేల రూపాయల తగ్గించడంతో రూ. 16,990కి అందుబాటులోకి వచ్చింది. గతంలో ఈ ఫోన్ ఇ-కామర్స్ వెబ్‌సైట్లలోనే అందుబాటులో ఉండగా, తాజాగా ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నట్లు సంస్థ తెలియజేసింది.

వివో వి7 విశిష్టతలు : 5.7 అంగుళాల ఫుల్ వ్యూ ఐపిఎస్ డిస్‌ప్లే, 4జిబి ర్యామ్, 32 జిబి అంతర్గత మెమొరీ, 24 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, 16 ఎంపి రియర్ కెమెరా, ఆండ్రాయిడ్ 7.1.2 నోగట్ ఒఎస్, 3000 ఎంఎహెచ్ బ్యాటరీ.

2017లో భారీ లాభాలను ఇచ్చిన మ్యూచువల్ ఫండ్స్



న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు బుల్ ర్యాలీ చేస్తున్నాయి. దీని పుణ్యమా అని ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన వారికి మెరుగైన లాభాలు వస్తున్నాయి. ఎంపిక చేసిన మంచి పని తీరు గల ఫండ్స్‌లో రాబడి గణనీయంగానే ఉంది. 2017లో ఎక్కువ శాతం రాబడులను ఇచ్చిన టాప్ 10

ఫండ్స్‌ను పరిశీలిస్తే...ఎస్‌బిఐ స్మాల్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఏడాది కాలంలో 80 శాతం పెరిగింది. టాటా ఇండియా కన్జ్యూమర్ ఫండ్ 75 శాతం, ఎల్ అండ్ ఇండియా ఎమర్జింగ్ బిజినెస్ ఫండ్ 65 శాతం, రిలయన్స్ స్మాల్ క్యాప్ ఫండ్ 62 శాతం, ఐడిఎఫ్‌సి స్టెర్లింగ్ ఈక్విటీ ఫండ్ 61 శాతం, ఎల్ అండ్ టి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ 60 శాతం, రిలయన్స్ డైవర్సిఫైడ్ పవర్ సెక్టార్ ఫండ్ 59 శాతం, ఎస్‌బిఐ ఎఫ్‌ఎంసీజీ ఫండ్ 59 శాతం, హెచ్ఎస్‌బిసి మిడ్ క్యాప్ ఈక్విటీ ఫండ్ 59 శాతం, హెచ్‌డిఎఫ్‌సి స్మాల్ క్యాప్ ఫండ్ 58 శాతం చొప్పున గడిచిన ఏడాది కాలంలో వృద్ధి చెందాయి.

మీకు మొబైల్ వ్యాలెట్ ఉందా?



ముంబయి : మొబైల్ వ్యాలెట్ కంపెనీలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కాస్తంత ఊరట ఇచ్చింది. డిసెంబర్ 31లోపు ప్రతి వాలెట్ యూజర్ నుంచి వారి గుర్తింపు వివరాలను (కెవైసి) తీసుకోవడం తప్పనిసరి కాగా,

- అయితే మీ గుర్తింపు వివరాలు ఇవ్వాల్సిందే!
- ఫిబ్రవరి 28 వరకు గడువు
- కంపెనీల విన్నపంతో ఆర్‌బిఐ నిర్ణయం
- ప్రభుత్వ గుర్తింపు వివరాలు తీసుకోవడం తప్పనిసరి

కంపెనీల విన్నపం మేరకు ఈ గడువును తాజాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పొడిగించింది. ప్రీ పెయిడ్ పేమెంట్ వ్యవస్థలను సంస్కరించే చర్యల్లో భాగంగా కెవైసి నిబంధనలు అమలు చేయాలని అక్టోబర్ 11న ఆర్‌బిఐ ఆదేశించింది. ఆధార్ తదితర ప్రభుత్వ గుర్తింపు వివరాలు తీసుకోవాలని బ్యాంక్ కోరింది. దీనితో కొన్ని మినహాయింపులు ఇవ్వాలని, గడువు పొడిగించాలని కంపెనీలు అభ్యర్థించాయి. ఎట్టకేలకు ఆర్‌బిఐ ఈ దిశగా నిర్ణయం తీసుకుంది. 2016-17లో సెంట్రల్ బ్యాంకు విడుదల చేసిన గణాంకాల ప్రకారం వ్యాలెట్ సంస్థల ద్వారా 160 కోట్ల లావాదేవీలు జరగగ్గా వీటి విలువ రూ. 53,200 కోట్లు.

రంగంలోకి మహిళా కమాండోలు

(హైదరాబాద్,క్రైం బ్యూరో): మగళ్లతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో మావోల ఏరివేతకు ఇక మహిళా కమాండోలు రంగంలోకి దిగనున్నారు. దేశంలో అన్ని రంగాల్లో మగాళ్లతో సమానంగా దూసుకుపోతున్న మహిళలు కదన రంగంలో కాలుదువ్వుతున్నారు. ధైర్యంలో, దేహదారుఢ్యంలో యుద్ధరంగానికి మహిళలు సరిపోరని విమర్శలు చేసిన వారు నేడు నోరెళ్ల బెడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో మహిళల ఉత్సాహం చూసి విధాన నిర్ణేతల్లో కూడా మార్పు వచ్చిందని చెప్పవచ్చు. భారతదేశంలో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రంగా గుర్తింపు పొందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తొలిసారిగా మవోయిస్టు ఏరివేతకు మహిళా కమాండర్‌లు రంగంలోకి దిగనున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకర్ జిల్లాలోని 'కౌంటర్ టెర్రరిజం జంగిల్ వార్‌ఫేర్ కాలేజీ' (సీటీజేడబ్ల్యూసీ)లో మహిళల శిక్షణకు శ్రీకారం చుట్టింది. ఈ కాలేజీలో గత ఫిబ్రవరి 28వ తేదీన 44 మంది మహిళలు అన్ని రకాల యుద్ధవిద్యల్లో ఆరితేరి కమాండోలుగా ధృవీకరణ పత్రాలు అందుకున్నారు. నదీనదాలు దాటి కొండలు, గుట్టలు ఎక్కి ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా గెరిల్లా పోరాటాలకు కఠిన శిక్షణను పూర్తిచేశారు. మగ కమాండోలకు ధీటుగా తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారు. కమాండో శిక్షణ పొందిన మహిళలను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రాబల్య, ప్రభావిత ప్రాంతాల్లో నియమిస్తామని అదనపు డీజీపీ (యాంటి మావోయిస్టు ఆపరేషన్స్) ఆర్కే విజ్ మీడియాకు తెలిపారు. ఇదిలావుండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మొత్తం 27 జిల్లాలున్నాయి. వీటిలో 16 జిల్లాల్లో నక్సల్స్ ప్రాబల్యం అధికంగా ఉంది. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి చత్తీస్‌గఢ్‌లో ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు ముప్పాళ్ల లక్ష్మణరావు చుట్టూ యుద్ధ నైపుణ్యంలో ఆరితేరిన మహిళా మావోయిస్టులు రక్షణ వలయంగా ఉంటారన్నది సమాచారం. ఈక్రమంలో దట్టమైన అడవుల్లో తలదాచుకునే మావోయిస్టులను ఏరివేసేందుకు ఈ కమాండో మహిళలకు శిక్షణ ఇచ్చామని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఆయుధ రంగంలో ఇన్సాస్ అసాల్ట్ రైఫిల్స్, లైట్ మషిన్ గన్స్, సెల్ఫ్ లోడింగ్ గన్స్ (ఎస్ఎల్ఆర్), ఏకే-47 తుపాకులు, అండర్ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్స్, మోర్టార్ల ప్రయోగంలో కూడా శిక్షణ ఇచ్చారు. ఈ బ్యాచ్‌లో శిక్షణ పొందిన 44 మంది మహిళల్లో ఎక్కువ మంది అతిపేద గ్రామాలకు చెందిన యువతులే ఉన్నారని, మావోయిస్టు మహిళా దళాల్లో కూడా ఇలాంటి గ్రామాలకు చెందినవారే ఎక్కువగా ఉండడం వల్ల వ్యూహాత్మకంగానే కమాండో శిక్షణకు వీరిని ఎంపిక



చేసినట్టు తెలుస్తోంది. వీరిలో మెజారిటీ యువతులు శారీరకంగా, మానసికంగా మగవారికన్నా బలంగా ఉన్నారని కాలేజీ డైరెక్టర్ బ్రిగేడియర్ (రిటైర్డ్) బీకే పొన్వార్ మీడియాకు తెలిపారు. కదన రంగంలో ఏలాంటి పోరాటానికైనా తాము రెడీ అని శిక్షణ పొందిన మహిళా కమాండోలు మీడియాకు తెలిపారు. కాగా దండకారణ్యంలో ఆహారం లభించని పక్షంలో అటవీ ప్రాంతంలో లభించే వాటితో కడుపు నింపుకునేందుకు అన్ని విధాల వారికి శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో లభ్యమయ్యే వాటితో వంటలు వండుకునే విషయంలో వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పోలీసు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. ఇదిలావుండగా ఈ తరహా మహిళా కమాండోలు అనతికాలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశలలో రంగంలోకి దిగనున్నారు. భారతదేశంలో తొలిసారిగా మహిళా కమాండోల శిక్షణకు మవోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా చ త్తీస్‌గఢ్ రాష్ట్రంలో 'కౌంటర్ టెర్రరిజం జంగిల్ వార్‌ఫేర్ కాలేజీలో శిక్షణ పొందుతున్న మహిళా కమాండోలను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మావోల ఏరివేతకు మహిళా కమాండోలను రంగంలోకి దింపనున్నట్లు సమాచారం.

S & D

డీజీపీ సాంబశివరావుకు వీడ్కోలు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : పదవీ విరమణ చేసిన ఆంధ్రప్రదేశ్ డీజీపీ సాంబశివరావుకు పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన పరేడ్‌కు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది సహా నూతన డీజీపీ మాలకొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు దళాల గౌరవ వందనాన్ని డీజీపీ స్వీకరించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ తన 33ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నానని, విధి నిర్వహణలో ఎవరినీ ఎప్పుడూ ఇబ్బందులకు గురి చేయలేదని, తనకు చదువు చెప్పిన గురువులకు పాదాభివందనాలు సమర్పిస్తున్నానన్నారు. పాఠశాల విద్య అభ్యసించే సమయంలో గురువు రామకృష్ణ ప్రోద్బలంతో తనలో ఉన్న సామర్థ్యం గుర్తించారని, మొట్ట మొదటి సారిగా బెల్లంకొండలో ఏఎస్పీగా విధుల్లో చేరానన్నారు. ఉమేష్ చంద్ర, వ్యాస్ త్యాగాలు పోలీసులు మరువలేనివని, తీవ్రవాద సమస్య తీవ్రంగా ఉన్న కాలంలో ఎంతోమంది పోలీసులు ప్రాణాలు పణంగా పెట్టారని ప్రశంసించారు.

దేశస్థాయిలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కోవడంలో ఏపీ పోలీసులు ప్రత్యేక మార్క్ సంపాదించారని, తన మీద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో నమ్మకం ఉంచి కట్టబెట్టిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహించానని అన్నారు. పదవీ విరమణ చేస్తున్న సాంబశివరావు చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి అని నూతన డీజీపీ ఎం.మాలకొండయ్య కొనియాడారు.

తెలంగాణలో కొత్తగా బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్‌ఫ్రంట్

- సామాజిక న్యాయమే కీలకం
- సిపిఎం ఇతర వామపక్షాల భాగస్వామ్యం
- 32 పార్టీలు అంగీకారం
- ఫ్రంట్‌లో కంచె ఐలయ్య, విశ్వేశ్వరరావు, మురళీధర్‌రావు
- ఫ్రంట్‌కు సిపిఐ దూరం
- కోదండరామ్, చంద్రకుమార్‌లతో కొనసాగుతున్న చర్చలు
- రాష్ట్రంలోని 119 స్థానాలకు పోటీ
- డబ్బు , ఫిరాయింపు, అవకాశవాద రాజకీయాలకు దూరం


కె.రాంనారాయణ- ఖమ్మం : రాష్ట్రంలో మరో కొద్దినెలల్లో రాజకీయాలు వేగంగా మారనున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా తెలంగాణ రాష్ట్రంలో బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటుకు రంగం సిద్దంమైంది. డబ్బు, ఫిరాయింపులు , ఆవకాశవాదం అమ్ముడుపోయో రాజకీయాలకు ప్రత్యామ్నయంగా స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తామనే నినాదంతో ఈ ఫ్రంట్ ముందుకు వస్తుంది. నిజంగా డబ్బులేకుండా రాజకీయాలు చేయటం సాధ్యమా? ఫిరాయింపులు, ఆవకాశవాదాన్ని నిలవరించే సత్తా ఫ్రంట్‌కు ఉంటుందా? నోట్లు , ఓట్ల రాజకీయాల్లో ఇది ఎంత వరకు విజయవంతం అవుతుంది. కులాల కుమ్ములాట, మతాల మధ్య ఘర్షణల నేపద్యంలో ఏర్పడుతున్న కొత్త ఫ్రంట్‌కు ఎన్నో సవాళ్ళ ముందు నిలవనున్నాయి. రాష్ట్రం లో టిఆర్‌యస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు సామాజిక న్యాయం అమలు చేయటం లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించటంలో ఆ పార్టీలన్నీ ఒకే దారిలో వెళ్ళుతున్నాయని అందువల్ల వాటికి ప్రత్యామ్నయ వేధిక ఒకటి అవసరం ఉందనే అభిప్రాయంతో ఉన్న 32 చిన్న చిన్న రాజకీయ పార్టీలు , కొన్ని సంస్థలు, ఇందులో చేరనున్నట్లు ఈ ఫ్రంట్ ఏర్పాటులో కీలకంగా వ్యవహరిస్తున్న సిపియం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల ప్రకటించారు. రాష్ట్రంలో తామే అధికారంలోకి వస్తామని కూడా ఆయన దీమా వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం అన్ని నియోజకవర్గాల్లో ఫ్రంట్ తరుపున అభ్యర్దులను పోటి పెట్టానున్నట్లు కూడా ప్రకటించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్‌యస్‌కు ప్రత్యామ్నయం తామేనని కాంగ్రెస్, బిజెపిలు భావిస్తుండగా కొత్తగా ఫ్రంట్ ఏర్పాటు ప్రకటన రాజకీయవర్గాల్లో చర్చకు దారితీసింది. దీంతో ఫ్రంట్ విధివిదానాలు ఏమిటి? ఎన్నిపార్టీల దీనిలో చేరనున్నాయి. దీనికి ఏవరేవరి మద్దతు ఉంటుంది? ప్రజలు ఫ్రంట్‌ను ఆదరిస్తారా? అనే సందేహాలు సహజంగానే కలుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఎర్పడిన తరువాత అధికారలోకి వచ్చిన టిఆర్‌యస్ పాలనపై ప్రజలు నిజంగానే విరక్తిగా ఉన్నారా? ఉంటే ఎవరిని ఆదరిస్తారు? బలమైన కాంగ్రెస్‌ను, కేంద్రలో అధికారంలో ఉన్న బిజెపిని కాదని ఫ్రంట్‌కు ఆవకాశం కల్పిస్తారా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసం మోజార్టీ ఉన్న కులాలు పాలన దూరంగా ఉంటుండగా జనాబాలో తక్కువగా ఉన్న కొన్ని కులాలు అధికారాన్ని చెలాయిస్తున్నాయని అందువల్ల జనాభాలో అధికశాతంగా ఉన్న కులాలను ఏకంచేసి ప్రత్యామ్నయంగా ఎదగాలనే కోరికలో ఏలాంటి తప్పులేదు. అందుకు బౌతిక పరిస్థితులు ఉన్నాయా?



ఈ ఫ్రంట్‌లో చేరేందుకు ఇప్పటికే 32 రాజకీయపార్టీలు అంగీకరించాయని ఇంకా అనేక సంఘాలు, సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అయితే వామపక్ష పార్టీలలో మరో ప్రధానమైన సిపిఐ ఈ ఫ్రంట్‌లో చేరేందుకు సుముఖత చూపలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో టిఆర్‌యస్ లేదా కాంగ్రెస్‌ను ఓడించటం సాధ్యం కాదనే అభిప్రాయంతో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తుంది. ఫ్రంట్ ఏర్పాటు వల్ల టిఆర్‌యస్‌కు లాభం జరుగుతుందనే అభిప్రాయంతో ఆపార్టీ ఉంది. కంచె ఐటయ్య, విశ్వేశ్వరరావు, మురళిధర్‌రావు లాంటి విద్యావంతులు కలిసి వచ్చేందుకు సిద్దపడగా కోదండరామ్, జస్టిస్ చంద్రకుమార్ లాంటి వారితో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఫ్రంట్‌ఇక్కడతో ఆగకుండా బిఎస్పీ అధినేత్రి మయావతితో కూడా సప్రదింపులు జరుపుతన్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా అట్టడుగు, బడుగు బలహీన వర్గాల వేధికగా ఇది రూపాంతరం చెందే ఆవకాశం ఉంది.

సామాజిక న్యాయం కీలక ఎజెండాగా సమాన హక్కులు, విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయటం ఉద్యోగాల కల్పన, ఉపాధి ఆవకాశాలను మెరుగు పర్చటం, ప్రాజెక్టులపై సమగ్ర అధ్య యనం సత్వరం పూర్తిచేసేందుకు చర్యలు , రైతులకు గిట్టుబాటు ధరలు, కూలీలకు ఉపాధి గ్యారంటీ, ఉచిత విద్య, మహిళలకు బరోసా, మతసామరస్యం, శాంతిభద్రతలు, గ్రామాల సమగ్ర అభివృద్ధి , సాగు, తాగునీరు అందించేం దుకు తాగిన ప్రాధాన్యం, పట్టణాల సుందరీకరణ లాంటి కార్యక్రమాలు ఏజెండాగా ఫ్రంట్‌కార్యాచరణ రూపొందించేందుకు సిద్దమౌతుంది. ఇప్పటికే ఉమ్మడి కార్యక్రమం కోసం ఒక సబ్‌కమిటీ , జిల్లాల వారీగా సామాజిక పరిస్థితులు, అధ్యయనం చేసేందుకు మరో సబ్ , జిల్లాల వారీగా ఆయా పార్టీల బలాబలాలు తెలుసుకోనేందుకు ఒక సబ్‌కమిటీ లు ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీలు వారికి అప్పగించిన పని పూర్తిచేసి నివేధికలు అందజేస్తాయి. దీనిపై చర్చించిన అనంతరం ఒక నివేదిక రూపాందిస్తారు. ఫ్రంట్‌కు నూతన జవసత్వాలు కల్గించేందుకు కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు కలిసి పనిచేయటం ద్వారా సాధ్యమౌతుందనే నమ్మకంతో వారు ఉన్నారు. సామాజిక న్యాయం సమగ్రాభివృద్ది లక్ష్యాలుగా ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో రెండుకమ్యూనిస్టుపార్టీలు పాదయాత్రలు , బస్‌యాత్రలు చేశాయి. లాల్-నీల్ జెండాలు ఏకం కావాలని పిలుపు నిచ్చాయి. జనవరి చివరి వారంలో ఫ్రంట్ ఏర్పాటు సందర్భంగా పెద్ద బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సిపియం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి , దళిత ఉద్యమనేత జిగ్నేష్‌లను ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తుంది. బిఎస్పీ అధినేత్రి మయావతి ని కూడా ఈ సభకు రప్పించటం ద్వారా బహుజనల మద్దదు కూడా కట్టవచ్చుననే అభిప్రాయంతో ఉన్నారు. అంగ, ఆర్ధబలాలు రాజ్యమేలు తున్న పరిస్థితుల్లో వాటికి దూరంగా పూరుడు పోసుకుంటున్న బహుజన డెమోక్రటిక్ లెఫ్ట్‌ఫ్రంట్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఏవిధంగా ఆదరిస్తారో చూడాలి మరి.

13న నారావారి పల్లెకు చంద్రబాబు



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు , మంత్రి లోకేష్ సంక్రాంతి సంబరాల సంద ర్భంగా జనవరి 13న సాయంత్రం నారావారి పల్లికి తమ కుటుంబ సభ్యులతో వెళ్లను న్నారు. గ్రామంలో నిర్మితమవుతున్న సామా జిక ఆరోగ్యకేంద్రం, టిడిపి కల్యాణ మండపం రెండో అంతస్థు, విశ్రాంతి భవనాలను ముఖ్య మంత్రి ప్రారంభిస్తారు. ఈ పనుల పరిశీలనార్థం జిల్లా పాలనాధికారి ప్రద్యు మ్న, సంయుక్త పాలనాధికారి గిరీషా గ్రామాన్ని సందర్శించారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 2018 విద్యా సంవత్సరంలో విద్యాలయానికి ఓ ఉపాధ్యాయుడిని కేటాయిస్తామన్నారు. అనంతరం కలెక్టరుకు పలువురు గ్రామ స్థులు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందించారు. సర్పంచి పాశం చంద్రకుమార్‌నాయుడు కాలనీ నుంచి చెత్తతో సంపద తయారీ కేంద్రా నికి చేరుకోవడానికి రహదారి వేయించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతచర్యలు చేపట్టాలని ఏఎస్పీ స్వామి, డీఎస్పీ కనక రాజును కలెక్టరు ఆదేశించారు. ముఖ్యమంత్రి సమీప బంధువు అబ్బూరి కోదండ రామా నాయుడు గ్రామంలో సంక్రాంతి పండుగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకట్రాయులు, ఎంపీడీవో వెంకట నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో ఏపీ టాప్

విజయవాడ, సూర్య బ్యూరో : మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, ఆర్థిక కార్యకలాపాల వంటి ప్రామా ణి కాల ఆధారంగా కేంద్ర గ్రామీణాభివద్ధి శాఖ కేటా యించిన ర్యాంకుల్లో ఏపీకి చెందిన 33 గ్రామ పంచా యతీలు టాప్ టెన్‌లో చోటు దక్కించుకొన్నాయి. తొలి ర్యాంకు తెలంగాణకు దక్కగా, రెండు నుంచి పది దాకా ఏపీ గ్రామాలు సొంతం చేసుకొన్నాయి. రెండో ర్యాంకు - పరపట్ల (చిత్తూరు), మూడో ర్యాంకు-చీడికడ (విశాఖ), నాలుగో ర్యాంకు - కాజులూరు (తూర్పుగోదావరి), ఉంగుటూరు (కృష్ణా), ఎగువ తవనంపల్లి (చిత్తూరు), ఐదో ర్యాంకు-ఇందుపల్లి (కృష్ణా), ఆరో ర్యాంకు- మహల్ (చిత్తూరు), బుచర్ల (అనంతవురం), ఏడో ర్యాంకు- బొమ్మాయిగారిపల్లి, చీకటపల్లి (చిత్తూరు), రావులపాలెం (తూర్పుగోదావరి), వడ్డాది (విశాఖ), ఎనిమిదో ర్యాంకు-వేల్పూరు, పెద అమిరం (పశ్చిమ గోదావరి), అంపోలు (శ్రీకాకుళం), పెనుమూరు (చిత్తూరు), తొమ్మిదో ర్యాంకు - అంగళ్లు, ఎల్లంకివారిపల్లె (చిత్తూరు), చదలాడ(తూర్పుగోదావరి), కంబ వలస (విజయనగరం), పల్లి పాలెం, పెనుమల్లి (కష్ణా), పిప్పర (పశ్చిమ గోదావరి), పదో ర్యాంకు - ఆకుల పేట (విజయనగరం), ఆరవల్లి (తూర్పుగోదావరి), చెర్లోపాలెం, దిమిలి (విశాఖ), కల్లూరు (చిత్తూరు), కంచికచెర్ల, మునునూరు (కష్ణాజిల్లా), ఖాజీపేట్(కడప), మామిడిగొండి (పశ్చిమగోదావరి), సిరికోలం (అనంతవురం) వున్నాయి.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, సూర్య ప్రత్యేక ప్రతినిధి : తెలుగు రాష్ట్రాల ప్రజలను చలి పులి వణికిస్తోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. డిసెంబర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే ఏకంగా మంచు దుప్పటి కప్పేస్తున్నాయి. ఇంట్లోంచి ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. అటు రహదారులపై మంచు పేరుకుపోయి ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ట్రాక్‌లపై మొత్తం మంచు ఉండడంతో రైళ్లలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లంబసింగిలో 3, చింతపల్లిలో 5 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

ఆదిలాబాద్ మన్యంలోనూ 3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదవుతున్నాయి. ఖమ్మం, భద్రాచలం, మెదక్‌లలో 10, హన్మకొండ, హకీంపేట్, నిజామాబాద్‌లలో 13, హైదరాబాద్, రామగుండంలో 12, మహబూబ్‌నగర్, నల్లొండలో 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచే వాతావరణం మారిపోతోంది. పొద్దుపోయేకొద్దీ చలి పెరిగిపోతోంది. అంతగా ప్రభావం చూపలేకపోయాయి. నవంబరులో వరుసగా అల్పపీడనాలు ఏర్పడినా కోస్తా, రాయలసీమల్లో వర్షాలు లేవు. రెండు వాయుగుండాలు ఉత్తర కోస్తా వైపు రాగా ఒకదాని ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో భారీవర్షాలు కురిశాయి.

నగరం నేరాల 'అడ్డా' : నియంత్రణలో పోలీసులు విఫలం

ఖద్దరు సేవల్లోనే ఖాకీలు నిమగ్నం

(హైదరాబాద్, క్రైం బ్యూరో): పట్ట పగలు దారుణ హత్యలు..ఉగ్రవాద సంస్థల హెచ్చరికలు, పండుగ పర్వదినాల్లో మత విద్వేషాలు చెలరేగుతాయన్న ఆందోళన. పాతబస్తీలో అరబ్‌షేక్‌ల ఆగడాలు. బంగారు దుకాణాల్లో రాత్రికి రాత్రి భారీ చోరీలు. ఉపాధి, విదేశాల పేరిట బడా మోసాలు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, దారుణ హత్యలు, చైన్ స్నాచింగ్ తదితర నేరాలతో నగరం అట్టుడికి పోతోంది. విధుల విషయం అటుంచితే పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టడంతోనే సరిపోతోంది. వెరసి తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిలోని పోలీసు వ్యవస్థ బలగం గోరంత, బాధ్యత కొండంత అన్న



చందంగా మారింది. ఉన్న కొద్దిపాటి సిబ్బందితో శాంతిభద్రతల పరిరక్షణ ఇబ్బందిగా మారిందని చెప్పవచ్చు. ఢిల్లీ నగరంలో దాదాపు 60వేల మందికిపైగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే కోల్‌కతా, ముంబై, బెంగళూరు నగరాల్లో 30వేల మంది పోలీసులు విధుల్లో ఉన్నారు. కాగా దేశ రెండవ రాజధానిగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరంలో కేవలం 9వేల మంది పోలీసులే ఉన్నారన్నది అక్షర సత్యం. అరకొర సిబ్బందితో ఇటు నేరాలను అదుపు చేయలేక, ఇటు శాంతిభద్రతలు అందించలేక నగర పోలీసు ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిలో నిత్యం మూడు దారుణాలు..నాలుగు దుర్మార్గాలు చోటుచేసుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన నేరస్తులకు హైదరాబాద్ నగరం అడ్డాగా మారుతోంది.

వివిధ బ్యాంకులలో భారీ చోరీలు, అత్యాచారాలు, అపహరణలు తదితర నేరాలతో రాష్ట్ర రాజధాని అట్టుడికి పోతోంది. రాష్ట్రంలో ఏదో ఒక చోట నిత్యం భారీ నేరం చోటుచేసుకుంటూనే ఉంది. నగరంలోని మహేష్‌బ్యాంక్‌కు కన్నం వేశారు. ఈక్రమంలో నేరస్తుల వీరంగానికి పోలీసుశాఖ వీస్తూ పోవడం తప్పం వాటిని అరికట్టడంలో విఫలమవుతోంది. ఒకదశలో పోలీసుశాఖ నేరాలను అరికట్టలేని స్థితికి చేరుకుందా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలోకంటే ఇటీవల కాలంలో నేరాలు అధికమయ్యాయని పోలీసు రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి. ఇందులో భాగంగా గత ఏడాదిలో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 22.49శాతం కేసులు పెరిగే అవకాశాలున్నాయని ప్రస్తుత పరిస్థితులు తెలియజేస్తున్నాయి. ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు 15.11శాతం పెరిగాయి. గడచిన ఆరునెలల్లో అన్ని రకాల నేరాల శాతం 12కు పెరిగాయని, అందులో అధికంగా కిడ్నాప్, అత్యాచారంతో పాటు చోరీలు, ఆర్థిక నేరాలుండటం గమనార్హం. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిలో పోలీసుశాఖ సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఉన్న అరకొర సిబ్బంది నాయకుల సేవలో తరిస్తూ సేదతీరుతుండటం గమనార్హం. రాష్ట్రంలో జడ్‌ప్లస్, జడ్, వై, వైప్లస్ భద్రత కల్గివున్న నేతలతోపాటు మాజీ డిజిపి, ఇతర అధికారుల నివాసాల్లో ఏళ్లతరబడి వారి సేవల్లో పోలీసులు తరిస్తున్న విషయం విధితమే. నేతల భద్రతకే అధిక సంఖ్యలో పోలీసు సిబ్బందిని నియమించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసుల సంఖ్యతో పోలిస్తే నేర స్వభావం, వివిధ నేరాలతో సంబంధం ఉన్న వారే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కేవలం 9వేల మంది పోలీసులు విధులు నిర్వహిస్తుడటం గమనార్హం. ఈ క్రమంలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 20నుంచి 35వేల వరకు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే తెలుగు రాష్టాటల ఉమ్మడి రాజధానిలో కేవలం 9వేల మంది పోలీసులతో శాంతిభద్రతలకు ఉపయోగిస్తుండం విచారకరం. ఉన్న సిబ్బందిలోనే ప్రముఖ నేతలకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వివిధ కేసుల్లో సమన్ల జారీ తదితర పనులు అధికశాతం పోలీసులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు కేటాయించే సిబ్బంది స్వల్ప సంఖ్యలో ఉన్న కారణంగా నేరాల శాతం పెరుగుతోందని చెప్పవచ్చు. నగరంలోని సైనిక్‌పురిలో కెనరా బ్యాంక్‌లో 78లక్షల రూపాయలు చోరీ చేసిన ఘటన ఇంతవరకు మిస్టరీ వీడలేదు. అలాగే గతంలో ఒక మహిళను హతమార్చి సూట్‌కేసులో వదిలి వెళ్ళిన ఘటన ఇంతవరకు మిస్టరీగా మిగిలింది. నగరంలోని భారీ సంఖ్యలో చైన్‌స్నాచింగ్‌ల కేసులు పలు పోలీస్‌స్టేషన్స్‌లో మిస్టరీగా ఉన్నాయి. ఇక ద్విచక్ర వాహనాల, భారీ వాహనాల




మిస్సింగ్ కేసులకు సంబంధించి చిక్కుముడి వీడనివి లక్షల్లో ఉన్నాయన్నది సమాచారం. ఇళ్లకన్నాలు, గొలుసుకట్టు నేరాల సంఖ్య గణనీయంగా ఉన్నాయి. నేరాల నియంత్రణ కన్నా నేరాలు జరిగాక పోలీసుల హడావిడి చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెరసి రాష్ట్ర రాజధానిలో నేరస్తులకు అడ్డాగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రాష్ట్ర రాజధానిలో ఇతర నేరాలతో పాటు అరబ్‌షేక్‌ల ఆగడాలు, బాలికల అదృశ్యాలు, తదితర నేరాల ఘటనలు అధికమవుతున్నాయి. నేరాల విషయంలో ఇతర రాష్ట్రాల రాజధానులతో పోలిస్తే రాజధాని నగరంలో రోజురోజుకు విస్తరిస్తుండటంతో హైదరాబాద్, సైబరాబాద్ ప్రాంతాల్లో నేరాలు అధికంంగా జరుగుతున్నట్లు పోలీసుల అధికారులే పేర్కొంటున్నారు. మహానగరంలో నేరాల నియంత్రణకు పోలీసుశాఖ ఉన్నతాధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేరాల నియంత్రణకు ఉపయోగిస్తున్న బలగాలు, విభాగాలను బలోపేతం చేసి నేరస్తులను కట్టడిచేయని పక్షంలో పోలీసుశాఖ మరింత అపఖ్యాతి మూటకట్టుకోవాల్సి వస్తుంది. అదేవిధంగా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విమరణ పొందిన వారికి ఆర్డర్లీగా కేటాయించే సిబ్బందిలోనూ కోత విధించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా నగరంలో శాంతిభద్రతల కోసం ప్రత్యేక పోలీసు నియామకాలు చేపట్టాల్సిన అవశ్యకతను ఆశాఖ ఉన్నతాధికారులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యాటకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- కొండలను అనుసంధానం చేస్తూ రోప్‌వే
- కొండవీడు కొండల్లో ట్రెక్కింగ్‌కు ప్రణాళిక
- 500 హెక్టార్లలో జంతు ప్రదర్శనశాలకు ప్రతిపాదనలు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ నేపథ్యంలో పర్యటకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గుంటూరు వచ్చే పర్యటకులు ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు ఆనందానుభూతిని పొందడానికి వీలుగా కొండవీడు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. కొండవీడు రిజర్వు అటవీ ప్రాంతం పచ్చదనంతో కూడిన కొండలను పర్యటకంగా తీర్చిదిద్దనున్నారు. ఇక్కడి వచ్చే పర్యటకులకు మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.6.8 కోట్లతో అటవీ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాటూరు వైద్య కళాశాల వెనుకవైవు నుంచి కొండవీడు కొండల హద్దుగా 500 హెక్టార్లలో మినీ జంతు ప్రదర్శనశాల ఏర్పాటుచేయడానికి కేంద్ర జూ అథారిటీకి ప్రతిపాదనలు పంపడానికి అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. నగర వనంలో కొండల నుంచి కొండవీడు వరకు వరుసగా ఉన్న కొండలకు మార్గాలను ఏర్పాటుచేసి ప్రకృతి దారి నిర్మిస్తారు. కొండల నడుమ తీగమార్గం నిర్మించడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ. 5 కోట్ల నిధులు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడంతో ప్రణాళికలు వేగవంతమయ్యాయి. వీటిన్నిటిని వీలైనంత తొందరగా పూర్తిచేసి పర్యటకులు ఒక రోజు మొత్తం ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాటుచేయడానికి కసరత్తు మొదలైంది. కొండవీడు పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.6.80కోట్లతో అటవీశాఖ పంపిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి పచ్చజెండా ఊపడంతో సవివర ప్రాజెక్టు నివేదిక తయారీకి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కొండ చుట్టూ 4.1 కిలో మీటర్ల మేర కంచె



ఏర్పాటుచేస్తారు. జింకల పార్కు, పక్షుల కేంద్రం, బొటానికల్ గార్డెన్, వాచ్‌టవర్లు, ఉద్యానవనాలు, ఔషధ మొక్కలతో వనం, చిన్నపిల్లల పార్కు, పర్యటకులకు వసతి తదితర సౌకర్యాలు కల్పిస్తారు. కొండ పైభాగంలో 122 హెక్టార్లలో వురావస్తు శాఖ వివిధ అభివృద్ధి పనులు చేపట్ట నుంది. ఇందులో 70 హెక్టార్లలో మూడుమీటర్ల పొడవైన మొక్కలు నాటడానికి అటవీశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతోపాటు కొండకు వెనుకవైవు నుంచి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మెట్ల మార్గాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి అటవీ శాఖ నుంచి అనుమతి రావడంతో మెట్ల మార్గానికి అడ్డంకి తొలగింది. అటవీ శాఖకు అడవి అభివద్ధికి రూ.10 లక్షల చెల్లించిన వెంటనే మెట్లమార్గం పనులు మొదలవుతాయి. ప్రస్తుతం కొండవీడు కొండ పైభాగం వరకు ఆర్‌అండ్‌బీ వారు రహదారి నిర్మిస్తున్నారు. అయితే కొండ పైభాగంలో 650మీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు అటవీశాఖ నుంచి అనుమతి తీసుకోవడానికి ఆర్ అండ్ బీ ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. కొండవీడు కొండకు ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతాలు ఉండటంతో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కొండవీడు కోటకు వచ్చేవారు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ, మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలు గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని అటవీశాఖ ప్రణాళికలకు రూపకల్పన చేసింది.

ప్రత్తిపాడు మండలంలోని జాతీయరహదారి పక్కనున్న కాటూరి వైద్య కళాశాల వెనుక వైవు నుంచి కొండల కింద మైదాన ప్రాంతంగా ఉన్న అటవీ ప్రాంతంలో జంతు ప్రదర్శన శాల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని అటవీశాఖ సూచిం చింది. ఇక్కడ జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించడంతో కేంద్ర జంతుప్రదర్శనశాఖ అథారిటికి అనుమతి కోసం ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ మంత్రి సూచించారు.

అభివృద్ధికి చర్యలు...

నగరవనం ప్రారంభం సందర్భంగా రూ. 5 కోట్ల నిధులు అభివద్ధికి కేటాయిస్తానని సీఎం హామీ ఇచ్చారు. ఈనిధులతో నగరవనాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కొండపై తెలువు, ఎరువు, పసువు రంగుల వూలు వూసే మొక్కలను కొండలకు ఒక్కొక్క వైవు ఒక్కొక్క రకం వూలమొక్కలు పెంచి సుందరంగా తీర్చిదిద్దుతారు. నగరవనంలో మరో చిన్నపిల్లలపార్కు ఏర్పాటుచేస్తారు. నగరవనానికి వచ్చే వారు సేదతీరడానికి వీలుగా బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పిస్తారు. ప్రస్తుతం ఇక్కడ 10 సైకిళ్లు అందు బాటులో ఉంచారు. మరో 20 సైకిళ్లు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రకతినడక పేరుతో చెట్ల నడుమ ప్రశాంతమైన వాతావరణంలో పర్యటించేలా ఏర్పాట్లు చేస్తారు.

మొదటి పేజీ తరువాయి

తలైవా అరంగేట్రం

రాజకీయాలు నాకు కొత్తేం కాదు. 1996లోనే నేను రాజకీయాల్లో ఉన్నాను అన్నారు. సహజంగానే ఆధ్యాత్మికత మెండుగా ఉన్న రజినీకాంత్ భగవద్గీత శ్లోకాన్ని కూడా ఆశువుగానే వల్లిస్తూ 'కర్మణ్యే వాధికారస్తే' అంటూ... పని చేయడమే మన పననీ, ఫలితం భగవంతుడే ఇస్తాడని తన మాటల్లో చెప్పుకొచ్చారు. పనిలో పనిగా రాజకీయాల్లో కొత్తేమో కానీ, రాజకీయాలకు కొత్తకాదంటూ చెప్పుకొచ్చారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్న సందర్భంగా విలక్షణ నటుడు కమల్ హాసన్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లోకి వస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు. సమాజం పట్ల మీకున్న సెంటిమెంట్ అభినందనీయం. వెల్‌కం అని కమల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. రజనీ కంటే ముందు కమల్ హాసన్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. తన వుట్టినరోజు సందర్భంగా పార్టీ ఏర్పాటు చేస్తానని చెప్పిన కమల్ 2018లో పార్టీ వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. తన వుట్టిన రోజు సందర్భంగా మయ్యం విజిల్ యాప్‌ను కమల్ ప్రారంభించారు. జనవరి నుంచి దీని సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు. రజనీ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా రజనీ రాజకీయ అరంగేట్రం గురించి ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తాజాగా స్పందించారు. రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం ఈ శతాబ్దంలో అత్యున్నత సంఘటన. రాజకీయ పార్టీని స్థాపించనున్నానంటూ రజనీ తన నిర్ణయాన్ని చెప్పే సమయంలో ఆయన తెరపై కన్నా వందరెట్లు ప్రభావితంగా కనిపించారు. తమిళనాడులోని 234 స్థానాల నుంచి పోటీ చేస్తానని చెప్పిన రజనీ ఆత్మ విశ్వాసాన్ని, ధైర్యాన్ని పీకే (పవన్‌కల్యాణ్) ఆదర్శంగా తీసుకోవాలి అని వర్మ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

మహిళలకు హజ్ అనుమతి

దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరు కాబోతున్నారని చెప్పారు. ప్రపంచంలోని పది దేశాల అధినేతలు ఈ వేడుకలకు హాజరు కావడం భారతీయులందరికీ గర్వకారణమని వివరించారు. భారతీయులందరికీ జనవరి 26 చారిత్రక పండుగ అని, 2018 జనవరి 26ను అనేక సంవత్సరాలపాటు గుర్తుంచుకునే విధంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పది మంది ముఖ్య అతిథులు హాజరుకావడం ఇదే మొదటిసారి అని తెలిపారు. కొత్త ఏడాదిన 18వ ఏట అడుగు పెడుతూ ఓటు హక్కును పొందబోతున్న యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ ఏడాదిలో చివరి రోజున మన్ కీ బాత్ ద్వారా దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ అంశాల గురించి ప్రస్తావించారు. దేశ ప్రజలందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 21వ శతాబ్దంలో వుట్టిన వాళ్లు 2018, జనవరి 1న ఓటు హక్కుకు అర్హత సాధిస్తారు. భారతీయ ప్రజాస్వామ్యం కొత్త ఓటర్లను ఆహ్వానిస్తోంది. దేశం కులతత్వం, మతతత్వం, ఉగ్రవాదం, అవినీతి, పేదరికం వంటి సమస్యల నుంచి విముక్తి పొందాలి. అప్పుడే సరికొత్త భారతావని ఆవిష్కృతమవుతుంది అని మోదీ అన్నారు. ఇటీవలే తాను అంజుమ్ బషీర్ ఖాన్ ఖట్టక్ గురించి విన్నానని, గతంలో అతడు పూర్తిగా ద్వేషం, ఉగ్రవాద భావాలతో నిండిపోయి ఉన్న వ్యక్తి. కానీ ఇప్పుడు కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ ఎగ్జామినేషన్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. నేడు అతడు జమ్మూకశ్మీర్‌కి మాత్రమే కాదు.. భారత్‌కే స్ఫూర్తిగా నిలిచాడని పేర్కొన్నారు.



బాబు పాలన వైఫల్యనామ సంవత్సరంగా ముగిసింది : రఘువీరా

విజయవాడ, సూర్య బ్యూరో : బాబు వస్తే జాబ్ అని ప్రచారం చేసి అధికారం లోకి వచ్చిన చంద్రబాబు అన్న మాట ప్రకారం తన కొడుకు చిన్న బాబుకు మంత్రి పదవిని ఇచ్చారని, 2017లో చంద్రబాబు పాలన వైఫల్యనామ సంవత్స రంగా ముగిసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్ రఘువీరా రెడ్డి ఎద్దేవా చేశారు. ఏపిసిసి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో అధికారం లోకి టిడిపి గడిచిన మూడు సంవత్సరాల్లో ప్రచారంపై తప్ప అభివద్ధిపై దష్టి సారించ లేదన్నారు. చంద్రబాబుకు ప్రచారంపై ఉన్న ఆసక్తితో కోట్ల రూపాయల ప్రజా ధనం వద్దా చేస్తున్నారు అన్నారు. విభజనసమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీ ప్రత్యేకహోదాపై చంద్రబాబు ఎన్నిసార్లు మాట మార్చాలో అన్నిసార్లు మార్చారు. డ్వాక్రా రుణాల విషయంలోనూ అదే తంతు. ఇంటి ఒక్క ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ యువతకు ఇచ్చిన అతిపెద్ద హామీ నిరుద్యోగ భృతి. అదీ అటకెక్కింది అన్నారు. ఈ మూడున్నర సంవత్స రాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పుకో దగ్గ ఐటి కంపెనీ ఏపీవైపు చూడలేదన్నారు. ఎంవోయు జరిగిన పెద్ద పరిశ్రమ హీరో ఇప్పటి వరకూ అతీ గతీ లేదున్నారు. రాష్ట్ర చర్రిత్రలో ఎన్నడూ లేనిరీతిలో ఇసుక ఓపెద్దస్కాంల కేంద్రంగా మారిం దన్నారు. రాజధాని భవనాల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చినా కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని స్థితిలో టిడిపి ప్రభుత్వం ఉందన్నారు. కోట్ల రూపాయల వ్యయంతో వైజాగ్‌లో నిర్వహించిన భాగస్వామ్య సదస్సుది కూడాఫెయిలూర్ స్టోరీనే అన్నారు. ముఖ్యంగా విధానపరమైన నిర్ణయాల్లో చంద్రబాబు డొల్లతనం ఎన్నోసార్లు బయటపడిందన్నారు. కాంగ్రెస్ హయంలో ఏపీకి వచ్చిన సొంత జిల్లా చిత్తూరులోని మన్నవరం ప్రాజెక్టును కూడా చంద్రబాబు కాపాడుకోలేక పోవటం మరో అతి ఫెయిల్యూర్ అన్నారు.

జిల్లాల్లో పున్వరిభజనపై మరోసారి చర్చ

- ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం జిల్లా ఏర్పాటుపై అభ్యంతరాలు లేవు
- మండలాలను వేరే జిల్లాలకు మార్చటంపై అసంతృప్తి
- ఆంధ్రలో కలిపిన మండలాలతో తీరని అన్యాయమే
- ఐదు గ్రామాలకోసం చర్చలు కొనసాగింపు



ఖమ్మం, మేజర్‌న్యూస్ : హైకోర్టు వాఖ్యల నేపథ్యంలో జిల్లాల పునర్విభజన మరోసారి చర్చకు దారి తీసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిజంగానే ఇన్ని జిల్లాలు అవసరమా? జిల్లాల సరిహద్దుల వ్యవహా రంలో తప్పిదాలు ఉన్నాయా? ఉంటే వాటిని ఏలా పరిష్కరించాలి. శాసనసభ, లోకసభస్థానాలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పై ఏ విధంగా ముందుకు పోవాలి? అనే అంశంపై దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 23 జిల్లాలు ఉండగా తెలంగాణ రాష్ట్రం 10 జిల్లాలతో కొత్తగా దేశంలో 29 వ రాష్ట్రంగా అవతరించింది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిఆర్‌యస్ పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలను పున ర్విభజించాలని నిర్ణయించింది. తొలుత ఆరు నుంచి 10 జిల్లాలు కొత్తగా ఏర్పాటు చేయాలని భావించినా ఆయా ప్రాంతాల్లో ఉన్న డిమాండ్లను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 21 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. చివరలో సిరిసిల్ల, జనగామ, గద్వాల లాంటి జిల్లాల ఏర్పాటుపై తర్జన భర్జనలు జరిగాయి. సీఎం కేసీఆర్ చివరకు చిన్నవి అయినప్పటికి వివాదాలకు పోవద్దనే ఉద్దేశ్యంతో అన్నింటికి అంగీకరించారు. ఖమ్మంజిల్లాను రెండు జిల్లాలుగా చేయటంతో పాటు జిల్లాలోని ఐదు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కాగా మరో 4 మండలాలు జిల్లా నుంచి విడగొట్టి రెండు మండలాలను భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోనూ, మరో రెండు మండలాలను మహబూబాబాద్ జిల్లాలో కలిపారు. వీటిపై అభ్యంతరాలు వచ్చి ఆందోళనలు చేసినప్పటికి ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోలేదు. ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రలో కలిసిన ఐదు గ్రామాలను ఇవ్వమని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తునే ఉన్నారు. భౌగోళికంగా ఐదు గ్రామాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు సాగించాల్సి రావటంతో ఇబ్బందులు ఉన్నాయి. ఇక జిల్లాను రెండుగా విభజించినప్పుడు అనేక ప్రతిపాదనలు వచ్చాయి.

భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా రెండు జిల్లాలుగా విడిపోయింది. ఖమ్మం జిల్లాలో 14 లక్షల జనాభా ఉండగా కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 12 లక్షల మంది జనాభా ఉన్నారు. మరో రెండు లక్షల మంది వరంగల్ జిల్లా నుంచి విడివడిన రెండు జిల్లాలకు వెళ్లారు.

చిన్న రాష్ట్రంలో 10 జిల్లాలు ఉండగా మరో 21 జిల్లాల ను ఏర్పాటు చేయటంతో, కొన్ని చిన్న జిల్లాలు మరి కొన్ని పెద్ద జిల్లాలు మరికొన్ని మీడియం జిల్లాలుగా అవతరించాయి. పెద్ద జిల్లాల్లో అధికారం చెలాయించిన అధికారులకు చిన్న జిల్లాలలో కొంత ఇబ్బందిగా ఫీలౌతున్నారు. కొన్ని జిల్లాలు మండలానికి ఎక్కువ, ఆర్‌డిఓ పరిధికి తక్కువగా ఉండగా మరికొన్ని జిల్లాకు తక్కువ ఆర్‌డిఓకు ఎక్కువగా ఉన్నాయి. చిన్న జిల్లాల ఏర్పాటుపై టిఆర్‌ఎస్ శ్రేణుల్లోనే అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఒక్క ఎంపి నియోజకవర్గం నాలుగుజిల్లాల పరిధిలో ఉండగా ఎమ్మెల్యేలు సైతం మూడు నాలుగు జిల్లాలకు విస్తరించి ఉండటం ఇబ్బందిగా మారింది. 10 జిల్లాల నుంచి 31 జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికి జిల్లా పరిషత్‌చైర్మన్లు 9 మంది జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ చైర్మన్లు 9 మంది, జిల్లా మార్కెటింగ్ చైర్మన్లు 9 మంది మాత్రమే ఉన్నారు. 31 మందికలెక్టర్లు, 31 మంది ఎస్పీలను నియమించారు. అర్హులైన అధికారులు లేనప్పటికి వారికి ప్రమోషన్లు ఇచ్చి పరిపాలన సాగిస్తున్నారు.

ఇక రిక్రూమెంట్స్‌లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాలకు టీచర్సు నియామకాలకోసం నోటిపికేషన్ జారీ చేసింది. దీనిపై కోర్టుకు వెళ్లటంతో సుప్రీకోర్టు ఇది సరైంది కాదని పాత జిల్లాల ప్రకారమే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశాలు జారీచేయటంతో తిరిగి సుప్రీం తీర్పు ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వాల్సి వచ్చింది. హైకోర్టు కూడా జిల్లాల ఏర్పా టుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ ఇచ్చిన ట్లైంది.

దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలో పడింది. తిరిగి పునర్విభజన చేయ టంతోపాటు శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాల సరివాద్దులను సరిచూసుకుంటే మంచిదనే అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం. దీంతో ఖమ్మం జిల్లా నుంచి మహబూబాబాద్‌లో కలిపిన గార్ల, బయ్యారం. భూపాల పల్లిలో కలిపిన వాజేడు, వెంకటాపురం మండలాలను ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో కలపాలనే డిమాండ్ ముందుకు వస్తుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి?

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మంత్రి జగదీష్‌రెడ్డి




సూర్యాపేట, మేజర్‌న్యూస్ : 2017 సంవత్సరానికి వీడ్కో లు పలుకుతూ 2018 సంవ త్సరానికి స్వాగతిస్తూ రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం లోనే రైతు రాజ్యమే రామ రాజ్యం అన్నట్టుగా నిజం చేస్తున్న మన ముఖ్యమంత్రి కేసీఆర్ జనవరి 1 నుండి రాష్ట్రం మొత్తం 24 గంటలు కరెంటు ఇవ్వడం దేశ చరిత్రలో శుభ దినం అన్నారు. గత పాలకులకు నిద్రపట్టని రోజు అని, తెలంగాణ రాష్ట్ర వస్తే రాష్ట్రం మొత్తం కారు చీకట్లు కమ్ముతాయని, దొరల పాలన వస్తుందని అవహేళన చేసిన నాయ కులకు నేటితో మతిభ్రమిస్తుం దన్నారు. తెలంగాణ లో ప్రతిఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.

వైసీపీ జెండా మోస్తున్న కాంగ్రెస్ నేతలు




అమరావతి, సూర్య ప్రతినిధి : ఏపీ కాంగ్రెస్ నేతలు వైసీపీ ఎజెండా మోస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు పేర్కొన్నారు. ఆది వారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా కాంగ్రెస్ అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఏపీ హక్కులపై పార్లమెంట్‌ను స్తంభింపజేయాలని ఆయన అన్నారు. అలాగే పోలవరానికి రఘువీరారెడ్డి పాదయాత్ర చేస్తాననడం విడ్డూరంగా ఉందని ముద్దు కృష్ణమనాయుడు పేర్కొన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు రఘు వీరా హంద్రీనీవా, గాలేరు నగరిని పట్టించుకోలేదని, టీడీపీ హయాంలోనే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

పాపికొండలుకు పర్యాటకుల తాకిడి



పోలవరం, సూర్యప్రతినిధి: నూతన సంవత్సర వేడుక లను ప్రకృతి అందాల మధ్యలో జరుపుకునేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు పోలవరం రేవునుంచి పాపి కొండ లకు బోట్లపై బయలుదేరి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా కురుటూరు, సిరివాక గ్రామల మధ్యలో ఉన్న రిసార్ట్స్‌లో బస చేసేందుకు ముందుగానే ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రంతా ఆటపాటలతో గడిపేందు కు యువత సిద్ధమయ్యారు.

10న ముమ్మడివరంలో సీఎం పర్యటన



నెల్లూరు,సూర్యప్రతినిధి : జనవరి 2 నుంచి 11 వరకు నిర్వహించే జన్మభూమి-మా వూరు కార్యక్రమంలో భాగంగా జనవరి 10న సీఎం చంద్ర బాబు నాయుడు ముమ్మడి వరంలో పర్యటి స్తారని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. మండలంలోని సీహెచ్. గున్నేపల్లిలో నిర్వహించనున్న సీఎం బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పర్యటనలో భాగంగా హెలిప్యాడ్, బహిరంగసభ నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

కొత్త సంవత్సర సంబరాలకు

హార్సిలీ హిల్స్ ముస్తాబు


పర్యాటక మేనేజరు మురళి

చిత్తూరు, సూర్యప్రతినిధి : కొత్త సంవత్సర వేడుకలకు హార్సిలీహిల్స్ సిద్ధమైంది. సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఇప్పటికే కొండపైకి చేరుకున్నారు. ఈనెల 31వ తేదీ నుంచి రెండో తేది ఉదయం వరకు కొండపై రద్దీ కొనసాగుతుందని భావిస్తున్నారు. ప్రతి ఏడాదిలాగానే ఈసారి పర్యాటక శాఖ విందు, వినోద కార్యక్రమాలను నిర్వహిస్తోంది.పర్యాటక హాలులో ఆదివారం రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి వరకు ట్రెడిషనల్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు పర్యాటక మేనేజరు మురళి తెలిపారు.సంగీత, నృత్య కార్యక్రమాలు, మిమిక్రీ, మ్యాజిక తోపాటు వివిధ రకాల పోటీలను నిర్వహించ నున్నా ని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పర్యాటకులకు 35 రకాల వంటలను వడ్డించనున్నట్లు వివరించారు. కొండపై ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవడానికి ఈ నెల 31వ తేది మధ్యాహ్నం నుంచి వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ సాయంత్రం వరకు ఆంక్షలను అమలు చేయనున్నట్లు మదనపల్లె రూరల్ సీఐ మురళి తెలిపారు. కొండపైకి ద్విచక్ర వాహనాలను అనుమతించబోమని ,మద్యం తీసుకెళ్లనివ్వబోమని పేర్కొన్నారు. కొండపై రద్దీని పురస్కరించుకుని ఘాట్ రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మిగనూరు నాకు కన్నతల్లి లాంటిది

అక్కడి నుంచే పోటీ చేస్తా

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



కర్నూలు, సూర్యప్రతినిధి : వచ్చే ఎన్నికల్లో సీఎం చంద్ర బాబు తనకు కచ్చితంగా టీడీపీ టికెట్ ఇస్తారని అందులో ఎటువంటి అనుమానం లేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తేల్చిచెప్పారు. ఆదివారం మధ్యాహ్నం మీడియా తో మాట్లాడిన ఆయన ఏపీ సీఎం చంద్రబాబు ఆశీస్సులతో ఎమ్మిగనూరు టికెట్ తనకే వస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు తనకు కన్న తల్లి లాంటి దన్నారు. ఎమ్మిగనూరు నుంచే పోటీ చేస్తానని మరోసారి ఆయన స్పష్టం చేశారు. తనకు టికెట్ రాదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ అవన్నీ నియోజకవర్గ ప్రజలు నమ్మకండి, ఆందోళన చెందకండని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు.

2019లో 170 స్థానాలు మావే



గుడివాడ, సూర్య ప్రతినిధి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 170 స్థానాల్లో వైసీపీ విజయం సాధించి తీరుతుందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. గన్నవరం నియోజకవర్గం నున్నలో ఏర్పాటు చేసిన పల్లె నిద్ర, రచ్చబండ కార్యక్రమంలో వంగవీటి రాధ, దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నున్న కూడలిలో పార్టీ జెండా ఎగురవేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయటంలో వివక్ష చూపుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు ప్రజలు మనస్సులో స్థిరస్థాయిగా నిలిచిపోయాయిన్నారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పార్కులను పరిశీలించిన మంత్రి నారాయణ



నెల్లూరు, సూర్య ప్రతినిధి : నెల్లూరు నగరంలోని ఆయా పార్కులను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలో మొత్తం 18 పార్కులు, మరో 120 లేఔట్లలో పార్కులకు స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి పార్క్‌లో వాకింగ్ ట్రాక్, టాయిలెట్లు, డ్రింకింగ్ వాటర్, ఓపెన్ జిమ్ సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు. అలాగే పినాకినీ పార్కును రివర్ ఫ్రంట్ పార్కుగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

భానుపురి,మేజర్‌న్యూస్: క్రీడాకారులు కష్టపడి తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రవళిక అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల మైదానంలో హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్, మాజీ యంపి జి. వివేక్ తండ్రి జి. వెంకట స్వామి(కాకా) స్మార్ధకం ఉమ్మడి నల్గొండ క్రికెట్ అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహించే తెలంగాణ టి-20 లీగ్ క్రికెట్ సెలక్షన్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహిస్తుందనితెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చిన వారిని జాతీయ స్థాయి పోటిలకు ఎంపికావలని సూచించారు. మంత్రి జగదీష్‌రెడ్డి సహాకారంతో ఇప్పటికే కబడ్డీ, వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నాయిని శ్రీనివాస్‌రావు, ప్రవీణ్, మోహన్, నాయకులు గండూరి ప్రకాష్, బూర బాలసైదులుగౌడ్, అజీజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలోని సంజయ్యనగర్‌లో మేకల రాము యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజ జరిగింది. ముఖ్యఅతిథిగా సినిమా హీరో సుమన్, శ్రీధర్, కపిల్‌రాజ్, నక్క ప్రభాకర్‌గౌడ్ టిఆర్ఎస్ స్టేట్ సెక్రెటరీ, వీ.కె. మహేష్, స్థానిక కార్పొరేటర్లు శిరీషారెడ్డి, జగదీష్‌గౌడ్, మరియు అశేష అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు. గుడివాడ భక్త మండలిచే అయప్పభక్తిపాటలు చాలా సంతోషపరిచాయి. అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

నూతన సంవత్సరం నూతన వెలుగులు నిండాలి

- నేటి నుండి రైతాంగానికి నిరంతరం ఉచిత విధ్యుత్తు
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- ప్రజలకు సంక్షేమ పథకాలు అందేల అదికారులు కృషిచేయాలి
- జిల్లా కలెక్టర్ కాట ఆమ్రపాలి

వరంగల్ రూరల్, మేజర్‌న్యూస్ : వ్యవసాయానికి నిరంతర విధ్యుత్తు అందిస్తూ ఈ నూతన సంవత్సరంలో కెసిఆర్ ప్రభుత్వం నూతన ఒరవడి చుట్టిందని నూతన ఏడాదిలో రాష్ట్రంలో నూతన వెలుగులు నిండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విధ్యాశాఖమంత్రి కడియం శ్రీహరి ఆకాక్షించారు. 2018మ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందనుం దన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తున్నదని పేర్కొన్నారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ రాష్ట్ర దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు.ప్రజలకు ప్రభుత్వ పథకాలను, సేవలను చేరువ చేసిన ఉధ్యోగులు ఈ ఏడాది రెట్టించిన ఉత్సాహం తో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన మాట తప్ప కుండా రైతాంగానికి నిరంతర ఉచిత విధ్యుత్తును నూతన సంవత్సర కానుకగా అందిస్తుందని తెలిపారు.అదే విధంగా అన్ని వర్గాల ప్రజల్లో నూతన సంవత్సర ఆనందం వెల్లివిరియాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు రాష్ట్ర ప్రజలకు తెలిపారు.




ప్రజలకు సంక్షేమ పథకాలు అందేల అదికారులు కృషి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అంది ంచేందుకు ఉద్యోగులు, అధికారులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కాట ఆమ్రపాలి అన్నారు. సమిష్టి కృషితో జిల్లాను రాష్ట్రంలోనే అగ్ర గామిగా నిలుపుదామని ప్రజలకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు.అలాగే ప్రజ లకు, అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ



సూర్యాపేట, మేజర్‌న్యూస్ : నూతనంగా ఏర్పడిన సూర్యాపేట జిల్లా ప్రజలకు, అధికారులకు జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్, సూర్యాపేట జిల్లా ఎస్పీ ప్రకాష్ జాదవ్ లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గడిచిన 3సంవత్సరాలల్లో ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టడం జరిగిందని వాటిని పేద, బడుగు బలహీన వర్గాలకు అందేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా ప్రజలు జరుపుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించకుండ ప్రజలకు సహకారించాలన్నారు.

2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2018 సంవత్సరానికి స్వాగతిస్తూ సూర్యాపేట జిల్లా ప్రజలకు, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజవర్గాల ప్రజలకు, నాయకులకు, ఉద్యమకారులకు, వివిధ హోదాలల్లో ఉండబడిన ప్రజాప్రతినిధులకు అన్ని శాఖల ఉద్యోగులకు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు, మహిళ సోదరిమణులకు, ప్రజాసంఘ నాయకులకు, రైతులకు, వ్యాపారస్తులకు, కార్మిక సంఘ నాయకులకు, విద్యార్థిసంఘ నాయకులకు, విద్యార్థిని, విద్యార్థులకు, అన్ని వర్గాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గిద్దంగుల సంస్థల చైర్మన్ మందుల సామేల్ తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నూతన సంవత్సరం పురస్కరించుకొని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర టిడిపి కార్యనిర్వహాణ కార్యదర్శి, కనకదుర్గ ఆలయ సభ్యులు పెద్దిరెడ్డి రాజా, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా క న్వీనర్ లింగిడి వెంకటేశ్వర్లు లు కేక్ కట్ చేసి నూతన వేడుకలను ఘనంగా నిర్వహించి జిల్లా, నియోజకవర్గ



ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు, రైతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సర వేళ సుఖసంతోషాలతో ఉండాలని హుజూర్‌నగర్‌శాసన సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2017 వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరంలో రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని భగవంతున్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

బి.సి. ఉద్యోగులకు రిజర్వేషన్లు కల్పించాలి

- క్రీమీలేయర్ ఎత్తివేయాలి
- 8న విజయవాడలో విద్యుత్ ఉద్యోగుల భారీ సభ



విజయవాడ, సూర్య బ్యూరో : బి.సి.ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ ఎత్తివేయాలని ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని జనవరి 8 న విజయవాడలో 10 వేల మందితో భారీ ఎత్తున బి.సి విద్యుత్ ఉద్యోగుల మహాసభ జరుపాలని ఆంధ్ర ప్రదేశ్ బి.సి విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. ఈ రోజు బి.సి.భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిదిగా ఆర్.కష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బి.సి. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అవరోదాలు, అడ్డంకులు ఏమి లేవు. గతం లో పాలించిన కేంద్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం, బి.సి వ్యతిరేక వైఖరి అవలంభించడం మూలంగానే పెట్టలేదు. రాజ్యాంగబద్ధమైన మండల కమిషన్ బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరి కమిటి చైర్మన్ నాచియప్పన్ కమిటి బి.సి ఉద్యో గులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందరంగా జనాభా ప్రకారం ఉద్యో గుల సంఖ్య లేకపోతే ఎస్టీ, ఎస్సీ, బి.సి.లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్నివైపుల నుంచి బి.సి. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులు, తీర్పులు ఉంటే కూడా ప్రభుత్వం పెట్టకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. బి.సి.లకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో సమన్యాయం జరిగే వరకు, ప్రజాస్వామ్య వాటా రాజ్యాంగబద్ధంగా ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో కొన్ని తీర్మాణాలు ఆమోదించింది. ఈ సమావేశంలో పాత కమిటిని రద్దు చేసి, కొత్త రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నారాయణ రావు, శ్రీనివాసులు, శ్రీహరి, రామకష్ణ, జి.రాంబాబు, చలపతి, శ్రీధర్,మురళి, ప్రసాద్ యాదవ్, శ్రీను, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

S & D

ప్రభుత్వంపై ఆరోపణలు తగదు : మంత్రి దేవినేని

విజయవాడ, సూర్య బ్యూరో : ప్రజల తరవున ప్రశ్నించే అధికారం ప్రజలు ఇస్తే, రాజ్యాంగంపై గౌరవం లేకుండా శాసనసభకు హాజరు కాకుండా, ఉత్తరకుమారుని ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రతిపక్ష నేత వై.యస్ జగన్‌మోహన్‌రెడ్డిని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు.

ఆదివారం మంత్రి క్యాంవు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2009 సెప్టెంబర్ 2న పోలవరం స్పిల్‌వే, ఎర్త్‌డ్యామ్ పనుల కోసం, పవర్ ప్రాజెక్టు కొట్టేయ్యడానికి చేసిన కుతంత్రాలు గురించి అడుగుతున్నానని, వాటికి జవాబులు చెప్పాలన్నారు. 16 నెలలు జైలులో ఉన్న వ్యక్తి దొంగేదొంగ అని అరుస్తున్నారన్నారు.

తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై పెద్ద ఎత్తున నిరాధార ఆరోపణలు చేయడం బదులు, తనపై ప్రత్యక్షంగా ఆరోపణలు చేయకుండా చిట్‌చాట్‌గా మాట్లాడటం అతని వ్యక్తిత్వాన్ని తెలుపుతోందన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యూనల్ ద్వారా పోలవరం పనులు ఆపడానికి నిరంతరం కుట్రలు పన్నుతున్నారని అన్నారు. 1991 లోనే పోలవరం నిర్మాణం కోసం కలలు కన్నదని, ఇప్పటికి పోలవరానికి ఒక రూపం తేగలిగామన్నారు. 2018,2019 సంవత్సరాలను లక్ష్యంగా నిర్దేశించుకుని వెళ్లుతుంటే కాంగ్రెస్ పార్టీ ముంవు 7 మండలాలలో ఇపడు పాద యాత్ర చేస్తోందని మంత్రి దేవి నేని ఎద్దేవా చేశారు.



'పశ్చిమ'లో కోడి పందాల జోరు మొదలైంది

- కోడి పందాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- జనవరిలో కోడి పుంజులకు మంచి గిరాకీ
- మూడు రకాలుగా పదాలు

చింతలవూడి, మేజర్ న్యూస్ : పశ్చిమ గోదావరి జిల్లాలో కోడిపందాలు జోరు మొదలైంది. సంక్రాంతి సీజన్ రావడంతో ఎక్కడికక్కడ స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వారి కనుసన్నల్లోనే కోడి పందాలు నడువుటకు ఏర్పాట్లు పూతైనాయి. కోడిపందాలు సంక్రాంతి పండుగ సంప్రదాయమని ప్రజా ప్రతినిధులు మొదటి నుండి బాహటంగా అంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి నెల (పండుగ) వచ్చిందంటే చాలు పందెం రాయుళ్లు రెచ్చిపోతారు. ఇది ఒక సాంప్రదాయంగా భావిస్తూ పెద్ద ఎత్తున కోడిపందాలు నిర్వహిస్తూంటారు. ఈ పందాలకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచే కాకుండా



తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుండి పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు అయిన ఖమ్మంజిల్లా నుంచి, హైదరాబాదు నుంచి పందాలకు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలలో అధిక సంఖ్యలో పందెం రాయుళ్లు వస్తుంటారు. సంక్రాంతి పండుగకు నెల ముందు నుండే వీరి హడావుడి మొదలైంది. కోట్లాది రూపాయలు ఈ పందాల్లో చేతులు మారుతుంటాయి. డిసెంబర్, జనవరి నెలలో ఇదే అదునుగా కోడి వుంజులకు మంచి గిరాకీ ఉంటుంది. పందెం కోళ్లల్లో ప్రధానంగా జాతి రత్నాలు, పచ్చకాకి, డేగ, మైల, రసంగి, పర్లా, నెమలి, పంగళాయి. కాకి డేగ పర్ల, సీతవాయి, తీరువా రకాల కోళ్లకు గిరాకీ చాలా ఎక్కువ. పందెలరాయుళ్లు ఒక్కో వుంజును రూ.2 వేల నుంచి 50 వేల వరకు కొనుగోలు చేస్తుంటారు. ఏడాది వయస్సు నిండకుండా పందాలకు కోళ్లను దించరు. వీటిని పందాలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక ఆహారం పెడతారు. వీటి ఆహారం కూడా చాలా ఖరీదే. కోడి వుంజులకు జీడిపవ్పు, బాదంపప, పిస్తా, కోడిగుడ్డు (పసువు సొన తీసింది) ఉడకబెట్టి పెడతారు సజ్జలు,వడ్లు,రాగులు, గంట్లు సోళ్ళు, గరెటలు నానబెట్టి వాటిని దంచి పెడతారు. పందెం కోళ్లకు రోజు చన్నీళ్ల సాన్నం చేయిస్తారు. శరీరం బాగా గట్టిపడి, దెబ్బలకు తట్టుకుంటుంది. పందాలు మూడు రకాలు జరుగుతాయి. ప్రధానంగా చూవుడు పందెం, జోడిలు, ముసుగు పందాలు. ఇక పందాల స్థావరాలను ఆయా గ్రామాల పెద్దల నిర్ణయం ప్రకారం ఏ ప్రాంతంలో వేయాలో చర్చించి మరి ప్రాంగాణాలను ఎంపిక చేస్తారు. అంతేకాక వేలం పాటలు కూడా నిర్వహిస్తారని స్థానికులు చెవ్తున్నారు. పోలీసులు కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే ఉంటారు. కోడి పందాలను అడ్డుకోనేందుకు పోలీసులు అప్రమత్తమైనా ఒక్కొక్కసారి ఫలితం ఉండదని తెలుస్తుంది. ఏదిఏమైనప్పటికి పందెంరాయుళ్లు పందాల విషయంలో తమతమ పనుల్లో నిమగ్నమైయ్యారు. ఇప్పటికే కొన్ని గ్రామల్లో కోడిపందాలు అక్కడక్కడ భారీ ఎత్తున జరుగుతూనే ఉన్నాయి. అంతేకాకుండా పశ్చిమగోదావరి జిల్లాలో సంక్రాంతి మూడు రోజులో భారీగా పందాలు నిర్వహించబోతున్నట్లు సమా



చారం. కోట్లాది రూపాయలు చేతులు మారే అవకాశం ఉండడంతో అందరు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు అనుమతుల కోసం పందెం రాయుళ్లు తొక్కని అడ్డదారులు ఉండవని తెలుస్తుంది. గత ఏడాదిలో పలు చోట్ల స్థావరాలు ఏర్పాటు చేసి కోడిపందెలు నిర్వహించారు. కోడిపందాల నిర్వహకులు కోట్లాది రూపాయాలు ప్రజల నుంచి కొల్లగొట్టారు. పందెం గెలిచిన వ్యక్తి నుంచి పదిశాతం సొమ్మును నిర్వాహకులు తీసుకుంటారు. కోడిపందాలు జరిగే ప్రదేశంలో మద్యం ఏరులై పారుతుంది. మాంసం,బిర్యానీ, గుట్కాలులకు కొదవ ఉండదు.

కోడిపందాలతోపాటు పేకాట, చిరుగుండ్లు, ఇతర ఆటలు, కోడి పందాల స్థావరాల వద్ద నిర్వహించడం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. పోలీసులు స్పందిస్తూ కోడిపందాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తోటివారికి తోడ్పాటునందించాలి



విజయవాడ, సూర్య బ్యూరో : ప్రతి ఒక్కరూ ఎంతో కొంత తోటివారికి తోడ్పా టును అందిస్తేనే జీవితానికి సార్ధకత చేకూరు తుందని, 2018వ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ దీనిని ఆచరించాలని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్య నాయుడు తెలిపారు. ఆదివారం విజయవాడ రూరల్ ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సమాజానికి తమ వంతు సేవగా స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో ఉన్న పేదవారికి సేవచేయడం కన్నా సంతోషకరమైన రోజు ఇంకోటి ఉండదన్నారు. తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో శిక్షణ తీసుకున్న వారు ఆనందంగా ఉండటం సంతోషదా యకమన్నారు. జన్మతహా వినికిడి, మూగ లక్షణాలు గల పిల్లలకు నూతన సాంకేతిక విధానంలో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. అలాంటి పిల్లలకు 3 సంవత్సరాలలోవు వారికి వైద్య విధానం అందిస్తే వారికి వినికిడి మాటలు చాలా త్వరగా వస్తాయన్నారు. అలాంటి వారు 7 మందికి సంబంధిత వైద్య పరికరాలు అందించడం ఆనందదాయకమన్నారు. ఇలాంటి వారు ఎవరైనా ఉంటే స్వర్ణభారత్ట్రస్టు దృష్టికి తీసుకువస్తే వైద్యం అందిస్తామన్నారు. అదే విధంగా గ్రహణం మొర్రితో బాధపడేవారికిట్రస్టు తరవున వైద్యం అందిస్తారన్నారు. గ్రహణం మొర్రితో బాధపడేవారికి ఇప్పటికి 64 మందికిట్రస్టు వైద్యం చేయించిందన్నారు. ప్రజోపయోగకర పనులు చేయడం ద్వారా సమాజానికి సేవను అందించినవారమౌతామన్నారు. పత్రికలు కూడా తమ సామాజిక బాధ్యతగా ఇలాంటి విషయాలపై చైతన్యం తీసుకురావాలన్నారు. ఆధ్యాత్మికతే లౌకికవాదం అని, భారతదేశంలో అన్ని మతాలను గౌరవించే సాంప్రదాయం ఉందన్నారు. 2017 జనవరిలో స్వర్ణభారతి ట్రస్టును విజయవాడలో ప్రారంభించామని, ఈ సంవత్సర కాలంలో ఈట్రస్టు దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్లుతుందన్నారు. ఇప్పటికి 2,300 మందికి వివిధ విభాగాలలో విజయవాడ స్వర్ణభారత్ట్రస్ట్‌లో శిక్షణ ఇచ్చి తమ జీవితాలలో స్థిరపడే విధంగా తోడ్పాటును అందించిందన్నారు. స్వర్ణభారత్ట్రస్టు ద్వారా 16 సంవత్సరాలుగా ఎంతో మందికి ఎన్నో విధాలుగా సమాజ సేవ చేస్తూ ముందుకు వెళ్లుతుందన్నారు. ఎలీప్ సంస్థకు చెందిన బ్రోచర్ ను గౌరవ భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. స్వర్ణభారత్ట్రస్టులో బ్యాంకు ఉద్యోగాలకు సిద్ధమయ్యే వారికి, ఎలక్ట్రికల్ పనులకు, టూవీలర్‌లో, ఎయిర్‌కండీషనింగ్‌లో,డ్రైవాష్‌లో, డ్రస్ డిజైన్లలో, ఐ.టి బేసిక్స్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రధానంతో పాటు, ఉద్యోగాలు పొందినవారికి నియామక పత్రాలు అందజేశారు. ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ కొనకళ్ల నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, స్వర్ణభారతి ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు.

నవక్రాంతి 'జన్మభూమి-మా ఊరు'

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : సంక్రాంతి కంటే ముందే వస్తున్న నవక్రాంతి 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమం అని, పదకొండు రోజులు కొనసాగే పెద్ద పండుగ అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారందరికీ ఆయన 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ మూడు రోజుల సంబరమైతే ఇది 11 రోజుల పండుగ అని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రపంచంలో ఎక్కడున్నా స్వగ్రామాలకు తరలివచ్చి రెండో తేదీ నుంచి ఆరంభం కానున్న 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో పాల్గొనాలని చంద్రబాబు పిలువునిచ్చారు. నూతన సంవత్సరానికి నూతన సంకల్పం తీసుకోవాలని కోరారు. వుట్టిన నేల రుణం తీర్చుకోవాలని, పల్లెల్లో నవక్రాంతులు నింపాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

పదహారు వేల కోట్ల ద్రవ్య లోటుతో నవ్యాంధ్ర ప్రయాణం నలభై రెండు నెలల క్రితం ప్రారంభమైందని, దశాబ్దాలుగా నినాదంగా మోగిన నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా నిజం చేశామని చంద్రబాబు చెప్పారు. కృష్ణా నది ఎగువ ప్రాజెక్టుల నుంచి చుక్కనీరు రాని తరుణంలో పట్టిసీమ ద్వారా గోదావరి నదీ జలాలను ప్రకాశం బ్యారేజీకి తీసుకొచ్చామన్నారు. మూడేళ్లుగా కష్ణాడెల్టాలో పట్టిసీమ గోదావరి జలాలతో 18 వేల కోట్ల విలువైన పంట రైతుల ఇంటికి చేరిందని, గోదావరి సారవంత మైన ఎర్రని నీటితో కృష్ణా డెల్టా రైతులు




అధిక దిగుబడులు సాధించారని అన్నారు.

నదుల అనుసంధానం చేసి రైతాంగం కళ్లల్లో ఆనందం చూసి, ఇటీవల ప్రకాశం బ్యారేజీ 60 ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొన్నందుకు తానెంతో గర్వించానని చెప్పారు. విభజన నాడు 22.5 మి.యూ విద్యుత్తు లోటుఉందని, నిరంతర విద్యుత్తు పథకంతో 3 నెలల్లోనే సాధారణ పరిస్థితికి తెచ్చామని, ఏడాదికే

సీఎం చంద్రబాబు నూతన సంవత్సర శుభాకాంక్షలు

మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదని చంద్రబాబు నాయుడు తెలిపారు. సమన్యాయం లేకుండా, అశాస్త్రీయంగా జరిగిన విభజనతో ఆరు దశాబ్దాల కష్టం వృధా అయ్యిందని, అయినా కోలుకొని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న విష యాన్ని చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. ఏడాదిన్నర లోగానే వెలగవూడి లో సచివాలయం నిర్మించి, ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకొచ్చి సొంతగడ్డ నుంచి పాలన ప్రారంభించామని గుర్తు చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 33 వేల ఎకరాలను భూసమీకరణ చేశామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబర్‌వన్ ర్యాంక్ సాధించిందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించామని చంద్రబాబు చెప్పారు. ఆర్థికంగా ఒడిదుడుకుల్లో ఉన్నా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణ ఉపశమనం అమలు చేశామని, 45 లక్షల సామాజిక పింఛన్లు అంద జేస్తున్నామని శరవేగంగా పారిశ్రామికాభివృద్ధికి కషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతర శ్రమతో, పటిష్ట వ్యూహంతో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

కోడి పందాలు సంప్రదాయంగానే చూడండి



(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : కోడి పందాల జోలికి వెళ్లవద్దని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించారు. ఆయన అన్ని జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వారికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభా కాంక్షలు తెలిపారు. 'కోడి పందాలను సంప్రదాయంగానే చూడండి. దాని పేరుతో బెట్టింగులు, జూదంను ప్రోత్సహించవద్దు. దానివల్ల పెద్ద సంఖ్యలో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటాయి. ఇది సమాజానికి మంచిది కాదు. గోదావరి జిల్లాల వారికి మరీ ప్రత్యేకంగా చెబుతున్నా. మీరు మరీ ఎక్కువ వూసుకోవద్దు. ఆడుకునే వాళ్లు ఆడుకొంటారు. మీరు వాటికి దూరంగా ఉండండి. వాళ్ల కోసం నాపై ఒత్తిడి తేవద్దు. ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారు ఆదర్శంగా ఉండాలి. సమాజానికి నష్టం చేసే వాటికి మీరు ఆదర్శం కావద్దు' అని హెచ్చరించారు. బీజేపీ ఎంపీ గోకరాజు ఒక రికార్డింగ్ డ్యాన్స్ కార్యక్రమానికి హాజరు కావడం వివాదాస్పదమవడాన్ని ఒక నాయకుడు ప్రస్తావించగా, 'అందుకే జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నా...' అని చంద్రబాబు అన్నారు.

స్వర్ణభారతి ట్రస్ట్‌లో జర్నలిస్ట్‌లతో చిట్‌చాట్



విజయవాడ, సూర్య బ్యూరో : దేశం శక్తివంతంగా తయారుకావాలంటే ఎవరి కర్తవ్యం వారు నెరవేర్చడంతో పాటు, ప్రతిఒక్కరూ పాజిటివ్ దృక్పదాన్ని అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్య నాయుడు తెలిపారు. ఆదివారం విజయవాడ రూరల్ ఆత్కూర్‌లో గల స్వర్ణభారతి ట్రస్ట్‌లో ప్రముఖ జర్నలిస్ట్‌లతో భారత ఉపరాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్యనాయుడు ఉదయం అల్పాహారంతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి ముప్పవరవు వెంకయ్యనాయుడు మాట్లా డుతూ 1972వ సంవత్సరం నుండి ప్రజా ఉద్యమాలలో ఉంటూ పత్రికలతో సాంగత్యం చేస్తున్నానని, వారితో నాకు అవినాభావ సంబంధం ఉండటం వల్ల సంవత్సరం చివర్లో జర్నలిస్ట్‌లతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఒకపడు పత్రికలకు, సాహిత్యానికి, కళలకు, సినిమాలకు విజయవాడ నగరం ప్రముఖంగా ఉండేదని, తరువాత హైదరాబాదు రాజధాని కావడంతో అక్కడకు మారిందన్నారు. అలాంటి విజయవాడ నగరంలో నిర్వహించే వుస్తక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వవు రోజులను గుర్తుకు తెస్తుందన్నారు. 2017వ సంవత్సరం పూర్తి అయ్యి 2018వ సంవత్సరం వచ్చిన సందర్భంలో జర్నలిస్ట్‌లతో భేటీ కావడం ఆనందంగా ఉందన్నారు. అల్‌ఇండియా రేడియోతో నాకు బాగా సాంగత్యం ఉండేదని అప్పట్లో అల్‌ఇండియా రేడియో సమీక్ష కార్యక్రమం ఉండేదని, అందులో పాల్గొన్నానన్నారు. అనేక సంవత్సరాలుగా ప్రజాజీవితంలో ఉన్నానని, తరువాత రాజకీయాలలో వివిధ స్థాయిల్లో ఎదిగి ఒక స్థాయికి చేరుకున్నానన్నారు. వాస్తవానికి 2019 ఎన్నికల వరకు రాజకీయాలలో ఉండి 2020 జనవరి 12 న రాజకీయాల నుంచి విరమించి సమాజ సేవ చేయాలనుకున్నానని, అది ఒక ఉద్యమంగా చేయాలనుకున్నానని, అలా చేయాలనుకోవటానికి స్పూర్తి జనసంఘ్ నాయకులు దేశ్‌ముఖ్ అన్నారు. పార్టీ నియమాల ప్రకారం ప్రధానమంత్రి నరేంద్రమోడి చెప్పిన మాట ప్రకారం ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టడానికి ఒపకున్నానన్నారు. మానవీయ కోణంలో సంస్కరణలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

దేశంలో సంస్కరణలు వేగవంతంగా జరగాలని జనం కోరుకుంటున్నారన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో మౌళిక రంగాలు అభివృద్ధి చెందాలని జనం ఎక్కువగా కోరుకుంటున్నారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు మెరుగుపడాలని, పెద్ద ఎత్తున రిఫ్రిజిరేటర్స్ వాహనాలు రావాలని, రైలు, రోడ్డు రవాణా సౌకర్యాల అభివృద్ధి జరగాలని జనం కోరుకుంటున్నా రన్నారు. రాజ్యసభలో కూడా వ్యవసాయ అనుసంధ రంగాలపై ఎక్కువగా చర్చించేలాగా దృష్టి పెడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరిలో సానుకూల దృక్పదం అలవాటు చేసుకోవడంతో పాటు దేశం, రాష్ట్రం, జిల్లా నాది అనే భావం రావాలన్నారు. మన దేశం సమాజం పట్ల, భాష పట్ల గౌరవం పెంచుకోవాలని, ఇతర భాషలు నేర్చుకోవచ్చుని కాని అమ్మభాషను మర్చిపోవద్దని తెలిపారు.

సీఎం సంకల్పంతో ముందుకు వెళుతున్నాం

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ, సూర్య బ్యూరో : 2017వ సంవత్సరంలో జలవనరులశాఖ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, అధికారులు సహాయ సహకారాలకు ప్రత్యేకంగా అభినందనలు తెలువుతున్నామని, 2018లో ఇంతకు మించి ఫలితాలు సాధించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మరింతగా పనిచేయాల్సినే సంకల్పంతో ముందుకు వెళ్లుతామన్న ఆశాభావాన్ని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం జలవనరుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల రైతాంగం వూర్తిస్థాయిలో సంతృప్తి చెందుతున్నారన్నారు. ఇప్పటికే గోదావరికృష్ణనదుల అనుసంధానం ద్వారా 160 టి.ఎం.సీల నీటిని పట్టిసీమ ద్వారా ఒడిసిపట్టుకున్నామని, రాబోయే రోజులలో ఇంతకు రెట్టింవు జలాలు అందుబాటులోకి తీసుకురాగలగుతామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాతీయ స్థాయి కమిటీ చైర్మన్ పాండే ఆధ్వర్యంలో సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించి చేసిన సూచనకు అనుగుణంగా పనులను వూర్తిచేస్తామన్నారు. ప్రధానమంత్రి మోది, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు వూర్తిచేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. 2018లో మరింతగా జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టి గోదావరిపెన్నా నదుల అనుసంధానం వూర్తిచేస్తామన్నారు.

11 వరకు జన్మభూమి మాఊరు


జాతీయ హైడ్రో కార్పోరేషన్ నివేదిక ఆధారంగా "ఎగువ కాపర్ డ్యామ్" పనులు చేస్తామన్నారు. వుల్‌వే, స్పిల్‌ఛానల్ పనులు సాంకేతిక కమిటీ సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో సహకారంతో వూర్తిచేస్తూ ముందుకు వెళ్లుతున్నామన్నారు. జనవరి 2 నుంచి 11 వరకు జన్మభూమిమాఊరు కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలో జరువుకుంటున్నామన్నారు. ఇందులో ప్రతి గ్రామంలో 100కు పైగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్వీయ పర్యవేక్షణలో చేపడుతున్నామన్నారు.

జనవరి 2న సంక్షేమం సంతృప్తి, 3వ ఆరోగ్యం, ఆనందం, 4న స్వచ్ఛాంధ్ర ఓడిఎఫ్ విలువలు, 5న విద్య వికాసం, 6వ మౌళిక సదుపాయాలు, 7న సహజవనరులుఅభివృద్ధి, 8న వ్యవసాయంఅనుబంధ రంగాలలో అభివృద్ధి, 9న సుపరిపాలనసాంకేతిక వినియోగం, జనవరి 10న విజ్ఞాన స్వర్ణాంధ్రప్రదేశ పేదరికంపై గెలువు, ఆనందలహరి వంటి 10 కార్యక్రమాలతో ముందుకు వెళ్లుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు జన్మభూమి స్ఫూర్తితో భాగస్వామ్యం అయి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యం కావాలన్నారు.

సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

- సుందరంగా రూపుదిద్దుకుంటున్న సభా ప్రాంగణం
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి శిద్ధా, కలెక్టర్ వినయ్‌చంద్, ఎస్పీ

ఒంగోలు, సూర్యప్రతినిధి : ఈనెల 2న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, అధికార యంత్రాంగం శ్రమిస్తున్నారు. నూతన సంవత్సరంలో తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంగోలు రానున్నడంతో జిల్లా పార్టీ నేతలు పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రత్యేక కృషి కనబరుస్తున్నారు. ఆదివారం దర్శిలోని పర్యాటన ప్రాంతాన్ని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు, కలెక్టర్ వి వినయ్ చంద్, జేసీ నాగలక్ష్మీ, ఎస్పీ బి సత్య ఏసు బాబు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. సీఎం పర్యటించు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ, అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకోని పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సభా ఏర్పాట్లు చివరి దశకు వచ్చాయి. హ్యాలిక్యాప్టర్ ద్వారా దర్శి పట్టణంలోకి 12.40కి చేరుకుంటారు. రోడ్డుమార్గన 12.50కి జేబిఎంవీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 12.50 నుంచి 1.00 వరకు రంగోలి



విలేజ్ పోటీలను తిలకిస్తారు. 1.10 గంటలకు రోడ్డు మార్గాన పట్టణంలోని మోడల్ స్కూల్ మైదానంకి చేరుకుంటారు. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని ప్రజలను కార్యక్రమం, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమం అనంతరం రోడ్డు మార్గాన 4.50కి హెలిప్యాడ్ వద్దకు చేరుకోని వెళ్లిపోతారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, అధికార యంత్రాంగం సన్నిద్ధం అయ్యారు.

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామ కృష్ణ 2018 నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఈ మేరకు రామకృష్ణ నేడొక ప్రకటన చేశారు. 2017లో ఆశించిన మేరకు రాష్ట్ర అభివృద్ధిగానీ, ప్రజలకు మేలుగానీ జరగలే దన్నారు. కేంద్రం ఎపీకి ప్రకటించిన ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీల అమలు చేయకుండా మోసం చేసింద న్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. 2018వ సంవత్స రం లోనైనా రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలనీ, రాష్ట్రం అన్నిరంగాలలో వురోభివృద్ధిలో పయనించాలని సిపిఐ ఆకాంక్షిస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఉద్యమిద్దాం



విజయవాడ, సూర్యబ్యూరో: నగరంలోని పశ్చిమ నియోజకవర్గంకు చెందిన మహిళలు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యకర్త పోతిన వెంకటమహేష్‌ను కలిసి ఇళ్ళపట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని అనేక సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇళ్ళపట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్నారు గానీ ఇంతవరకు ఏ ఒక్క ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ళపట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్ళాలని, ఇళ్ళ మంజూరు చేస్తామని స్లిప్‌లు ఇస్తున్నారు. వీరి సమస్యలు విని పోతిన మహేష్ మాట్లాడుతూ ఇప్పటికీ అనేకమార్లు ఇళ్ళపట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఉద్యమించామని నూతన సంవత్సరంలో ఇళ్ళపట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఉద్యమ రూపంలో ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సానుకూల నిర్ణయం సాధిద్దామని, అట్లాగే జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ దృష్టికి ఈ సమస్య తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చి, నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు.




అభిమానులే అండగా అరంగేట్రం

తమిళనాడు రాజకీయాల్లో సినీ నటులు కీలకపాత్ర పోషించారు. ఎంజిఆర్, జయలలిత తమిళనాడు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. విజయకాంత్, శరత్ కుమార్ లాంటి హీరోలు ఏర్పాటు చేసిన పార్టీ తమిళనాడు రాష్ట్రంలో ఒకానొక దశలో ప్రత్యామ్నాయశక్తిగా కనిపించింది. మరోవైపు రజనీ సన్నిహితు నటుడు కమల్ హాసన్ పార్టీని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్ కూడ రాజకీయాల్లోకి వస్తారన్న వాదనలు వినిపించినా, గత నాలుగేళ్లుగా చర్చోప చర్చలు జరుగుతునే ఉన్నాయి. అనేక ఊగిసలాటలు, వేదాంత ధోరణులతో పరిస్థితులెన్ని సాగినా చివరికి రజనీ కాంత్ తను రాజకీయాలలోకి రావటం ఖాయమని స్పష్టం చేస్తూ, ఆదివారం చేసిన ప్రకటన ఆయన అభిమానులలో పండగ వాతావరణాన్ని నింపేసింది. తమిళనాడంతా రజనీ అభిమానుల ఇళ్లలో కోలాహలంగా మారింది. రోడ్లన్ని రంగులతో నిండిపోయాయి.







ఏళ్లుగా తమిళ రాజకీయాలను ఊరిస్తూ వస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎట్టకేలకు మౌనం వీడాడు. తన రాజకీయ ప్రవేశంపై క్లారిటీ ఇచ్చాడు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. మకిలీ పట్టిన రాజకీయాలను కడిగేయడానికి వస్తున్నట్లు తలైవా చెప్పారు. ఈ ప్రక టనతో తమిళనాడులో ఉత్సాహ వాతావరణం ఏర్పడింది. తమిళ రాజకీయాల్లో కొత్త పరిణామం చోటుచేసుకోబోతోంది. ఇప్పటివరకు ఉన్న రాజకీ య పార్టీల్లో గుబులు పుట్టింది. ఇటీవల అభిమానులతో వరుస భేటీలు నిర్వహిస్తూ తన రాజకీయ ప్రవేశానికి ఆయన బాట వేసుకుంటునే ఉన్నారు. గత ఐదు రోజులుగా అభిమానలతో ఎడతె రిపి లేకుండా సమా వేశమైన రజనీ డిసెంబర్ 31వ తేదీన తను రాజకీయాలలోనికి వస్తున్నానని, త్వరలో పార్టీని పెట్టి రాష్ట్రంలోని అన్ని శాసనసభ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు ప్రకటించాడు.

ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఛిన్నా భిన్నంగా ఉన్నాయి. జయ మరణానంతరం అవి మరీ దిగజారి పోయాయి. దీని కి తోడు శశికళ వ్యవహారం, పార్టీల నేతలపై అవినీతి ఆరోపణలు, అక్రమా స్తులపై ఇడి దాడులు వెరసి రాజకీయాలను బాగా భ్రష్టు పట్టించాయని అంతా భావిస్తున్న తరుణంలో కొత్త పార్టీ కోసం తమిళ ప్రజలు ఎదురు చూస్తున్నా రు. అయితే తాజా పరిస్థితులు రజనీకాంత్ అనుకూలిస్తాయా లేదా అనేది ఆచరణలో తేలనుంది. అయితే రజనీ పార్టీ అనుసరించే విధానాలు, ఆ ప్రక టించే పథకాలు కూడ ఈ విషయై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మరణించిన తర్వాత అన్నా డిఎంకెలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకొన్నాయి. అన్నాడిఎంకె నుండి శశికళను దినకరన్ను బయటకు పంపారు. ఆర్ కె నగర్ ఉప ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్నాడిఎంకెలో పరిస్థితులు మారేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత కొనసాగుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ తరుణంలో తమిళ సూపర్ స్టార్ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే రజనీకాంత్ రాజకీయ పార్టీ ఏర్పాటుపై చాలా కాలంగా కొనసాగుతున్న ఊహ గానాలకు ఆదివారం నాడు తెరదించారు

నేను రాజకీయాల్లోకి రావడం ఖాయం, తమిళనాడులో 234 స్థానాల్లో పోటీ చేస్తా... తాను యుద్ధం చేస్తానని ఓటమి, గెలువు దేవుడి దయ.. గెలిస్తే విజ యం లేదంటే శాశ్వత విరమణ ఇదీ తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తన రాజకీయ రంగ ప్రవేశంపై చేసిన ప్రకటన. రాజకీయాల్లోకి తాను డబ్బ కోస మో, పేరు కోసమో రావడం లేదని, అవన్నీ నాకు ఇప్పటికే ఉన్నాయని, తన రాజకీయ రాకను కాలమే నిర్ణయించిందని రజనీకాంత్ చెప్పారు. మరోవైవు మీడియాతో జాగ్రత్తగా ఉండా లని అభిమానులను హెచ్చరించారు కూడా. కొన్ని జరుగుతున్న రాజకీయ పరిణామాలతో తమిళ నాడు ప్రజలు తీవ్ర మనస్తాపంతో ఉన్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లోను నేను రాజకీయాల్లోకి రాకపోవడం సబబు కాదన్నారు. అన్ని రాష్ట్రాలు తమిళ రాజకీయాలు చూసి నవ్వుతున్నాయని, ఇలాంటప్పుడు తాను రావాల్సిందే అన్నారు.

ఎన్టీఆర్‌లా రజనీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్టీ రామారావు ప్రభంజనం సృాఎష్టించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి దేశ రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న కాంగ్రెసు పార్టీని చావు దెబ్బ తీశారు. సినిమాల ద్వారా ఎన్టీ రామారావు మాస్ అపీల్ సంపాదించుకున్నారు. దానికితోడు ఆయనను తెలుగు ప్రజలు దైవంగా కొలిచారు. ఆయన పోషించిన కృష్ణుడు, రాముడు వంటి పాత్రలు ఆయనను మాస్ మాత్రమే కాకుండా క్లాస్ కూడా అభిమానిస్తూ వచ్చారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలలోనే పార్టీని అధికారంలోకి తీసుకు రావ టంలో ఎన్టీఆర్ అభిమానులదే కీలక పాత్ర. అభిమానులలోంచి అనేక మంది నాయకులు వుట్టుకొచ్చారు. అలాగే డిఎంకె చీఫ్ కరుణానిధి, సినీ నటుడు మాజీ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజిఆర్ ఒకప్పుడు మంచి స్నేహితులు. అయితే కరుణానిధితో విభేదించి ఎంజిఆర్ 1972 అక్టోబర్ 17న, అన్నా డిఎంకెను ఏర్పాటు చేశారు. అయితే ఆ సమయంలో పార్టీని బలోపేతం చేసేందుకు ఎంజిఆర్ తనను అభిమానులనే పార్టీ కార్యకర్తలుగా మలిచారు. పార్టీ ఏర్పాటు చేసిన రెండు మాసాలకే దిండిగల్ లోక్‌సభ స్థానం నుండి ఎంజిఆర్ ఎంపిగా విజయం సాధించారు. ఆ తర్వాత ఏడాదికి జరిగిన అసెం బ్లీ ఎన్నికల్లో కోయంబత్తూరు అసెంబ్లీ సీటు నుండి ఎంజిఆర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే ఈ విజయాల వెనుక అభిమానులు కీలకంగా పనిచేశారు. అంతేకాదు ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీతో అన్నాడిఎంకె సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. డిఎంకెకు వ్యతిరేకంగా అన్నాడిఎంకె అనతి కాలంలోనే రాష్ట్రంలో విస్తరించింది. దీని వెనుక ఎంజిఆర్ అభిమానులు కీలక పాత్ర పోషించారు.

ఇప్పుడు తమిళనాడు పార్టీ ఏర్పాటులో అభిమానులే కీలక పాత్ర పోషించ ను న్నారు. ఇప్పటికే ఆయన తన అభిమానులతో పలు పర్యాయాలు సమావేశమై తన రాజకీయ ప్రస్థానంపై చర్చించారు. నిర్ణయం వాయిదాలు పడుతున్నా, తనపై ఎన్ని వ్యంగ్య వ్యాఖ్యలు వస్తున్నా తలొంచకుండా ముందుకు సాగిన ఆయన తాజాగా రాజకీయాలలోకి వస్తున్నట్లు చేసిన ప్రకటనలో వ్యవస్థను మార్చే సమయం వచ్చిందని పేర్కొంటూ తనకు కార్యకర్తలు వద్దని, రక్షకులు కావాలన్నారు. ప్రభుత్వం తప్పులు చేసినా నిలదీసే రక్షకులు కావాలనటం వెనుక అంతరార్ధం ఇదే. ఇక ఎన్టీఆర్ తరహాలో రజనీ పౌరానిక పాత్ర పోష ణ లేకున్నా జనం నుంచి వుట్టిన పాత్రలకే ప్రాధాన్యత ఇస్తూ ఒదిగి పోయా రు. ఈ క్రమంలో ఆయన లక్షలాది మంది అభిమానులను సంపాదించు కున్నారు. వీరంతా రజనీకాంత్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించే అవకా శాలు లేకపోలేదు. నాడు ఎంజిఆర్ కూడ అభిమానులే అన్నాడిఎంకె పార్టీ బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఈనాడు రజనీకాంత్ అభిమానులు కూడ అదే పాత్రను పోషించే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

రాజకీయ శూన్యత

ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉంది. కాంగ్రెసుపై ప్రజలు విసిగిపోయి ఉన్నా రు. కాంగ్రెసుకు ధీటుగా మరో పార్టీ లేదు. కమ్యూనిస్టు పార్టీలు పూర్తిగా బలహీనపడ్డాయి. కాంగ్రెసు నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వచ్చారు. అధికారం కోసం తాపత్రయపడడం తప్ప వారికి ప్రజలు కనిపించడం లేదనే అభిప్రాయం బలంగా ఉంది. ప్రస్తుతం రాజకీయ శూన్యత తమిళనాడులో ఉన్నట్లే కనిపిస్తోంది.

ప్రజల ఆకాంక్షల మేరకు ఈపిఎస్ – ఓపిఎస్‌ల నేతృ త్వంలోని అన్నాడిఎంకె ప్రభుత్వం పనిచేస్తోందన్న నమ్మకం కలిగించలేక పోతున్నారనేందుకు జయ సొంత నియోజకవర్గమైన ఆర్కేనగర్ ఉప ఎన్నికల లో కారణాలెన్ని ఉన్నా, ఓటమి పాలు కావాల్సి వచ్చిందన్నది నిజం. ఇక డిఎం కె నేత స్టాలిన్ సైతం ప్రజలకు అండగా ఉంటామన్న నమ్మకాన్ని కలిగించలేక పోతున్నారు. మరోవైపు శశికళ వర్గం జనం కోసం కాకుడా అధికారం కోసం ఏమైనా చేస్తుందనే అభిప్రాయం ఉంది. ఈక్రమంలో కమల్ హాసన్ పార్టీ ప్రకటించినా, జనం వైపు తొంగి చూడని స్థితిలో ప్రజలకు సరైన నాయకుడు కనిపించడ లేదు. ఆ సంక్షోభ సమయంలో రజనీకాంత్ రాజకీయాల్లోకి అడుగు పెడుతున్నారు. దీంతో శూన్యతనెంత వరకు పూడుస్తారో చూడాలి.

ఆత్మగౌరవ నినాదం కలిసి వచ్చేనా...

తెలుగునాట తరుచుగా ముఖ్యమంత్రులను మార్చడం ద్వారా తెలుగు ప్రజ ల ఆత్మగౌరవాన్ని కాంగ్రెసు దెబ్బ తీస్తోందనే నినాదంతో రాజకీయాలలోకి వచ్చిన ఎన్టీఆర్ ఆత్మగౌరవం ప్రధాన నినాదంగా మార్చుకున్నారు. అది ఓ భావో ద్వేగ అంశంగా మారి ప్రజలను పెద్ద యెత్తున కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కదిలించింది. అలాంటి ఆత్మగౌరవ నినాదాన్ని రజనీకాంత్ అందుకునే అవకాశం ఉన్నట్టే కనిపిస్తోంది. ప్రస్తుతం ఓపిఎస్–ఈపిఎస్ లు కేంద్రంలోని బిజెపి సర్కారు చెప్పినట్టు చేస్తున్నారని, ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు మోడీ కాళ్ల ముందు మోకరల్లుతున్నారనే అభిప్రాయం ఉంది. దీంతో. బిజెపి ని ధీటుగా ఎదుర్కోవాలని రజనీ భావిస్తే... ఆత్మగౌరవ నినాదాన్ని ఎత్తుకునే అవకాశాలున్నాయి.

కలిసి వచ్చే చరిష్మా.

వెండితెర ఇలవేల్పుగా వెలుగుతున్న దశలోనే రాజకీయాలలోకి వచ్చిన ఎన్టీఆర్‌కు సినీగ్లామర్, చరిష్మా బాగా కలిసి వచ్చింది. చివరి రోజుల్లో ఆయన చేసిన పాత్రలు కూడా జనం మదిలో హత్తుకు పోయాయి. ప్రజలకు అత్యం త అభిమానమైన నటుడిగా, ఆదర్శవాదిగా కనిపించారు. ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రభంజనం సృష్టించిన మూడు దశాబ్దాల తర్వాత తమిళనాడులో అటువంటి ప్రభంజనమే సృష్టించడానికి రజనీకాంత్ ముందుకు వచ్చారు. ఎన్టీఆర్ స్థాయిలో చరిష్మా రజనీకాంత్‌కూ ఉంది రాజకీయాల్లోకి రావాలని ఆయన అభిమానులు చాలా కాలంగా కోరుకుంటు న్నారు. కూడా అయితే ఈ కాలంలో రాజకీయాలు చాలా మారిపోయాయి. డబ్బులు, తెర వెనక మేనేజ్‌మెంట్ వంటి అనేక వ్యూహాలు ముందకు వచ్చాయి. సభలకు ప్రజలు ప్రభంజనంలా వచ్చినంత మాత్రాన విజయం సాధిస్తా రనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఇటువంటి స్థితిలో రజనీకాంత్ ఎలా నెట్టుకొస్తారనేది ప్రశ్నార్థకమే.

ప్లాన్ ఎలా

ఎన్టీ రామారావు తన చరిష్మాను ముందు పెట్టి తెలుగుదేశం పార్టీ స్థాపనకు, దాన్ని ముందుకు నడిపించడానికి పక్కా పథక రచన చేసి అమలు చేశారు. నాదెండ్ల భాస్కరరావు వంటి రాజకీయ నేతలు, ఈనాడు దినపత్రిక అధినేత ఎన్టీ రామారావును ముందు పెట్టి కథ నడిపించారు. ఈనాడు ఎన్టీ రామారావుకు ప్రచారం కల్పించిన తీరు ఓ పోరాటాన్ని తలపిస్తుంది. అటువంటి మీడియా మద్దతు, రాజకీయ నిపుణుల ప్లానింగ్ రజనీకాంత్కు అందుతుందా అనేది ముందు ముందు తెలుస్తుంది. తమిళనాడు రాష్ట్రంలో రెండు ద్రవిడ పార్టీల మధ్య అధికార మార్పిడి చాలా కాలంగా కొనసాగుతోంది. అయితే తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. అయితే అదే సమయంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వాతావరణం రజనీకాంత్‌కు కొంత సానుకూలంగా ఉండే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే రజనీకాంత్ ప్రకటించే విధి విధానాలు కూడ ఆ పార్టీ భవితవ్యంపై ఆధారపడి ఉంటాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రెండు సార్లు తమిళనాడు ముఖ్యమంత్రి అయిన ఎంజీ రామచంద్రన్, సినీరంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన శివాజీ గణేశన్ లోని గుణగణాలే తమిళ ప్రజల హృదయాల్లో శాస్వతంగా నిలిచిపోవడానికి కారణమని సినీరంగంలో ఉంటూనే ఎంజీఆర్, శివాజీ గణేశన్ తమిళనాడులో ప్రజాసేవ చేశారని ఇదే సందర్భంలో రజనీకాంత్ చెప్పారు. అయితే తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత పేరును ఎక్కడా ప్రస్తావించకుండా రజనీకాంత్ జాగ్రత పడటం కనిపించింది. 'గతంలో వలస పాలకులు మన దేశాన్ని కొల్లగొట్టారు. కానీ ఇప్పుడు మన పాలకులే ప్రజాస్వామ్యం పేరుతో మనల్ని కొల్లగొడుతున్నారు' అని రజనీ మండిపడ్డారు. రానున్న శాసనసభ ఎన్నికల్లోపే కొత్త పార్టీ స్థాపించనున్నట్లు తెలిపారు. 234 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తోందని ప్రకటించారు. తాజాగా రాజకీయాలలోకివస్తున్న తనకు తమిళనాడు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తునే. రాజకీయాలు అంటే అంత సులువు కాదని ,అధికారం అంటే సముద్రంలో మునిగి ముత్యాలు ఎత్తినంత కష్టమని రజనీ చెప్పిన మాటలేఇక్కడ ప్రస్తావనర్హం. ఎందుకంటే తమిళనాడు ఎన్నికలంటే కోట్లుతో కూడిన వ్యవహారంలా మారిపోయింది. ఆర్కేనగర్ ఉప ఎన్నికలను చూస్తేనే తాజాగా ప్రస్తుత పరిణామాలు అభిమానం కన్నాకానుకలకే ప్రధమ ప్రాధాన్యతగా కనిపిస్తోంది. మరి ఈ బాలారిష్టాలు అధిగమించి, రజనీ ఏమేరకు నిలదొక్కుకుంటాడో చూడాలి.










పద్మావతి పరిణయం!?

తదుపరి పెళ్లి పదుకొణె-రణవీర్‌లదే?

విరుష్క వివాహ సందడి ముగిసింది. ఇప్పుడు దీపిక పెళ్లి బాలీవుడ్ లో సందడి చేస్తోంది. రణబీర్ కపూర్ తో బ్రేక్ అప్ అయినప్పటినుంచి రణవీర్ తో సహజీవనం చేస్తున్న దీపిక త్వరలోనే అతడ్ని పెళ్లి చేసుకోనున్నదని తెలుస్తోంది. 'గోలియోంకి రాసలీల రామ్ లీలా' చిత్రంలో తొలిసారి కలిసి నటించిన ఈ జంట.. ఆ తర్వాత 'బాజీరావు మస్తానీ'లో జత కట్టింది. ఇప్పుడు వీరిద్దరూ నటించగా అత్యంత వివాదాస్పదంగా మారిన 'పద్మావతి' ఎట్టకేలకు సెన్సార్ సంకెళ్లు తెంచుకొని త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం విడుదల కాగానే రణవీర్ తో దీపికా పెళ్లి జరగడం ఖాయమని బాలీవుడ్ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి మరింత ఆజ్యం పోస్తూ కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు ఈ జంట విదేశాలకు చెక్కేసింది. కొన్ని నెలల క్రితం రాహుల్ ద్రావిడ్ బెంగుళూర్ లో ప్రారంభించిన 'స్పోర్ట్ సెంటర్' ఇనాగురేషన్ కు జంటగా హాజరైన రణవీర్-దీపిక.. ఆ తర్వాత పబ్లిక్ గా కనిపించలేదు. మరి 'పద్మావతి' చిత్రం ప్రచారం కోసం ఆ చిత్ర దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ వీరిద్దరికీ ఉత్తిత్తి పెళ్లి జరిపిస్తున్నాడా.. లేక నిజంగానే నిజంగా వీరిద్దరి పెళ్లి ఇరు వైపుల పెద్దలు నిజంగా జరిపిస్తారు అన్నది వేచి చూడాలి!



కాలాంతకుడు 2.0

'కాలా' రజనీ చివరి చిత్రం కానున్నదా?

గత ఇరవై ఏళ్లుగా ఊరిస్తున్న రజనీ ఎట్టకేలకు రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించేశారు. అంతేకాదు, సొంతంగా తమిళనాడులో అన్ని స్థానాలకు పోటీ చేస్తామని సైతం స్పష్టం చేశారు. పనిలోపనిగా శంకర్ దర్శకత్వంలో తను నటిస్తున్న '2.0' ఏప్రిల్ 14 న విడుదల కానున్నదని కూడా చెప్పేశారు. దాంతో '2.0'తో పాటు రజనీ నటిస్తున్న 'కాలా' చిత్రాలపై ఇప్పుడు అందరూ మరింత ఫోకస్ పెడుతున్నారు. ఈ రెండు చిత్రాలు చాలా బాగా వచ్చి ఉంటాయని, అందుకే రజనీ తన రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రకటించి ఉంటారనే అంచనాలు వెలువడుతున్నాయి. 'కాలా' సినిమాకు "కబాలి దర్శకుడు పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కబాలి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా రంజిత్ అవకాశం ఇచ్చినప్పుడే.. ఈ కథ రజినీకి విపరీతంగా నచ్చి ఉంటుందని అందరూ అనుకున్నారు. పైగా ఈ చిత్రాన్ని రజనీ అల్లుడు ధనుష్ నిర్మిస్తున్నారు. నిర్మాత ధనుష్ కి మంచి సక్సెస్ రేట్ ఉంది. ఇక శంకర్ గురించి చెప్పాల్సిన పని లేదు. తెలుగులో 'మనోహరుడు' పేరుతొ వచ్చిన సినిమా తప్ప శంకర్ కి ఇప్పటివరకు ఫ్లాప్స్ లేవు. కాబట్టి '2.0, కాలా' చిత్రాలు అద్భుతంగా వచ్చి ఉంటాయని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. అంతే కాదు.. ఈ రెండు చిత్రాల తర్వాత సినిమాల నుంచి రజనీ రిటైర్ అవుతారనే ఊహాగానాలు అప్పుడే మొదలైపోయాయి కూడా!



చెంగుచెంగున చెలరేగిపోతున్నారు

కోటి ఆశలతో.. కొత్త ఏడాదిలోకి!


అనుష్క


నయనతార


తమన్నా


శ్రీయ శరణ్


సమంత అక్కినేని


కాజల్


రాశీ ఖన్నా


రెజీనా కసాండ్రా

తెలుగులో రూపొందే ప్రతి సినిమాలో ఇద్దరు లేదా ముగ్గురు హీరోయిన్స్ ఉండడం ఇటీవలకాలంలో ఆనవాయితీగా మారిపోయింది. పైగా కుర్ర హీరోలు సంవత్సరానికి కనీసం రెండు సినిమాలు చేస్తుండడం, తెలుగు, తమిళ భాషల మధ్య సినిమాలపరంగా సరిహద్దు గీత చెరిగిపోవడంతో మన హీరోయిన్స్ చెలరేగిపోతున్నారు. 2018లో ఏ హీరోయిన్స్ ప్రస్తుతానికి సినిమాలు కమిటయ్యారో చూద్దాం!

అనుష్క: 'బాహుబలి - ది బిగినింగ్, ది కంక్లూజన్' చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించుకున్న అనుష్క నటించిన 'భాగమతి' జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత అనుష్క నటించే సినిమా ఏమిటనే దానిపై క్లారిటీ లేదు.

నయనతార: ఈ మలయాళ ముద్దుగుమ్మ నటించిన 'జై సింహా' సంక్రాంతికి సందడి చేయనుంది. తమిళంలో నాలుగయిదు సినిమాలు చేస్తున్న నయనతార తెలుగులో చేస్తున్న చిత్రం 'సైరా... నరసింహారెడ్డి' ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటోంది.

శ్రీయ: 'గౌతమీపుత్ర శాతకర్ణి, పైసా వసూల్' చిత్రాలతో గతేడాది సందడి చేసిన శ్రీయ తమిళంలో ఒకటి, హిందీలో ఒక సినిమా చేస్తోంది. తెలుగులో ఈ సొగసరి నటిస్తున్న 'గాయత్రి, వీరభోగ వసంతరాయలు' విడుదలకు సిద్ధమవుతున్నాయి.

తమన్నా: మిల్క్ వైట్ బ్యూటీ తమన్నా ఈ ఏడాది 'స్కెచ్, క్వీన్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించనుంది. హిందీలో 'తడ్కా' అనే హిందీ చిత్రంలో నటిస్తోంది.

కాజల్: 'ఖైదీ నంబర్ 150, నేనే రాజు నేనే మంత్రి' చిత్రాలతో 2017లో తెలుగులో మంచి విజయాలు అందుకున్న కాజల్ తమిళంలోనూ మంచి మార్కులు స్కోర్ చేసింది. కాజల్ తెలుగులో నటిస్తున్న 'ఎం.ఎల్.ఏ', తమిళంలో నటిస్తున్న 'పారిస్.. పారిస్' చిత్రాల షూటింగ్ దాదావు పూర్తి కావచ్చింది.

సమంత: అక్కినేని సమంతగా మారిన సమంతా రూత్ ప్రభు తెలుగులో 'రంగస్థలం, మహానటి' చిత్రాల్లో నటిస్తోంది. తమిళంలో శ్రీమతి సమంత నటిస్తున్న సినిమాలు అయిదారు ఉండడం గమనార్హం.

రకుల్ ప్రీత్ సింగ్: హిందీలో నీరజ్ పాండే దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న రకుల్ తెలుగులో కొత్తగా ఏ సినిమాలకు కమిటవ్వలేదు. ప్రస్తుతానికి పలు చిత్రాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయి.

కీర్తి సురేష్: 'అజ్ఞాతవాసి'తో 2018కి స్వాగతం పలకనున్న కీర్తి.. 'మహానటి'గానూ మెప్పించనుంది. తమిళంలో కీర్తి నటిస్తున్న రెండు మూడు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

అను ఇమ్మాన్యుయేల్: 'అజ్ఞాతవాసి'లో నటించిన అను ఇమ్మాన్యుయేల్ 'నా పేరు సూర్య'లో కూడా నటిస్తోంది. ఎన్టీఆర్, నాగ చైతన్యలతో అను చేయనున్న సినిమాలు ప్రి ప్రొడక్షన్‌లో ఉన్నాయి.

రాశిఖన్నా: ఈ అందాల రాశి తెలుగులో నటించిన 'టచ్ చేసి చూడు, తొలిప్రేమ' షూటింగ్ పూర్తయ్యాయి. ఈ భామ ఈ ఏడాది తెలుగులో మరో రెండుమూడు సినిమాలు చేయనున్నది.

రెజీనా కాసాండ్రా: సరైన సక్సెస్ కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్న రెజీనా తమిళంలో అయిదారు సినిమాలు చేస్తోంది. తెలుగులో మిస్టర్ చంద్రమౌళి, నాని నిర్మిస్తున్న 'అ' అనే సినిమాలు చేస్తోంది.

అంజలి: అచ్చ తెలుగు తారామణి అంజలి నేరుగా తెలుగులో ఏ సినిమాలు చేయడం లేదు. అయితే.. 'తారామణి, బెలూన్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఈ బుల్లి పలకరించనుంది. తమిళంలో అంజలి నటిస్తున్న పలు చిత్రాలు వివిధ దశల్లో ఉన్నాయి.

పూజ హెగ్డే: 'దువ్వాడ జగన్నాథం' చిత్రంతో దుమ్ము దులిపిన పూజ.. తెలుగులో 'సాక్ష్యం', హిందీలో 'రేస్-3' సినిమాలు చేస్తోంది. 'రంగస్థలం'లో ఈ చిన్నది చేస్తున్న ఐటెం సాంగ్ ఇప్పటికే హాట్ టాపిక్ అయిపోయింది.

లావణ్య త్రిపాఠి: తమిళంలో ఒక సినిమా చేస్తున్న లావణ్య తెలుగులో ప్రస్తుతానికి ఏ సినిమాకీ కమిట్ కాలేదు.

అనుపమ పరమేశ్వరన్: నానితో 'కృష్ణార్జున యుద్ధం'లో నటిస్తున్న అనుపమ.. సాయి ధరమ్ తేజ్‌తో కరుణాకరన్ దర్శకత్వంలో ఇంకా పేరు పెట్టని చిత్రంలో నటిస్తోంది.

సాయి పల్లవి: మొదటి సినిమాతోనే అందర్నీ 'ఫిదా' చేసేసి.. ఏవరేజ్ టాక్ తెచ్చుకున్న 'ఎం.సి.ఏ' చిత్రాన్ని ఒంటిచేత్తో విజయ తీరం చేర్చిన సాయి పల్లవి.. శర్వానంద్‌తో హను రాఘవపూడి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తోంది.


అంజలి


పూజా హెగ్డే


సాయి పల్లవి


కీర్తి సురేష్


అను ఇమ్మాన్యుయేల్


అనుపమా పరమేశ్వరన్





హఫీజ్ సయీద్‌కు హద్దులా? : పాకిస్తాన్

ఇస్లామాబాద్ : భారతదేశం కంటిలో ముల్లు గుచ్చేవారంటే పాకిస్థాన్‌కు చాలా ఇష్టం. అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ సయీద్, పాలస్తీనా రాయబారి వలీద్ అబు అలీలను పాకిస్థాన్ సమర్థించింది. పాలస్తీనాకు మద్దతుగా రావల్పిండిలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో హఫీజ్, వలీద్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

వలీద్ ఈ సభలో హఫీజ్‌తో కలిసి పాల్గొనడంపై భారతదేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పాలస్తీనా స్పందించి, ఆయనను పాకిస్థాన్ నుంచి వెనుకకు పిలిపించింది. పాకిస్థాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో సృష్టిస్తున్న అభి ప్రాయానికి విరుద్ధంగా, ఐక్యరాజ్య సమితి ప్రకటన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై ఎటువంటి పరిమితులను విధించబోదని తెలిపింది.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలస్తీనా రాయబారి చురుగ్గా పాల్గొనడాన్ని పాకిస్థానీలు, పాకిస్థాన్ ప్రభుత్వం గౌరవిస్తాయని పేర్కొంది. వలీద్ పాకిస్థాన్‌లో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపింది.

వివాదానికి కారణమైన బహిరంగ సభ పాలస్తీనియన్ల లక్ష్యానికి మద్దతుగా పాకిస్థానీల బలమైన మనోభావాలను మరోసారి ప్రదర్శించడమేనని తెలిపింది. ఈ సభలో అన్ని రంగాలకు చెందిన వేలాది మంది పాల్గొన్నారని, 50 మందికిపైగా ప్రసంగించారని వివరించింది. ప్రసంగించినవారిలో లష్కరే తొయిబా వ్యవస్థాపక అధినేత హఫీజ్ సయీద్ కూడా ఉన్నారని పేర్కొంది.







పుల్వామాలో ఉగ్రదాడి: నలుగురు జవాన్లు మృతి

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ శిక్షణా కేంద్రంపై ఉగ్రవాదులు దాడికి దిగారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే-ఈ-మహ్మద్‌కు చెందిన ఉగ్రవాదులు భద్రతా బలగాలపై గ్రనేడ్లతో దాడి చేసి విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. వారి దాడిని సీఆర్‌పీఎఫ్ బలగాలు ధీటుగా ఎదుర్కొన్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు జవాన్లు అమరులయ్యారు. మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి.

గాయపడిన జవాన్లను చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శిక్షణా శిబిరం నుంచి మరో ఆరుగురు జవాన్లు సురక్షితంగా బయట పడ్డారు. మృతుల్లో కానిస్టేబుల్ సైపుద్దీన్ సాజ్ ఉన్నట్లు సీఆర్‌పీఎఫ్ వెల్లడిం చింది. అవంతి పోరా ప్రాంతంలోని లెత్‌పోరాకు సమీపంలోని 185వ బెటా లియన్ సీఆర్‌పీఎఫ్ కేంద్రంపై ఆదివారం తెల్లవారుజామున 2.10 నిమిషాల ప్రాంతంలో మిలిటెంట్లు దాడికి దిగారు. దాదాపు పదకొండు గంటల పాటు ఇ రువైపుల భీకరంగా ఎదురు కాల్పులు జరిగాయి.

ఈ ఏడాది ఆగస్టులో పుల్వా మాలో ఇలాంటి దాడే చోటుచేసుకుంది. ఉగ్రవాదులు జిల్లా పోలీస్ కాంప్లెక్స్‌ను లక్ష్యంగా చేసుకొని దాడికి దిగారు. ఈ దాడిలో ఎనిమిది మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

షా చొరవతో చల్లబడిన పటేల్



గాంధీనగర్: శాఖల కేటాయింపు విషయంలో రుసరుసలాడుతున్న గుజరాత్ ఉపముఖ్యమంత్రి నితిన్ పటేల్ ఎట్టకేలకు చల్లబడ్డారు. తనకు కేటాయించిన పదవీ బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. గుజరాత్‌లో అసమ్మతి రాగం మొదలైనట్లు వార్తలు రావడంతో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా జోక్యం చేసుకున్నారు. శాఖల కేటాయింపు విషయంలో అసం తృప్తి వ్యక్తం చేసిన పటేల్‌తో అమిత్‌షా ఫోన్‌లో మాట్లాడి విషయం సద్దుమణిగేలా చేశారు. తన హోదాకు తగినట్టు శాఖలను కేటాయించడం జరుగుతుందని షా హామీ ఇచ్చినట్లు నితిన్ తెలిపారు. అనంతరం ఆయన వెంటనే సెక్రటేరియట్‌కు వెళ్లి ప్రభుత్వం తనకు కేటాయించిన పదవులను స్వీకరించారు. ఆయనకు కేటాయించిన శాఖలను కాకుండా అదనపు బాధ్యతలను కూడా అప్పగించే ఆలోచనలో గుజరాత్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మునుపటి ప్రభుత్వంలో ఆర్థిక, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల్ని నిర్వహించిన ఆయనకు ఈసారి రహదారులు-భవనాలు, ఆరోగ్యం, వైద్య విద్య వంటి శాఖల్ని కేటాయించారు. దీనిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఆయన తనకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించలేదు. దీంతో సీఎం విజయ్ రూపానీ, నితిన్ పటేల్ మధ్య విబేధాలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. నితిన్‌కు పాటీదార్ ఉద్యమనేతలు హార్దిక్ పటేల్, లాల్జీ పటేల్ మద్దతు తెలిపారు. నితిన్‌ను ఉపముఖ్యమంత్రిని చేయాలనే డిమాండుతో జనవరి ఒకటో తేదీన మెహసానాలో బంద్ పాటిస్తామని తెలిపారు. అయితే.. జనవరి 1న మెహసానాలో పటీదార్ వర్గీయులు నిర్వహించే బంద్‌కు తమ మద్దతుదారులు వెళ్లొద్దని నితిన్ పిలుపునిచ్చారు. వాటన్నింటికీ దూరంగా ఉండాలని అన్నారు.

చైనా యువతకు కొత్త సవాల్

బీజింగ్: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కల్గిన చైనాకు కొత్త సవాల్ ఎదురువుతోంది. ఆ దేశంలోని యువతకు పెళ్లిళ్లు కావడంలేదన్న దిగులు అక్కడి తల్లిదండ్రుల్ని పట్టుకుంది. దీంతో 85 శాతం యువతకు పెళ్లిళ్లు చేసుకోవాలనే ఒత్తిడి వారి తల్లిదండ్రుల నుంచి ఎదురవుతోందని చెనా యూత్ డెలీ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దీని ప్రభావం వల్ల 69శాతానికి పైగా యు వత తీవ్ర మాన్సిక ఒత్తిడితో బాధపడుతున్నారని సర్వే తెలిపింది. ఇటీవల్ చెనాలోని ఫ్ల ప్రాంతాల్కు చెందిన సుమారు 1984 మంది యువతను వేర్వేరుగా వివాహంపై వారి అభిప్రాయాలు అడగ్గా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. ఈ సర్వేలో పాల్గొన్న సగం మందికి పైగా యువతకు తమ తల్లిదండ్రులు పదేపదే పెళ్లి చేసుకోవాల్ని ఒత్తిడి తెస్తుండటంతో వారితో మాట్లాడేందుకే నిరాసక్తత ప్రదర్శిస్తున్నార్ట్. అంతేకాదు 32 శాతం మంది యువతకు తమ ఇంటికి వెళ్లాలన్న ఆశ సన్నగిల్లింది. మరో 26శాతం మందికి వారిలో వారికే అనేక సందేహాలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై హౌ వీయివీ (25) అనే యువతి మాట్లాడుతూ.. నా వయసు 30 ఏళ్లు మించకముందే పెళ్లి చేసుకో వాలని నిశ్చయించుకున్నా. కానీ మా తల్లిదండ్రులు మాత్రం తొందరగా తగిన అబ్బాయిని చూసుకోమని పదేపదే చెబుతుండటంతో నాలో ఆత్రుత ఎక్కువ వుతోంది అని చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలో వివాహానికి సంబంధించి చై నాలోని తల్లిదండ్రుల్కు అవసరమైన చెతన్యం పెంచాల్సిన అవసరం ఉందని ఝుజియాంగ్ అనే మానసిక ఆరోగ్య సంస్థకు చెందిన ప్రతినిధి లింగ్ జీ అభిప్రా యపడ్డారు. వయోభారం కారణంగా వారి తల్లిదండ్రుల్ నుంచి ఒత్తిడి వచ్చేలోపే యువత తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకొని పెళ్లిచేసుకోవడం మంచిదని సూచించారు.

జనవరి 1: అందరికీ ఒకసారి.. వారికి 16 సార్లు



వాషింగ్టన్ : నూతన సంవత్సర వేడుకలకు యావత్ ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. 31వ తేదీన మన గడియారంలో అర్ధరాత్రి 12 గంటలు మోగగానే సంబరాలు మొదలవుతాయి. ఇలా వేడుకలు జరుపుకొనే అవకాశం మనందరికీ ఒకసారి మాత్రమే లభిస్తుంది. అయితే ఈ ప్రపంచంలో ఉన్నవారందరికీ భిన్నంగా వారు మాత్రం ఈ వేడుకలను 16 సార్లు నిర్వహించుకుంటారు. వినడానికి వింతగా అనిపిస్తున్నా ఇది నిజం. అది ఎక్కడ? వారు ఎవరో? తెలుసుకుందాం. మన భూమి చుట్టూ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) ఒకటి తిరుగుతుందన్న విషయం మనందరికీ తెలిసిందే. అందులో ఉన్న వ్యోమగాములు ఈ కొత్త సంవత్సరం వేడుకలను ఒకే రోజు 16 సార్లు జరుపుకొనే వీలుంది. అది ఎలా అంటే.. ఐఎస్ఎస్ మన భూమిని చుట్టిరావడానికి పట్టే సమయం కేవలం 90 నిమిషాలు మాత్రమే.

ఇందులో ఉన్నవారు ఒక రోజులో 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలను వీక్షిస్తారు. ఆ విధంగా చూస్తే వారు ఈ నూతన సంవత్సర వేడుకలను 16సార్లు జరుపుకొనే వీలుందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది.

ఐఎస్ఎస్‌లో ఆరుగురు వ్యోమగాములు ఉన్నారు. ఇందులో ముగ్గురు అమెరికాకు చెందిన వారు కాగా.. ఇద్దరు రష్యా, ఒకరు జపాన్‌కు చెందినవారు. కొత్త సంవత్సరానికి ముందు వీరంతా లైఫ్ సైన్స్ స్టడీస్‌పై పరిశోధనల్లో మునిగిపోయారు. అంతరిక్షంలో ఉన్నప్పుడు ఆరోగ్యంగా, దృఢంగా ఉండేందుకు ఇది దోహదపడనుందని నాసా తెలిపింది.

రంజుగా తమిళ రాజకీయం

చెన్నై : అన్నాడీఎంకే తిరుగుబాటు నేత, ఆర్కే నగర్ ఎమ్మెల్యే దినకరన్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి పళనిస్వామి తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. మూడు నెలల్లో పళని ప్రభుత్వం కూలిపోతుందంటూ ఫలితాల రోజున దినకరన్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం పళని, శనివారం ఊటీలో నిర్వహించిన ఎంజీఆర్ జయంతి ఉత్సవాల్లో స్పందించారు. 1974లో నేను అన్నాడీఎంకేలో చేరా. కార్యకర్త స్థాయి నుంచి పని చేసి ఆ స్థాయికి ఎదిగా. నాతోపాటు చాలా మంది అన్నాడీఎంకే కోసం అహర్నిశలు కృాఎషి చేశాం. కానీ, దినకరన్ మాత్రం దొడ్డి దారిలో పార్టీలోకి ప్రవేశించారు అని అన్నారు. ఆర్కే నగర్ లో దినకరన్ విజయం సాధించడానికి కారణం హవాలా ఫార్ములానే అని పళని ఉద్ఘాటించారు. ఇదే సమయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న దినకరన్ ఎక్కడకు వెళ్లాలో అక్కడికే వెళతారంటూ వ్యాఖ్యలు చేశారు. తాము ప్రజల కోసం పాటు పడుతుంటే... దినకరన్ సొంత కుటుంబం కోసం పాకులాడుతున్నారని పళని విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన దినకరన్ ఆ పదవిని కొంత కాలం మాత్రమే అనుభవించగలరని.. భవిష్యత్తులో అతనికి గుణపాఠం చెప్పి తీరతామని పళని పేర్కొన్నారు. ఇక రజనీకాంత్ పొలిటికల్ ఎంట్రీ అంశంపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. మరోవైపు డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం కూడా దినకరన్ పై మండిపడ్డారు. అన్నాడీఎంకేలో తాను సీనియర్ నని, దినకరన్ ఓ బచ్చా.. ఎల్‌కేజీ స్టూడెంట్ అని ఎద్దేవా చేశారు. జయలలిత చేత పార్టీ నుంచి బహిష్కరింపబడిన వారు ఇప్పుడు పార్టీపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. పార్టీని కూల్చాలని దినకరన్, డీఎంకేలు చేసే యత్నాలు ఫలించవని ఆయన చెప్పారు. రజనీకాంత్ రాజకీయ ప్రవేశ ప్రకటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన వేళ... దినకరన్ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రకటన వెలువడటానికి ముందే నిన్న ఓ జాతీయ మీడియాతో దినకరన్ మాట్లాడుతూ.. తమిళనాడుకు ఒకే ఎంజీఆర్.. ఒకే అమ్మ(జయలలిత) ఉంటారు. వారి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు అని తెలిపారు. ఏ ముఖాన్ని ఆమె అభిమానులు అంగీకరించబోరని దినకరన్ చెప్పారు.



విమానం ద్వారా అంతరిక్షాన్ని శోధించనున్న నాసా

వాషింగ్టన్: విశ్వంలో అయస్కాంత క్షేత్రాలు, తారా జనన ప్రాంతాలు, శని చందమామ టైటాన్ గురించి పరిశోధనలు సాగించడానికి అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) ప్రత్యేక విమానాన్ని సన్నద్ధం చేస్తోంది. సోఫియా అనే ఈ విమానం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి 2019 జనవరి వంకూ దఫదఫాలుగా ఆకాశయానం చేయనుంది. ఈ లోహ విహంగంతో ఏడాది మొత్తం పరిశోధనలు సాగించడం ఇది నాలుగోసారి. బోయింగ్-747ఎస్‌పీ శ్రేణికి చెందిన ఈ విమానంపై 100 అంగుళాల వ్యాసం కలిగిన టెలిస్కోపు ఉంటుంది. కొత్తగా హై రిజల్యూషన్ ఎయిర్‌బోర్న్ వైడ్ బ్యాండ్ కెమెరా ప్లస్ అనే పరికరాన్ని కూడా అమర్చారు. వీటి ద్వారా.. సుదూర గెలాక్సీల్లో శక్తిమంతమైన, క్రియాశీల కృష్ణబిలాలు పోషించే పాత్రపై మెరుగైన అవగాహన కలుగుతుంది.


దాణా కేసు కమామిషు ఇది

- మాజీ సిఎం లాలూ గడ్డి తినటం కరెక్టే
- ఇప్పటికే ఓ కేసులో లాలూకు ఐదేళ్ల జైలు
- ఆరేళ్లపాటు ప్రజా జీవితానికి దూరం చేస్తూ శిక్ష
- రెండు దశాబ్దాలుగా సంచలనం సృష్టించిన కేసు

రాంచీ : దాణా కుంభకోణం కేసులో బిహార్ బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్కు అతిపెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌ను దోషిగా తేల్చుతూ రాంచీలోని సీబీఐ స్పెషల్ కోర్టు శనివారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువడే క్రమంలో లాలూ ప్రసాద్ యాదవ్, తన కొడుకు తేజస్వి యాదవ్తో కలిసి కోర్టుకు హాజరయ్యారు. ఆర్జేడీ కార్యకర్తలు కూడా భారీ ఎత్తున్న కోర్టు వచ్చారు.

రెండు దశాబ్దాల అనంతరం ఈ కేసుపై నేడు సీబీఐ కోర్టు ఈ తీర్పు వెలువరించింది. అయితే బిహార్ మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. జగన్నాథ్ మిశ్రాతో పాటు ఏడుగురిని నిర్దోషులు ప్రకటించగా.. లాలూతో సహా 15 మందిని దోషులుగా తేల్చింది. లాలూ ప్రసాద్ యాదవ్‌ను కోర్టులోనే అరెస్ట్ చేసే అవకాశం కనిపిస్తోంది. రాంచీ జైలుకు ఆయన్ను తరలించనున్నారు. జనవరి 3న లాలూకు శిక్ష ఖరారు చేయనున్నారు. 2013లో ఓ కేసులో లాలూకు ఐదేళ్ల జైలు శిక్ష పడగా.. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత వేటు పడింది. ఇప్పటికే అనర్హత వేటు ఎదుర్కొంటున్న లాలూకు ఈ తీర్పు మరింత ప్రతికూలంగా మారింది.

1991-96 కాలంలో దియోగఢ్(ప్రస్తుతం జార్ఖండ్‌లో ఉంది) ట్రెజరీ నుంచి దాణా కోసం రూ.84.5 లక్షలకుపైగా అక్రమంగా డ్రాచేసినట్లు బిహార్ మాజీ సీఎంలు లాలూ, జగన్నాథ మిశ్రాలతో సహా 22 మందిపై సీబీఐ అభియోగాలు దాఖలు చేసింది. 1997, అక్టోబర్ 27న దీనిపై సీబీఐ చార్జిషీట్ దాఖలుచేసింది. ఈ కేసు విచారణ జరుగుతున్న కాలంలో 11మంది చనిపోగా, ముగ్గురు అప్రూవర్లుగా మారిపోయారు.



లాలూ ప్రసాద్ యాదవ్ దాణా స్కామ్ కథా కమామిషు

జనవరి 1996: డిప్యూటీ కిషన్ అమిత్ ఖారే పశు సంవర్ధక శాఖ కార్యాలయాలపై దాడి చేసి మనుగడలోనే లేని కంపెనీలకు దాణా సరఫరా చేసినట్లు గల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దాంతో దాణా స్కామ్ వెలుగులోకి వచ్చిది.

మార్చి 11, 1996: కుంభకోణంపై దర్యాప్తు చేయాలని పాట్నా హైకోర్టు సిబిఐని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆ ఆదేశాలను సమర్థించింది.

మార్చి 27, 1996: చాయ్బసా ట్రెజరీ కేసులో సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

జూన్ 23,1997: సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. లాలూ ప్రసాద్తో సహా 56 మందిని నిందితులుగా చేర్చింది. ఐపిసి సెక్షన్ 420 (ఫోర్జరీ), 120 (బి) (క్రిమినల్ కుట్ర, సెక్షన్ 13 (బి) అవినీతి నిరోధక చట్టం కింద 63 కేసులు నమోదు చేసింది.

జులై 30, 1997: సిబిఐ ముందు లాలూ ప్రసాద్ యాదవ్ లొంగిపోయారు. ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించారు.

ఏప్రిల్ 30, 2000: సిబిఐ కోర్టు ముందు అభియోగాలను ఉంచారు. రబ్రీదేవి పేరును సహ నిందితురాలిగా చేర్చారు. ఆమెకు బెయిల్ లభించింది. లాలూకు మాత్రం కోర్టు బెయిల్ నిరాకరించింది.

అక్టోబర్ 5, 2001: కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసులను సుప్రీంకోర్టు జార్ఖండుకు బదిలీ చేసింది.

ఫిబ్రవరి 2002: రాంచీ సిబిఐ ప్రత్యేక కోర్టులో విచారణ ప్రారంభమైంది.

డిసెంబర్ 2006: ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగాల నుంచి లాలూకు, రబ్రీ విముక్తి లభించింది.

జూన్ 2007: సిపిఐ ప్రత్యేక కోర్టు 5 మందికి జైలు శిక్ష విధించింది. వారిలో లూలు ప్రసాద్ యాదవ్ సమీప బంధువులు ఇద్దరు ఉన్నారు. చాయ్బసా ట్రెజరీ నుంచి 1990 దశకంలో అక్రమంగా రూ.48 కోట్లు తీసుకున్నారనే ఆరోపణపై వారికి రెండున్నర ఏళ్ల నుంచి ఆరేళ్ల వరకు శిక్షలు పడ్డాయ.

మార్చి 2012: లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రాలపై సిబిఐ అభియోగాలు మోపింది. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్ 1995-96లో ట్రెజరీల నుంచి రూ.47 కోట్లు అక్రమంగా తీసుకున్నారనే అబియోగం మోపారు.

ఆగస్టు 13, 2013: ట్రయల్ కోర్టు న్యాయమూర్తిని మార్చాలనే లాలూ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది.

సెప్టెంబర్ 30, 2013: తీర్పును సిబిఐ కోర్టు రిజర్వ్‌లో పెట్టింది.

సెప్టెంబర్ 30, 2013: లాలూ ప్రసాద్, మిశ్రాలతోపాటు 45 మందిని కోర్టు దోషులుగా ప్రకటించింది. ఆ తీర్పుతో లాలూ ప్రసాద్ యాదవ్ లోకసభ సభ్యత్వాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

డిసెంబర్ 23, 2017: దాణా కుంభకోణం కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌ను దోషిగా ప్రకటిస్తూ రాంచీ సిబిఐ కోర్టు తీర్పు చెప్పింది.

చైనా మనల్ని మించిపోతోంది : రాహుల్



న్యూఢిల్లీ : బీజేపీ ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బీజేపీ వైఖరి వల్లే భారత్-చైనా మధ్య పోటీలో చైనా భారతదేశాన్ని అధిగమిస్తోందని పేర్కొన్నారు. రాహుల్ ఈసారి మోదీ భక్తులను కూడా వదిలిపెట్టలేదు. ఆదివారం రాహుల్ ఇచ్చిన ట్వీట్‌లో మోదీ భక్తులూ! స్మార్ట్ సిటీల కోసం చెప్పిన రూ.9,860 కోట్లలో కేవలం 7 శాతం మాత్రమే ఉపయోగించారు. మీ మాస్టర్ ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తూ ఉంటే, చైనా మనల్ని అధిగమిస్తోంది. దయచేసి ఈ వీడియో చూసి, భారతదేశంలో ఉద్యోగాల సృష్టి ముఖ్యమైనదని, దాని మీద దృష్టి పెట్టాలని ఆయనకు చెప్పండి అని పేర్కొన్నారు. ఆయన జత చేసిన వీడియో క్లిప్‌లో చైనాలోని షెంజెన్ అనే చిన్న మత్స్యకార గ్రామం గురించి వివరించారు. ఆ గ్రామం మెగా సిటీగా అభివృద్ధి చెందిందని తెలిపారు.

వేద నిలయంలో అధికారుల తనిఖీలు



చెన్నై: దివంగత ముఖ్యమంత్రి జయలలిత నివాసమైన పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయాన్ని ఆమె స్మారక మందిరంగా మార్చేందుకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. జిల్లా కలెక్టర్ అన్బుసెల్వాన్ ఆధ్వర్యంలోని బృందం దీనికి సంబంధించి వేద నిలయాన్ని పరిశీలించింది. స్మారక మందిరంగా మార్చనున్నట్లు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనకు జయలలిత అన్న కొడుకు, కుమార్తెలు దీపక్, దీపలు వ్యతిరేకించారు. తమ వద్ద దీనికి అనుమతి తీసుకోవాలని దీపక్ ఓ లేఖను సీఎంకు పంపారు. ఈ నేపథ్యంలో మొదటి విడతగా ప్రజాపనుల శాఖ అధికారులు వేద నివాసం కొలతలు వేసే పని ప్రారంభించారు. శనివారం చెన్నై జిల్లా కలెక్టర్ అన్బుసెల్వాన్ తదితరుల బృందం వేద నిలయాన్ని పరిశీలించారు. ఈ ఇంటిని ప్రభుత్వపరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధికారులు దృష్టి సారించారు. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అన్బుసెల్వాన్ అనంతరం విలేకరుల సమావేశంలోనూ వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో భద్రత పెంచారు.

సీఎంలూ.. వేరే రాష్ట్ర పర్యటనలొద్దు



న్యూఢిల్లీ: సీఎంలు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల్లో పర్యటనకు అకస్మాత్తుగా వెళ్లి పర్యటించడం వంటివి చేయొద్దని కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు పంపించింది. సీఎం పర్యటనకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా వెళ్లడం వల్ల భద్రతా పరమైన సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని.. ఇటువంటి సమస్యను నిలువరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోంశాఖ తన నోటీసుల్లో పేర్కొంది. ఇది భద్రతా పరమైన సమస్య కాకుండా.. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి అకస్మాత్తుగా వేరే రాష్ట్రానికి వెళ్లడం వల్ల అక్కడ అధికారులు కొద్దిగా ఇబ్బందిగా భావించే అవకాశం ఉంది అని హోంశాఖ వెల్లడించింది. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జెడ్ లేదా జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉంటుంది. వేరే రాష్ట్రంలో పర్యటనకు వెళ్లినపుడు ఆతిథ్యమిచ్చే రాష్ట్రం వచ్చిన ముఖ్యమంత్రికి ఒక్కోసారి సరైన సదుపాయాలు కల్పించలేకపోవచ్చు. అదే ముందుగా సమాచారం ఇస్తే సీఎంకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు ఎటువంటి లోటు లేకుండా చేయడం జరుగుతుంది. వారికి అవసరమైన భద్రత, బసను కూడా ఆతిథ్య రాష్ట్రం ఏర్పాటు చేయగలగుతుంది అని హోంశాఖ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు పంపించిన నోటీసుల్లో పేర్కొంది.

ఎవరెస్ట్‌పైకి ఒంటరిగా వెళ్లవద్దు



కాఠ్‌మాండూ: ఇకపై ఎవరెస్ట్‌పైకి వెళ్లాలంటే ఎవరి తోడైనా ఉండాల్సిందే. ఒంటరిగా ఎక్కడం ఇక కుదరదు. ఎవరెస్ట్ సహా మంచు పర్వతాలను ఒంటరిగా అధిరోహించకుండా నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో పాటు మరిన్ని ఆంక్షలు కూడా తీసుకొచ్చింది. ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతం ఎవరెస్ట్‌ను ఏటా వందల సంఖ్యలో ఔత్సాహిక పర్వతారోహకులు అధిరోహిస్తుంటారు. వీరిలో కొందరు బృందాలుగా వెళ్లగా.. మరికొందరు ఒంటరిగానే ఈ సాహసం చేపడుతారు. అయితే పర్వతాన్ని ఎక్కడం అంటే మామూలు విషయం కాదు. ఎన్నో సవాళ్లను అధిగమించాలి. కొన్ని కొన్ని సార్లు ప్రమాదాలు కూడా జరుగుతుంటాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్విట్జర్లాండ్‌కు చెందిన యూలీ స్టీక్ అనే పర్వతారోహకుడు ఒంటరిగా వెళ్లి ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఇలా పర్వతాలపై జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు నేపాల్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఒంటరి పర్వతారోహకులపై నిషేధం విధించింది. ఈ మేరకు నేపాల్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ సాంస్కృతిక శాఖా మంత్రి మహేశ్వర్ న్యూపేన్ తెలిపారు. వీరితో పాటు రెండు కాళ్లు లేనివారు, అంధులు ఎవరెస్ట్‌ను ఎక్కకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. అయితే ఈ నిర్ణయంపై కొందరు పర్వతారోహకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ పట్ల వివక్ష చూపిస్తున్నారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. 2006లో న్యూజిలాండ్‌కు చెందిన మార్క్ ఇంగ్లిస్ రెండు కాళ్లూ లేకపోయినా ఎవరెస్ట్ అధిరోహించిన తొలి వ్యక్తిగా గుర్తింపు సాధించారు. ఇక 2001లో అమెరికాకు చెందిన అంధుడు ఎరిక్ వీహెన్‌మేయర్ ఎవరెస్ట్‌ను ఎక్కారు.

అన్యాయాన్ని సహించను: కిరణ్‌బేడీ



పుదుచ్చేరి: తన కార్యాలయంలో అవినీతి, అన్యాయం జరిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ అన్నారు. కొందరు అధికారుల అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో సీబీఐ, సీవీసీ విచారణకు ఆదేశించినట్టు చెప్పారు. కొత్త సంవత్సరం వస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది ఏయే అంశాలపై ప్రాధాన్యం కల్పించారనే అంశాలపై ఆమె వాట్సాప్ సందేశాన్ని మీడియాకు విడుదల చేశారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రవేశాల నేపథ్యంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఐఏఎస్ అధికారులతో పాటు 11 ఇతర అధికారులపై సెప్టెంబర్ 20న సీబీఐ కేసులు నమోదుచేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అలాగే రాజ్‌భవన్ 1108 కేసుల్ని పరిష్కరించినట్టు తెలిపారు.

వారికి ఉచిత ప్రయాణం

డెహ్రాడూన్ : కొత్త ఏడాది సందర్భంగా డిసెంబర్ 31, జనవరి 1న ఉత్తరాఖండ్‌లో మహిళలకు ఉచిత ప్రయాణ సేవలను ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాఖండ్‌లోని ప్రతి నాలుగురోడ్ల కూడలిలో..ఉచిత వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.మహిళలకు ఇబ్బంది కలగకుండా ఇటువంటి చర్యలు తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

సూర్య స్పోర్ట్స్

S & D

'నాకు క్రికెట్ చూడడం ఇష్టం ఉండదు'



మెల్‌బోర్న్ : తనకి ఎక్కువగా క్రికెట్ చూడటమంటే ఇష్టం లేదని తెలిపాడు ఆసీస్ క్రికెట్ జట్టు సారథి స్టీవ్ స్మిత్. ఆసీస్-ఇంగ్లాండ్ మధ్య ప్రస్తుతం యాషెస్ సిరీస్ కొనసాగుతోంది. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టు ఈ రోజు డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. ఐదు టెస్టు మ్యాచుల సిరీస్‌ను ఆసీస్ ఇప్పటికే 3-0తో గెలుచుకుంది. సిరీస్ చేజారినప్పటికీ పరువు దక్కించుకోవాలన్న కాంక్షతో ఇంగ్లాండ్ మెల్‌బోర్న్ టెస్టులో పోరాడింది. ఆ జట్టు ఆటగాడు కుక్ ద్విశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. వర్షం వల్ల మ్యాచ్‌కు అంతరాయం కలగడం, ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ శతకం సాధించడంతో ఈ టెస్టు డ్రాగా ముగిసింది. మ్యాచ్ అనంతరం స్మిత్ విలేకరులు అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నందుకు కారణం ఏమిటని అడగ్గా..దీనికి ఏమని సమాధానం చెప్పాలో నాకు తెలియదు. నాకు తెలిసిందల్లా బ్యాటింగ్ చేయడమే. ఇది నా వృాఎత్తి అంతే. నిజం చెప్పాలంటే నాకు ఎక్కువగా క్రికెట్ చూడటమంటే ఇష్టం ఉండదు. ప్రతి బంతిపై దృాఎష్టి సారించి దాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ప్రతి బంతి సవాలుతో కూడుకున్నదే అని స్మిత్ తెలిపాడు.

చిందేసిన కోహ్లీ, ధావన్

కేప్‌టౌన్‌లో న్యూ ఇయర్ వేడుకలు



కేప్‌టౌన్ : టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, ఓపెనర్ శిఖర్ ధావన్‌లు కేప్‌టౌన్ వీధుల్లో చిందేశారు. దక్షిణాఫ్రికాతో జనవరి 5 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టు నేపథ్యంలో ఈ స్టార్ క్రికెటర్ల కెప్‌టౌన్ నగరంలో ఫ్యామిలీతో చక్కర్లు కొడుతూ సరదాగా గడుపుతున్నారు. కేప్‌టౌన్ వీధుల్లో జనసమూహం మధ్యలో కొందరు డ్రమ్స్ వాయిస్తుండగా.. ఏ మాత్రం వెనకడుగు వేయకుండా కోహ్లీ, ధావన్‌లు డ్యాన్స్ చేశారు. ఈ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయగా.. నెట్టింట్లో హల్ చల్ చేస్తోంది. ఈ వీడియోలో ధావన్ కొడుకు కూడా ఉన్నాడు. తొలి టెస్టుకు చీలిమండ గాయంతో ధావన్ దూరమైన విషయం తెలిసిందే. దీంతో మురళి విజయ్ లేదా కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నారు. వర్షం అంతరాయం కలిగించడంతో ఆదివారం భారత క్రికెటర్ల ప్రాక్టీస్ సెషన్‌ను న్యూలాండ్ క్రికెట్ స్టేడియంలోని ఇండోర్ గ్రౌండ్‌కు తరలించారు.

2017 ముగింపు ర్యాంకుల్లో కోహ్లీ నెం.2

ఐసీసీ 2017 ఏడాదికి గాను చివరి సారి టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకులు జాబితా వెల్లడించింది. టీమిండియా సారథి విరాట్ కోహ్లీ 893 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వీరోచిత ఫామ్‌లో ఉన్న ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్ తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 947 రేటింగ్ పాయింట్లతో డాన్ బ్రాడ్‌మన్‌కు చేరువ అవుతున్నాడు. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో అతడు 76, 102 నాటౌట్‌తో నిలి చిన సంగతి తెలిసిందే. అదే మ్యాచ్‌లో 244 పరుగులు చేసిన ఇంగ్లాండ్ మాజీ టెస్ట్ సారథి అలిస్టర్ కుక్ తొమ్మిది స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకు న్నాడు. అతడు 2017 తొలినాళ్లలో 15వ ర్యాంకు, యాషెస్‌కు ముందు పదో ర్యాంకులో ఉన్నాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు హషీమ్ ఆమ్లా ఏడు, డేవిడ్ వార్నర్ ఆరు, జోరూట్ ఐదు, కేన్ విలియమ్సన్ నాలుగు, టీమిండియా నయావాల్ ఛెతేశ్వర్ పుజారా మూడో ర్యాంకులో ఉన్నారు. ఇక బౌలర్ల జాబితాలో ఇంగ్లాండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ 892 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఏడాది ముందు అతడు 810 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఒకానొక దశలో అగ్రస్థానం కోసం హోరాహోరీగా పోటీ పడ్డ టీమిండియా స్పిన్ ద్వయం రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో నిలిచారు. శ్రీలంక బౌలర్ రంగనా హెరాత్ ఆరో ర్యాంకు దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా పేసర్ హేజిల్‌వుడ్ ఐదో ర్యాంకుతో ఏడాదిని ఆరంభించి అదే స్థానంతో ముగించాడు. కొత్తగా దక్షిణాఫ్రికా బౌలర్ మోర్నీ మోర్కెల్ మూడు స్థానాలు ఎగబాకి 10వ ర్యాంకు దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్ జాబితాలో షకిబ్ అల్ హసన్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వరుసగా తొలి మూడు ర్యాంకుల్లో ఉన్నారు.



పోటీ... జట్ల మధ్యే : విరాట్

ఇండో-దక్షిణాఫ్రికా సిరీస్‌ను కోహ్లీ ఏబీగా ముద్రవేయొద్దని టీమిండియా సారథి విరాట్ కోహ్లీ అన్నాడు. సిరీస్ రెండు జట్ల మధ్యే కానీ తమ మధ్య పోటీ కాదని స్పష్టం చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సహచరుడు, మిస్టర్ 360 డిగ్రీ బ్యాట్స్‌మెన్ ఏబీ డివిలియర్స్‌ను విరాట్ సోదరుడిగా భావిస్తాడు. వారిద్దరూ మైదానంలోనూ, బయట ఎంతో అన్యోన్యంగా ఉంటారన్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా చేరుకున్న తర్వాత కోహ్లీ తొలిసారి విలేకరుల సమావేశంలో మాట్లాడాడు. ఈ సిరీస్‌లో ఇద్దరే ఆడటం లేదు కదా! ఏబీ నాకు అత్యంత ప్రియ మైన మిత్రుడు. అతడి ఆటతీరును నేనెంతో గౌరవిస్తా. వ్యక్తిగానూ అంతే గౌరవిస్తా. మేమిద్దరం వేర్వేరు జట్ల తరఫున ఆడుతున్నప్పుడు మాత్రం హద్దులు దాటం. డివిలియర్స్‌ను పెవిలియన్ పంపిస్తే ఆట అయిపోయినట్టు కాదు. అలాగే పుజారానో, రహానెనో, నన్నో ఔట్ చేస్తే టీమిండియా పని ముగిసినట్టు కాదు. ఆలోచనా విధానమే ఇక్కడ అత్యంత ముఖ్యం అని కోహ్లీ అన్నాడు.

ప్రతి ఆటగాడు బ్యాట్స్‌మన్‌గా నిలిచి పరుగులు చేసి జట్టును గెలిపించాలనే తపన పడతాడు. ఒక బృందంగా ఆడితే తప్ప సిరీస్ గెలిచే అవకాశాలు ఉండవు. కొందరు అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శన చేస్తారు. జట్టులో ఇద్దరు ముగ్గురు అలా ఆడితే చాలు. ప్రస్తుతం మేమంతా జట్టుగా చాలా బాగున్నాం. చక్కని ప్రదర్శనలు చేయాలని కోరుకుంటున్నాం. ప్రత్యర్థి జట్టు గురించి ఎక్కువగా చెప్పలేను. ఏబీ మాతో టెస్ట్ ఆడిన తర్వాత చాన్నాళ్లు ఈ ఫార్మాట్ ఆడనేలేదు. మళ్లీ ఇప్పుడు వస్తున్నాడు. మిగతా సంగతులన్నీ పక్కన పెడితే సుదీర్ఘంగా ఆడిన జట్టుకు విజయావకాశాలు ఎక్కువ ట విరాట్ పేర్కొన్నాడు.



పోరుకు మేం సిద్ధం : రవిశాస్త్రి

దక్షిణాఫ్రికా కఠిన సవాల్‌కు టీమిండియా సిద్ధంగా ఉన్నట్టు కోచ్ రవిశాస్త్రి తెలిపారు. గతంతో పోలిస్తే తామిప్పుడు మరింత బలంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై పరిస్థితులను ఆకళింపు చేసుకోవడమే పర్యాటక జట్టుకు అత్యంత కీలకమని అన్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత మీడియాతో మాట్లాడారు. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా జనవరి ఐదున కేప్‌టౌన్‌లో రెండు జట్ల మధ్య తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత్ సవాల్‌కు సిద్ధంగా ఉంది. నాలుగేళ్ల క్రితం మీరిది అడిగివుంటే నేను కాదని చెప్పేవాడిని. ఇప్పటి జట్టు అనుభవం సంపాదించింది. ప్రత్యర్థి ఎవరైనా వెన్ను చూపకపోవడమే ప్రస్తుత జట్టు అందం. మేం అవతలి వారిని గౌరవిస్తాం. పిచ్‌ను చూసి పరిస్థితులను అన్వయించుకుంటాం. రిజర్వు బెంచ్‌లో ఫాస్ట్ బౌలింగ్ విభాగం బలం పెరిగింది. ఇరవై వికెట్లు తీయడంలో ఇదెంతో కీలకం అని రవిశాస్త్రి అన్నారు.

టీమిండియా పేస్ విభాగం బలం పెరగడంతో క్యూరేటర్లు ఊరించే పిచ్‌ను తయారు చేస్తారా అన్న ప్రశ్నకు శాస్త్రి స్పందించారు. ప్రతి మ్యాచ్‌ను మేం స్వదేశంలో ఆడినట్టే ఆడతాం. కేప్‌టౌన్‌నూ అలాగే భావిస్తున్నాం. ముందు పిచ్‌ను పరిశీలిస్తాం. పరిస్థితులను అర్థం చేసుకుంటాం. ఎలాంటి ఫిర్యాదులు చేయం. రెండు జట్లూ అదే వికెట్‌పై ఆడతాయి కదా! ఇంగ్లాండ్‌లోనూ పేస్ పిచ్‌లే ఉంటాయి. భారత్‌లో టర్న్ అవ్వొచ్చు. ఎక్కడికెళ్లినా పరిస్థితులకు తగ్గట్టు ఆడాల్సిందే. ఇక మా కుర్రాళ్లు వృత్తిలో సంతృప్తి కోరుకుంటున్నారు. పరుగులు చేసి వికెట్లు తీసినప్పుడు అది కలుగుతుంది. అందుకే కష్టపడుతున్నారు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ ప్రతిభ ఉన్న జట్టు. కోహ్లీసేనకు ఇది మంచి అవకాశం అని శాస్త్రి చెప్పారు.



'కోహ్లీనే...వరల్డ్ బెస్ట్ బ్యాట్స్‌మన్'

ఆధునిక ప్రపంచ క్రికెట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్ ఎవరనే దానిపై టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ స్పందించాడు. ప్రపంచ అత్యుత్తమ ఆటగాడిని ఎంపిక చేసుకునే క్రమంలో తొమ్మిది మంది క్రికెటర్ల పేర్లను ఉదహరించిన సెహ్వాగ్..చివరకూ భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఓటేశాడు. ఈ మేరకు ఫేస్‌బుక్ వేదికగా ఫ్యాన్స్‌తో వీడియో చాట్‌లో పాల్గొన్న సెహ్వాగ్.. అన్ని ఫార్మాట్ల పరంగా చూస్తే ప్రస్తుత తరుణంలో కోహ్లీనే నంబర్ వన్ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. విరాట్ ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అనడానికి 3 వేర్వేరు ఫార్మాట్లలో కోహ్లీ నమోదు చేసిన యావరేజ్‌ను సెహ్వాగ్ ప్రస్తావించాడు. మూడు ఫార్మాట్లలోనూ విరాట్ 50.00పైగా నమోదు చేసిన సగటే అతన్ని అగ్రస్థానంలో నిలిపిందన్నాడు. తనకు పోటీదారులుగా ఉన్న క్రికెటర్లతో పోలిస్తే అన్ని ఫార్మాట్లలో యాభైకు పైగా యావరేజ్ సాధించిన ఏకైక క్రికెటర్ కోహ్లీనేనని సెహ్వాగ్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. మరొకవైపు దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో విరాట్ కోహ్లీ పరుగుల వరద పారించడం ఖాయమని వీరూ జోస్యం చెప్పాడు. శ్రీలంకతో ముగిసిన టెస్టు సిరీస్‌లో సెంచరీలు బాది సూపర్‌ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ.. సఫారీ గడ్డపై కూడా మెరుస్తాడన్నాడు.

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అక్షయ్ తొలి సెంచరీ



ఇండోర్ : గత నెల్లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన విదర్భ వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ తొలి సెంచరీ సాధించాడు. రంజీ ట్రోఫీ ఫైనల్లో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అక్షయ్ శతకం నమోదు చేశాడు. ఆదివారం టీ బ్రేక్‌కు ముందు అక్షయ్ ఫోర్ కొట్టి సెంచరీ మార్కును చేరాడు. మరొకవైపు ఏడో వికెట్‌కు ఆదిత్య సార్వేతే (79)తో కలిసి 169 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేశాడు. ఇది ఈ సీజన్‌లో విదర్భ ఏడో వికెట్ అత్యుత్తమ భాగస్వామ్యంగా నమోదైంది. ఈ క్రమంలోనే విదర్భ స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతుంది. రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు చేరి అరుదైన ఘనతను సొంతం చేసుకున్న విదర్భ.. తుది పోరులో కూడా అంచనాలు మించి రాణిస్తోంది. ఈ ఫైనల్ పోరులో విదర్భ బౌలర్ రజ్నీస్ గుర్బానీ ఆరు వికెట్లు సాధించడంతో ఢిల్లీ తన తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగులకే కుప్పకూలింది.

అదే నా చివరి క్రికెట్ టోర్నమెంట్



న్యూఢిల్లీ : 2019 ప్రపంచకప్ తన చివరి టోర్నమెంట్ అని తెలిపాడు శ్రీలంక బౌలర్ లతీశ్ మలింగ. గత కొన్నాళ్ల నుంచి మలింగ జట్టులో స్థానం దక్కించుకోలేకపోతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరులో భారత్‌తో జరిగిన ఓ టీ20లో మలింగ చివరిసారిగా ఆడాడు. త్వరలో బంగ్లాదేశ్‌తో జరగబోయే సిరస్‌కు మలింగకు సెలక్టర్లు స్థానం కల్పించలేదు. క్రికెట్ భవిష్యత్తు గురించి మలింగ తాజాగా ఓ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..సెలక్టర్లు నన్ను జట్టులోకి తీసుకుంటే ఆడేందుకు నేను సిద్ధంగానే ఉన్నాను. జట్టులో స్థానం కోసం నేను ఎదురుచూస్తున్నాను. వారు నాకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదో కారణం తెలియట్లేదు. 25, 26 ఏళ్ల వయసులో ఆటగాడికి విశ్రాంతి అవసరం. ఎందుకంటే అతడు భవిష్యత్తులో ఇంకా క్రికెట్ ఆడే అవకాశం ఉం టుంది కాబట్టి. నా వయసు వారికి విశ్రాంతి అవసరం లేదు. మహా అయితే రెండేళ్లు మాత్రమే అందు బాటులో ఉండగలం. వీలైనంత ఎక్కువ క్రికెట్ ఆడాలని మాకు ఉంటుంది. 2019 ప్రపంచకప్ వరకు క్రికెట్ ఆడాలని అనుకుంటున్నా. అదే నా చివరి టోర్నీ. ఆ తర్వాత ఎలా స్థిరపడతానో చెప్పలేను అని మలింగ వివరించాడు. వరుస పరాజయాలతో సతమవుతోన్న శ్రీలంక జట్టుకు ఆ దేశ మాజీ క్రికెటర్ చండిక కోచ్‌గా తాజాగా బాధ్యతలు స్వీకరించాడు. చండిక దృాఎష్టిని ఆకర్షించి మలింగ ఏ మేరకు జట్టులో స్థానం దక్కించుకుంటాడో చూడాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే.

క్రికెట్ నాకు ఆక్సిజన్‌తో సమానం



న్యూఢిల్లీ : క్రికెట్ తనకు ఆక్సిజన్‌తో సమానమని, క్రికెట్‌లేని తన జీవితాన్ని వూహించుకోలేనని, అది లేకపోతే తాను లేనని అంటున్నాడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్. ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రెట్ లీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సచిన్ ఎన్నో విషయాలను అభిమానులతో పంచుకున్నాడు. నిజం చెప్పా లంటే క్రికెట్ లేని నా జీవితాన్ని వూహించడమే కష్టం. క్రికెట్ నాకు ఆక్సిజన్‌తో సమానం. అది లేకుంటే నేను లేను. అది నా అభిరుచి. భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగిస్తాను. చాలా మంది నాతో 16-19 ఏళ్ల వయసులో సంతోషంగా గడిపే రోజులను నువ్వు చాలా కోల్పోయావు అని అంటుంటా రు. కానీ, 16 ఏళ్ల వయసులో దేశం తరఫున ఆడే అవకాశం ఎవరికి మాత్రం వస్తుంది చెప్పండి. ఇది నాకు దక్కిన గౌరవంగా నేను భావిస్తాను. మాతృదేశం తరఫున ఆడటంలోనే నాకు చాలా సంతోషం దక్కింది. మైదానంలో క్రికెట్ ఆడుతూ గడిపే సమయాన్ని నేను ఎంతో ఆస్వాదిస్తా. అదే నాకు ఎంతో సంతోషాన్ని, సంతృాఎప్తిని ఇచ్చేది అని తెలిపాడు. అనంతరం కోహ్లీ నేతృాఎత్వంలోని భారత జట్టుపై సచిన్ ప్రశంసల వర్షం కురిపించాడు. 1990ల్లో ఎలా అయితే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అంతర్జాతీయ క్రికెట్‌ను శాసించిందో ఇప్పుడు కోహ్లీ నేతృత్వంలోని భారత జట్టు కూడా టెస్టు, వన్డే ఫార్మాట్‌ను అలాగే శాసించే స్థాయికి వెళ్తుంది.ఇందులో ఎలాంటి అనుమానం లేదు. అప్పట్లో ఆసీస్ జట్టు ఎక్కడికి వెళితే అక్కడ తిరుగులేని విజయాలు సాధించేది. ఇప్పుడు మేము అలాగే విజయాలు సాధిస్తున్నాం. కనీసం 15నుంచి20 సంవత్సరాల పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో మా హవా కొనసాగడం ఖాయం. ప్రస్తుతం మన జట్టు ఎంతో అద్భుతంగా ఆడుతోంది అని సచిన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం కోహ్లీ నేతృాఎత్వంలోని భారత జట్టు దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది. మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య మొదటి టెస్టు జనవరి 5న ప్రారంభం కానుంది.

ద్రవిడ్ వల్లే జట్టులోకి హార్దిక్





న్యూఢిల్లీ : టీమిండియాలో సారథి విరాట్ కోహ్లీ స్థానానికి తప్ప అందరికీ పోటీ ఉంది. ఒకరు పోతే మరొకరు జట్టులోకి దూసుకొస్తున్నారు. అందివచ్చిన అవకాశాలను ఒడిసిపడుతున్నారు. గాయపడి దూరమైన వారు తిరిగి జట్టులోకి వస్తామో రామో అని సందేహపడేలా ప్రదర్శనలు ఇస్తున్నారు. ఐతే యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు మాత్రం ఆ సంకట పరిస్థితి లేదు! భారత్ ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పేస్ బౌలర్ ఆల్‌రౌండర్‌గా అతను గుర్తింపు పొందడమే కారణం. భారత్-ఏ కోచ్ రాహుల్ ద్రవిడ్ సిఫార్సు వల్లనే పాండ్య భారత జట్టులోకి దూసుకొచ్చాడు. పాండ్య ఎదుగుదలలో, మానసిక పరిణతి సాధించడంలో ద్రవిడ్ పాత్ర ఎంతైనా ఉంది. హార్దిక్ తన సామర్థ్యంతో జట్టులోకి వచ్చాడు. అతడు చక్కని ప్రదర్శనలు ఇవ్వగలడు. బృాఎందంలో ఎక్స్ ఫ్యాక్టర్‌గా కనిపిస్తాడు. భారత జట్టులో ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఉంటే పోటీ మరోలా ఉంటుంది. పేసర్, స్పిన్నర్‌గా జట్టులో ఉంటే చాలా కష్టం. దేశంలో చాలా మంది ఉన్నారు. అదే మీరు ఫాస్ట్ బౌలర్ ఆల్‌రౌండర్ అయితే ఆ ప్రత్యేకతే వేరు అని ద్రవిడ్ అన్నారు. అంతకుముందు సెలక్షన్ కమిటీతో సమావేశం అయినప్పుడు ఏం జరిగిందో ద్రవిడ్ వివరించాడు. నేను భారత్-ఏ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు భవిష్యత్తు కోసం ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను వెతకాల్సిన ఆవశ్యకత ఉంది. విజయ్ శంకర్, స్టువర్ట్ బిన్నీ ఆ పాత్రలు పోషించారు. శంకర్ గాయపడటంతో హార్దిక్ పాండ్యకు అవకాశం వచ్చింది. ఆస్ట్రేలియా సిరీస్‌లో అవకాశాన్ని రెండు చేతులా ఒడిసిపట్టాడు. వేగంగా బౌలింగ్ చేయడమే కాకుండా అందంగా బ్యాటింగ్ చేశాడు. బ్రిస్బేన్ టెస్ట్‌లో 46 పరుగులకే 6 వికెట్లు తీయడమే కాకుండా బ్యాటింగ్‌లో 79 పరుగులు చేశాడు. అలా టీమిండియాకు ఎంపికయ్యాడు అని ద్రవిడ్ పేర్కొన్నారు.

రాష్ట్ర సైక్లింగ్ జట్టు కెప్టెన్ ఆకాశ్

హైదరాబాద్ : జాతీయ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బృందాన్ని ప్రకటిం చారు. 25 మంది సభ్యులతో కూడిన ఈ జట్టు కు కె.ఆకాశ్ సారథ్యం వహించనున్నాడు.

వివరాలు : కె. ఆకాశ్, సోను గుప్తా, ఎ.రాజ్‌కుమార్, బి.ముగేశ్, కె.అనిరుధ్, ఎం.తనిష్క్ (హైదరాబాద్), వి.శైలేంద్రనాథ్, టి.అఖిల్, కౌషిక్ (కరీంనగర్), కె. ప్రణయ్, ఎ.అరుణ్, బి.మహేశ్, కె.శ్రీరామ్, శ్రీనివాస్ (జనగాం), జె. రాకేశ్, టి. సాయి తరుణ్, వి.ఉదయ్ కుమార్ (సిద్దిపేట్), సీహెచ్. రణధీర్, జె.ప్రణయ్, సమీర్, కె.శ్రీరామ్ నాయక్ (వరంగల్), పాండు (ఆదిలాబాద్), ఎన్. రమేశ్‌బాబు (సీనియర్ మేనేజర్), విజయ్ భాస్కర్‌రెడ్డి (సీనియర్ కోచ్).

లోధా కమిటీ నిబంధనలకు ఓకే



వుణె : క్రికెట్ పరిపాలనలో జస్టిస్ ఆర్ఎం లోధా కమిటీ ప్రతిపాదించిన అన్ని సంస్కరణలను అమలు చేయనున్నట్టు మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) తెలిపింది. శుక్రవారం జరిగిన ప్రత్యేక పరిపాలనా కమిటీ సమావేశంలో సంస్కరణల అమలుకు తలూపింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర క్రికెట్ సంఘం లోధా కమిటీ సంస్కరణలు అమలు చేసేందుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సభ్యు లందరూ తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సంస్కరణలకు ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను అని ఎంసీఏ అధ్యక్షుడు అభయ్ ఆప్టే పేర్కొన్నారు. ఈ సమావేశానికి సుప్రీం కోర్టు ఉద్వాసన పలికిన బీసీసీఐ మాజీ కార్యదర్శి అజయ్ షిర్కే హాజరయ్యారని తెలిసింది. ఎంసీఏలో షిర్కే సభ్యుడు కాబట్టి సమావేశాలకు హాజరయ్యే అధికారం ఆయనకు ఉంటుందని మరో సభ్యుడు తెలిపారు. సుప్రీం ఆదేశాల అనుసరం ఒక్కొక్క అనుబంధ సంఘం లోధా సంస్కరణలకు అంగీకరిస్తున్నాయి. నిధులు విడుదల చేయకుండా అడ్డుకోవడంతో అవి ఒత్తిడికి తలొగ్గుతున్నాయి. ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. బీసీసీఐ మాత్రం కొన్ని నియమాలను వ్యతిరేకిస్తోంది. ఒక రాష్ట్రానికి ఒక ఓటు, పాలకులకు వయో పరిమితి విధింపు, ఒక వ్యక్తికి ఒక పదవి, రెండు పదవుల మధ్య కూలింగ్ ఆఫ్ పీరియడ్ అంశాలను ఒప్పుకోవడం లేదు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33 . PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·